


# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు


## తెలుగుజాతి గర్వించే
## ఉద్విగ్న క్షణాలివి..!

అయిదుకోట్ల ప్రజల కోసం అమరావతి రైతులు చేసిన త్యాగం ఫలించింది... జయహో అమరావతి అంటూ 1631రోజులపాటు వారు చేసిన చారిత్రాత్మక ఉద్యమం విజయబావుటా ఎగురవేసింది. ఆంధ్రుల కలల రాజధాని అమరావతి గురించి లోక్‌సభలో చర్చ మొదలవ్వగానే వైకాపా ఎంపీలలో వణుకు మొదలైంది. అమరావతి అభివృద్ధిపై జరుగుతున్న సానుకూల చర్చను తట్టుకోలేక, అడ్డుకునే ధైర్యం లేక చివరకు తోకముడిచి సభ నుంచి బయటకు పారిపోయారు. ఇక ఏ దుష్టశక్తీ అడ్డుకోవడానికి వీల్లేకుండా ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆశలు, ఆకాంక్షలకు పార్లమెంటు ఆమోద ముద్ర వేసింది. యావత్ తెలుగుజాతి గర్వించే ఉద్విగ్న క్షణాలివి....!

# జయహో అమరావతి


## చారిత్రాత్మక బిల్లుకు లోక్‌సభ ఆమోదముద్ర



2

## అమరావతి అజేయం.. అజరామరం...

**సిఎం చంద్రబాబు నాయుడు**



అమరావతి భవిష్యత్తుపై ఉన్న సందిగ్ధతకు శాశ్వతంగా తెరపడింది. రైతుల త్యాగానికి, ప్రజల ఆకాంక్షలకు దక్కిన గౌరవం ఇది. స్వర్ణాంధ్ర నిర్మాణంలో ఇది ఓ కీలక మైలురాయి. అమరావతి ఇక అజేయం.. అజరామరం...

## రాష్ట్రప్రజలు గర్వించే క్షణాలివి

**ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్**



ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు లోక్ సభ ఆమోదం పొందటంతో రాష్ట్ర ప్రజలందరూ సంతోషంతో ఉన్నారు. వారంతా గర్వించే క్షణాలివి. ఈ చట్టబద్ధతతో అమరావతి శాశ్వత రాజధానిగా నిలుస్తుంది.

## ఆంధ్రప్రదేశ్ ప్రజల విజయం

**విద్య, ఐటిశాఖల మంత్రి లోకేష్**



ఇది ఐదుకోట్ల ఆంధ్రుల ఆకాంక్ష అమరావతి విజయం.. ఆంధ్రప్రదేశ్ ప్రజల విజయం.. ఇది రైతుల త్యాగాలకు దక్కిన దైవ ఆశీస్సులు.. శాంతియుత పోరాటానికి దక్కిన ఫలితం.. కోట్లాది ప్రజల కోరికను గౌరవించిన కేంద్రం ఆంధ్రుల ఆత్మగౌరవ రాజధానిగా అమరావతిని నిలిపింది.



## శ్రీరాముని ఆశీస్సులతో ధర్మపాలన

- ఒంటిమిట్టలో సీతారాముల కళ్యాణ మహోత్సవం
- పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించిన ముఖ్యమంత్రి దంపతులు

4



## ప్రతి ఆంధ్రుడు గర్వంగా నిలిచే రోజు ఇది!

- అమరావతి ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక
- ఐదుకోట్ల ఆంధ్రుల ఆకాంక్షలకు ప్రతిఫలం
- స్వర్ణాంధ్ర నిర్మాణంలో కీలక మైలురాయి
- టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

5



## ఏపికి అమరావతే ఏకైక రాజధాని

- ఎవరూ అంగుళం కూడా కదల్చలేరు
- నెల్లూరు జిల్లా వింజమూరులో పేదల సేవలో పాల్గొన్న సీఎం చంద్రబాబు

3

చైతన్యరథం

# జయహో.. అమరావతి!

- తెలుగుజాతి గర్వించే ఉద్విగ్న క్షణాలు
- ప్రజావిశ్వాసం ముందు ఓడిపోయిన విద్వేషపు రాజకీయం
- అమరావతి బిల్లును ఎదుర్కొనే దమ్ములేక సభనుంచి వైసిపి పరార్
- చారిత్రాత్మక అమరావతి బిల్లుకు లోక్ సభ ఆమోదముద్ర

## అమరావతి అజేయం... అజరామరం..!

### ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

అమరావతి(చైతన్యరథం): ప్రజా రాజధాని అమరావతి ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక అని ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. అమరావతి బిల్లు లోక్ సభలో ఆమోదం పొందాక ఆయన ట్విట్టర్‌లో స్పందిస్తూ... ఈరోజు లోక్‌సభలో అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లు ఆమోదం పొందడం ఆంధ్రులకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను. గత పాలనలో ఎదు రైన చీకట్లుతొలగిపోయి, అమరావతి భవిష్యత్తుపై ఉన్న సందిగ్ధతకు శాశ్వతంగా తెరపడింది. రైతుల త్యాగానికి, ప్రజల ఆకాంక్షలకు దక్కిన గౌరవం ఇది.



స్వర్ణాంధ్ర నిర్మాణంలో ఇది ఓ కీలక మైలు రాయి. అమరావతి ఇక అజేయం.. అజరామరం. రాజధానిని విశ్వ నగరంగా తీర్చిదిద్ది ప్రపంచ పటంలో నిలుపుతాం. సహకరించిన కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోదీజీకి, హోం మంత్రి అమిత్ షాకి హృదయపూర్వక ధన్యవాదాలు. లోక్ సభలో బిల్లుకు మద్దతు పలికిన అన్ని పార్టీలకు ఆంధ్రప్రదేశ్ ప్రజల తరఫున చంద్రబాబునాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

## రాష్ట్ర ప్రజలు గర్వించే క్షణాలివి!

### ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్

అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు లోక్ సభ ఆమోదం పొందటంతో రాష్ట్ర ప్రజలందరూ సంతోషంతో ఉన్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ అన్నారు. పార్లమెంటులో బిల్లు ఆమోదం పొందిన తర్వాత ఆయన స్పందిస్తూ... వారంతా గర్వించే క్షణాలివి. ఈ చట్టబద్ధతతో అమరావతి శాశ్వత రాజధానిగా నిలుస్తుంది. లోక్ సభలో ఈ బిల్లుకు మద్దతు తెలియచేసిన పక్షాలకు, ఎంపీలకు ధన్యవాదాలు తెలియచేస్తున్నాను.



అమరావతికి చట్టబద్ధత అభించడాన్ని జీర్ణించుకోలేక విషం చిమ్ముతున్నవారికి రాబోయే రోజుల్లో ప్రజలు మరింత బలమైన పాఠం నేర్పిస్తారు. రాజధాని అమరావతికి తోడ్పాటును అందిస్తున్న గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీజీకి, కేంద్ర హోంశాఖామాత్యులు అమిత్ షాకి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియచేస్తున్నాను. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి అపార అనుభవంతో అమరావతి ప్రజా రాజధానికి, భావితరాల అభివృద్ధికి కేంద్రంగా నిలుస్తుందనే విశ్వాసం ఉందని పవన్ కళ్యాణ్ అన్నారు.



*(చైతన్యరథం ప్రతినిధి – అమరావతి)*

*అయిదుకోట్ల ప్రజల కోసం అమరావతి రైతులు చేసిన త్యాగం ఫలించింది... జయహో అమరావతి అంటూ 1631రోజులపాటు వారు చేసిన చారిత్రాత్మక ఉద్యమం విజయబావుటా ఎగురవేసింది. ఆంధ్రుల కలల రాజధాని అమరావతి గురించి పార్లమెంటులో చర్చ మొదలవ్వగానే వైకాపా ఎంపీలలో వణుకు మొదలైంది. అమరావతి అభివృద్ధిపై జరుగుతున్న సానుకూల చర్చను తట్టుకోలేక, అడ్డుకునే ధైర్యం లేక చివరకు తోకముడిచి సభ నుంచి బయటకు పారిపోయారు. ఇక ఏ దుష్టశక్తీ అడ్డుకోవడానికి వీల్లేకుండా ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆశలు, ఆకాంక్షలకు పార్లమెంటు ఆమోద ముద్ర వేసింది. యావత్ తెలుగుజాతి గర్వించే ఉద్విగ్న క్షణాలను 5కోట్ల ఆంధ్రులు ఆనందంతో ఆస్వాదించారు. తల్లి ఆశీర్వాదం ఉంటే ప్రకృతి కూడా తోడవుతుంది. ధర్మం వైపు పోరాటం ఉంటే.. దేశమే కదిలివస్తుంది. నేడు భారత లోక్‌సభ సాక్షిగా అదే జరిగింది. ఐదేళ్ల అణచివేత, 1631రోజుల రోజులపాటు నిద్రాగారాలు మాని ముళ్ల కంచెలు, పోలీసు బూట్ల చప్పుడు.. వీటన్నింటినీ తట్టుకుని నిలబడ్డ 'అమరావతి' మహిళల త్యాగం నేడు భారత పార్లమెంటు రికార్డుల్లో స్వర్ణాక్షరాలతో లిఖించబడింది. ఏపీ రాజధానిగా అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. దీంతో ఈ బిల్లు రేపు రాజ్యసభ ముందుకు వెళ్లనుంది. ఈ బిల్లుపై చర్చ సందర్భంగా పలువురు మంత్రులు, ఎంపీలు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ, సమాజ్‌వాదీ పార్టీ మద్దతు ఇచ్చాయి. ప్రస్తుత 18వ లోక్‌సభ 41 రాజకీయ పక్షాలు.. ఎన్నో భిన్నాభిప్రాయాల వేదిక, అయితే ఆంధ్రుల ఆత్మాభిమానం 'అమరావతి' బిల్లు ముందుకు రాగానే, ఆ 41 పార్టీలు తమ జెండాలను పక్కనపెట్టాయి. ఒకే ఒక్క 'ఎజెండా'తో ముందుకు వచ్చాయి.. అదే అయిదుకోట్ల ఆంధ్రుల గుండెగొంతుక అమరావతి.*

### పార్లమెంటులో వైకాపా డ్రామాలు

*లోక్‌సభ సాక్షిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నైజం మరోసారి బయటపడింది. రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమని ఆ పార్టీ ఎంపీలు మరోసారి నిరూపించుకున్నారు. లోక్‌సభలో కీలక బిల్లుపై చర్చ జరుగుతుండగా, మద్దతు తెలపాల్సింది పోయి.. సభ నుంచి వాకౌట్ చేసి తమ బాధ్యత నుంచి తప్పించుకున్నారు. చిత్రమేమిటంటే.. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ఆరోపణలు ఎదుర్కొంటూ, ప్రస్తుతం కేవలం బెయిలు మీద ఉన్న మిథున్ రెడ్డిని అడ్డం పెట్టుకుని వైకాపా అబద్ధాల రాజకీయం నడిపించే ప్రయత్నం చేసింది. సభలో వాస్తవాలను పక్కనపెట్టి, పచ్చి అబద్ధాలతో సభ్యులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసిన మిథున్, ఆ తర్వాత తన సహచర ఎంపీలతో కలిసి బయటకు నడిచారు. సీఎం రమేశ్ మీద వ్యక్తిగత దూషణలకు పాల్పడి సభాపతితో చివాట్లు తిన్నారు. ఆంధ్రుల కలల రాజధాని అమరావతి గురించి పార్లమెంటులో చర్చ మొదలవ్వగానే వైకాపా ఎంపీలలో వణుకు మొదలైంది. అమరావతి అభివృద్ధిపై జరుగుతున్న సానుకూల చర్చను తట్టుకోలేక, దాన్ని అడ్డుకునే ధైర్యం లేక చివరకు తోకముడిచి సభ నుంచి బయటకు పరారయ్యారు. రాష్ట్ర రాజధాని వంటి కీలక అంశంపై చర్చ జరుగుతుంటే పారిపోవడం అంటే.. ఏపీ అభివృద్ధిని అడ్డుకోవడమేనని రాజకీయ విశ్లేషకులు మండిపడుతున్నారు.*

### ఏకతాటిపైకి వచ్చిన 41 రాజకీయ పక్షాలు

*భిన్నధృవాలుగా ఉండే ఎన్ డిఎ, ఇండియా కూటములు అమరావతి విషయంలో మాత్రం ఏకతాటిపైకి వచ్చాయి. ఎన్‌డీఏ కూటమిలోని 17 పార్టీలు జై అమరావతి అంటూ గర్వంగా నినదించాయి. ఇండియా కూటమిలోని 18 పార్టీలు కూడా ఆంధ్రుల ఆకాంక్షను గౌరవించాయి. స్వతంత్రులు, ఇతర 5 పార్టీలు సైతం రాజధాని రైతు త్యాగానికి సెల్యూట్ చేశాయి. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, హిమాలయాల నుంచి హిందూ మహాసముద్రం వరకు.. భారత ప్రజాస్వామ్య గొంతుకలన్నీ ఏకగ్రీవంగా "అమరావతి – ఆంధ్రుల ఏకైక రాజధాని" అని ముక్తకంఠంతో చాటిచెప్పాయి. సముద్రమంత మద్దతు ఉన్న చోట.. ఒక చిన్న విద్వేషపు చుక్క ఎంతటి అపహాస్యానికి గురవుతుందో లోక్‌సభలో అమరావతి బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంగా అర్థమైంది. 41 పార్టీల ఈ మహా సభలో కేవలం వైకాపా మాత్రమే ఆంధ్రుల కలలకు అడ్డుపడింది. 11 పార్టీలు చర్చలో పాల్గొంటే, విధ్వంసమే ఎజెండా పనిచేసే వైకాపా ఎంపిలు మాత్రం తమ వంతు విషం కక్కి, మొహం చాటేసి, ప్రజల ఆకాంక్షను తృణీకరించి, సభను బహిష్కరించి పరారయ్యారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే అహంకారమే మిన్న అనుకున్న వైకాపా వైఖరి నేడు దేశం ముందు నవ్వులపాలైంది. ఒకే ఒక్క పార్టీ వ్యతిరేకించి వాకౌట్ చేసి వెళ్లిపోయినా, 40పార్టీల ఆశీర్వాదం అమరావతికి రక్షణ కవచంలా నిలిచింది. ఇది కేవలం ఒక బిల్లు విజయం కాదు.. ఎకరాల భూమిని విజనరీ లీడర్ చంద్రబాబునాయుడును నమ్మి 33వేల ఎకరాలను కేవలం 58రోజుల్లో ప్రభుత్వానికి అందించిన 29వేలమంది అమరావతి రైతుల ఆత్మగౌరవ విజయం. ఎర్రటి ఎండలో రోడ్డెక్కిన తల్లుల పోరాటానికి దక్కిన గౌరవం. ఆనాడు కన్నీళ్లు తుడిచే నాథుడు లేకపోయినా, ఈనాడు భారత పార్లమెంటే వారికి సాష్టాంగ నమస్కారం చేసింది. అమరావతి ఇప్పుడు కేవలం ఒక రాష్ట్ర రాజధాని కాదు.. 140కోట్ల భారతీయులు ముద్దుగా పిలిచిన ప్రజా రాజధాని'. అమరావతి రైతుల త్యాగం ముందు విద్వేషపు రాజకీయం ఓడిపోయింది.. విశ్వాసం గెలిచింది. 41 పక్షాల ఆశీస్సులతో ఆంధ్రుడి ఆశయం సిద్ధించింది. చీకటి రోజులు ముగిశాయి.. దేవతల అమరావతి అజరామరం... ఇక ఏ దుష్టశక్తీ ఆంధ్రుడి గుండెల నుంచి అమరావతిని విడదీయలేదు...జయహో అమరావతి...!*

## ఆంధ్రప్రదేశ్ ప్రజల విజయం!

### విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేష్

అమరావతి (చైతన్యరథం): నా రాష్ట్రం ఆంధ్రప్రదేశ్–నా రాజధాని అమరావతి అని ఐదుకోట్ల ఆంధ్రులు గర్వంగా నినదించే చారిత్రాత్మకమైన రోజుకు దేశ పార్లమెంటు వేదిక కావడం చాలా సంతోషంగా ఉందని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. లోక్ సభలో అమరావతి బిల్లు ప్రవేశపెట్టినప్పటి నుంచి ఆమోదం పొందేవరకు ఆయన ఉండవల్లి నివాసం టివి చూస్తూ ఎప్పటికప్పుడు పరిణామాలను గమనిస్తూ ఉన్నారు. బిల్లు ఆమోదం పొందాక లోకేష్ స్పందిస్తూ... ఒకే రాష్ట్రం–ఒకే రాజధాని నినాదంతో అభివృద్ధి వికేంద్రీకరణ విధానంతో రాజధానిగా అమరావతిని నిర్ణయిస్తూ ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ చేసిన ఏకగ్రీవ తీర్మానానికి చట్టబద్ధత కల్పించే అమరావతి బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టి, ఆమోదించడం కోట్లాది ప్రజలు గర్వించదగ్గ సందర్భం. కేంద్రప్రభుత్వానికి, మద్దతుగా నిలిచిన పార్టీలకు కృతజ్ఞతలు. ఇది ఐదుకోట్ల ఆంధ్రుల ఆకాంక్ష అమరావతి విజయం.. ఆంధ్రప్రదేశ్ ప్రజల విజయం.. ఇది రైతుల త్యాగాలకు దక్కిన దైవ ఆశీస్సులు.. శాంతియుత పోరాటానికి దక్కిన ఫలితం.. కోట్లాది ప్రజల కోరికను గౌర వించిన కేంద్రం ఆంధ్రుల ఆత్మ గౌరవ రాజధానిగా చరిత్ర–సంస్కృతికి ఆలవాలమైన అమరావతిని నిలిపింది. జై ఆంధ్రప్రదేశ్..జయహో అమరావతి... తమ ఆనందాన్ని పంచుకున్నారు. అమరావతి చట్టబద్ధత బిల్లుపై పార్లమెంటులో జరిగిన చర్చ మొత్తం టీవీలో చూసిలో చూశానని, అక్కడి చర్చ ఉత్కంఠ రేపిందన్నారు. అమరావతి చరిత్ర–సంస్కృతి, ఆవశ్యకత సభ్యులు వివరిస్తుంటే ఒక ఆంధ్రుడిగా రోమాలు నిక్కబొడుచుకున్నాయి. కేంద్ర ప్రభుత్వం, దేశంలోని వివిధ పార్టీలు మద్దతుగా నిలవడం ఐదుకోట్ల ఆంధ్ర ప్రజల ఆకాంక్షకు అద్దం పట్టింది. లోక్ సభ వేదికగా అమరావతి గొప్పతనం దేశమంతటికీ మరోసారి పరిచయమైంది. దేశ రాజధాని ఢిల్లీలో ప్రజాస్వామ్య దేవాలయం పార్లమెంటులో చరిత్ర సృష్టించిన అమరావతి చట్టబద్ధత బిల్లు చర్చలో పాల్గొనకుండా వైసీపీ సభ్యులు వాకౌట్ చేయడం వారి ద్రోహబుద్ధికి నిదర్శనం. జగన్ ఎన్ని జన్మలెత్తినా అమరావతిలో ఒక్క ఇటుకనూ తాకలేడు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధినీ ఆపలేడు. నా రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ శాశ్వతం, నా రాజధాని అమరావతి అజరామరం అంటూ లోకేష్ తమ ఆనందాన్ని వ్యక్తంచేశారు.



# ఏపికి అమరావతే ఏకైక రాజధాని

- ఎవరూ అంగుళం కూడా కదల్చలేరు
- పార్లమెంటులో బిల్లుపై స్పందించిన సీఎం
- చేనేతలకు అండగా దండగా ప్రజా ప్రభుత్వం
- రాష్ట్రంలో 5 చోట్ల హ్యాండ్లూమ్ క్లస్టర్ల ఏర్పాటు
- సుపరిపాలనా మహాయజ్ఞాన్ని అడ్డుకుంటే సహించేది లేదు
- రాష్ట్రంలో కొందరు చేసేవి హిట్ అండ్ రన్ నేర రాజకీయాలు
- నెల్లూరు జిల్లా వింజమూరులో పేదల సేవలో పాల్గొన్న సీఎం చంద్రబాబు




నెల్లూరు (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇక అమరావతే ఏకైక రాజధాని అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఎవరూ అంగుళం కూడా రాజధానిని కదల్చలేరని ఆయన అన్నారు. అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందటంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. నెల్లూరు జిల్లా వింజమూరులో పేదల సేవలో కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి... ప్రజావేదిక సభలో ప్రసంగించారు. ప్రజా రాజధాని అమరావతి ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక అని.. లోక్‌సభలో చట్టబద్ధత బిల్లుకు ఆమోదం పొందటం ఆంధ్రులకు దక్కిన గౌరవమని సీఎం అన్నారు. బిల్లు ఆమోదంతో అమరావతి భవిష్యత్తుపై ఉన్న సందిగ్ధతకు శాశ్వతంగా తెరపడిందని తెలిపారు. రాజధానిని విశ్వనగరంగా తీర్చిదిద్దుతామని ఆయన వెల్లడించారు. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలకు ధన్యవాదాలు తెలిపిన ముఖ్యమంత్రి.. ఈ బిల్లుకు మద్దతు పలికిన పార్టీలకు రాష్ట్ర ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియచేశారు. గత పాలకులు మూడు ముక్కలాటతో విధ్వంసం చేసి రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారని ఆక్షేపించారు. రాజధానికి చట్టబద్ధత కల్పించే అంశంపై అసెంబ్లీలో తీర్మానం పెడితే కనీసం శాసనసభ సమావేశాలకు కూడా ఆ పార్టీ హాజరు కాలేదన్నారు. రాజధాని ప్రాంతాన్ని స్మశానమని, ఏడారి అని, ముంపు ప్రాంతమని ఎగతాళి చేసి ఆనందించారని సీఎం ఆరోపించారు.

## సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నాం

ప్రతీ నెలా మొదటి తేదీన పేదల సేవలో ద్వారా పెద్ద ఎత్తున సంక్షేమం చేస్తున్నామని ముఖ్యమంత్రి అన్నారు. కూటమి ప్రభుత్వంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు అంతా పేదల సేవలో ఉంటున్నామని తెలిపారు. ప్రతీ నెలా రూ. 2,750 కోట్లను పెన్షన్ల కోసం వ్యయం చేస్తున్న ప్రభుత్వం ఏపీనే అని సీఎం వివరించారు. పొరుగున తమిళనాడులో కేవలం రూ. వెయ్యి మాత్రమే పెన్షన్‌గా ఇస్తున్నారని అన్నారు. ప్రజలపై ఉన్న అభిమానంతోనే పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాల్ని చేయగలుగుతున్నామని సీఎం వివరించారు. గత ఏడాది జూన్‌లో తల్లికి వందనం కింద ఆర్థిక సహకారం అందించామని.. ఈ ఏడాది జూన్‌లోనూ తల్లుల ఖాతాల్లో నిధులు జమ చేస్తామని తెలిపారు. దీపం 2.0 కింద ఏడాదికి 3 ఉచిత సిలెండర్లను ఇస్తున్నామని త్వరలోనే ప్రతీ ఇంటికీ పైప్ ద్వారా గ్యాస్ అందించేందుకు చర్యలు చేపడుతున్నట్టు వివరించారు. దీని కోసం ఏడాదికి రూ. 2400 సబ్సీడిని కూడా వినియోగదారుల ఖాతాల్లో వేస్తామని తెలిపారు. పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం అడ్వాన్సుగా రూ. 1300 కోట్లను ఇచ్చిందని గోదావరి పుష్కరాల నాటికి ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామన్నారు. పేదల జీవన ప్రమాణాలు పెంచేందుకు పీ4 కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు. 25 వేల కుటుంబాల్ని దత్తత తీసుకునేందుకు అదానీ ట్రస్టు కూడా ముందుకు వచ్చిందని ముఖ్యమంత్రి వివరించారు.








## జువ్వలదిన్నెపై దుష్ప్రచారం

ఉదయగిరి నియోజకవర్గం వింజమూరు పాతచెరువుకు సోమశిల కాలువ నుంచి నీటిని తరలించేందుకు రూ. 34 కోట్లతో పనులు చేపడతామని దీనిపై తక్షణం ఆదేశాలు జారీ చేస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఈ ఏడాది అక్టోబరు నాటికి చెరువును నింపుతామని భరోసా ఇచ్చారు. నీటి భద్రత కోసం స్థానిక వింజమూరు ప్రజలు వేసిన ఒక్క అడుగుకు ప్రజా ప్రభుత్వం వంద అడుగులు ముందుకు వేసి తోడుగా నిలబడుతుందన్నారు. రూ. 70 లక్షల వ్యయంతో చెరువును పునరుద్దరణకు తీసుకున్న చొరవను ముఖ్యమంత్రి అభినందించారు. నీటి సంరక్షణ కోసం ప్రజలు ఇదే స్ఫూర్తితో పనిచేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. నెల్లూరు జిల్లాలో పెద్ద ఎత్తున పారిశ్రామిక అభివృద్ధి జరుగుతోందని.. రామాయపట్నం పోర్టు, దుగరాజపట్నం షిప్ బిల్డింగ్ సెంటర్‌తోపాటు రక్షణ పరికరాలు, మానవ రహిత విమానాలు తయారవుతాయని.. ఇఫ్కో సెజ్‌లో ఏర్పాటు కానున్న సౌర ఫలకాల తయారీ సహా వేర్వేరు పరిశ్రమల ద్వారా 80 వేల మందికి ఉద్యోగాలు వస్తాయన్నారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని 2018 లోనే కేంద్రానికి లేఖ రాసి ఫిషింగ్ హార్బర్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు చేసినట్టు ముఖ్యమంత్రి వెల్లడించారు. రూ. 285 కోట్లతో దీని నిర్మాణం చేపట్టామని.. దీనిని వక్రీకరించి కొందరు హిట్ అండ్ రన్ నేరాల రాజకీయం చేస్తున్నారని సీఎం ఆక్షేపించారు. 2019-24 మధ్య జరిగిన అరాచక, విధ్వంస పాలన కొనసాగిందని అలాంటి వ్యక్తిని తన జీవితంలో చూడలేదని ముఖ్యమంత్రి అన్నారు. కూటమి పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు ఎవరూ మత్స్యకారులకు అన్యాయం చేసే పరిస్థితి ఉండదన్నారు. తమిళనాడు నుంచి వచ్చే మత్స్యకారులు ఎవరూ మన జలాల్లో చేపల వేట చేయకుండా నిఘా పెట్టాలని నెల్లూరు, తిరుపతి కలెక్టర్లను సీఎం వేదిక నుంచి ఆదేశించారు.

## నేతన్నలకు వెన్నుదన్నుగా ఉచిత విద్యుత్

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేరుస్తూ ఇవాల్టి నుంచి చేనేతలకు ఉచిత విద్యుత్ పథకాన్ని అమల్లోకి తీసుకువస్తున్నట్టు ముఖ్యమంత్రి ప్రకటించారు. 93 వేల చేనేత మగ్గాలకు 200 యూనిట్ల వరకూ, 11,488 పవర్ లూమ్ లకు 500 యూనిట్ల వరకూ ఉచితంగా విద్యుత్ అందిస్తామని తెలిపారు. దీని కోసం మొత్తం 153 కోట్లను వ్యయం చేస్తున్నామని.. ఉచిత విద్యుత్ పథకం వల్ల ఒక్కో చేనేత కుటుంబానికి వేల రూపాయల మేర ఆదా అవుతుందన్నారు. నేతన్న సంక్షేమానికి.. వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి వివరించారు. చేనేతల సంక్షేమం కోసం రూ. 5 కోట్లతో త్రిఫ్ట్ ఫండ్ ఏర్పాటు చేశామని.. 55 ఏళ్లకే పెన్షన్ కూడా అందిస్తున్నట్టు తెలిపారు. నేషనల్ రూరల్ లైవ్లీ హుడ్ పథకం కింద 5 చోట్ల హ్యాండ్లూమ్ క్లస్టర్లను ప్రారంభించబోతున్నట్టు సీఎం ప్రకటించారు. అనంతరం లబ్దిదారులకు ఉచిత విద్యుత్ సరఫరా ధృవపత్రాలను అందించారు.

21 నెలల్లో 5.5 లక్షల గృహప్రవేశాలు చేయించామని.. డిసెంబరు లోగా 4.5 లక్షల ఇళ్లలో ప్రవేశించేలా నిర్మాణాలు పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి వివరించారు. ప్రజలందరికీ పౌరసేవలు మెరుగ్గా అందించటంతో పాటు వాటిపై ప్రజాభిప్రాయాన్ని కూడా సేకరిస్తున్నామని తెలిపారు. పౌరసేవలు సరిగా అందకపోయినా.. మౌలిక సదుపాయాలు కల్పించకపోయినా ఆకస్మిక తనిఖీలు చేసి కఠినంగా వ్యవహరిస్తానని సీఎం స్పష్టం చేశారు. సుపరిపాలనా మహాయజ్ఞానికి ఎవరు నష్టం కలిగించినా సహించబోనని ముఖ్యమంత్రి హెచ్చరించారు. ప్రజావేదిక సమీపంలో సూక్ష్మసేద్యం సహా డ్రోన్ సహకారంతో సేద్యానికి సంబంధించిన స్టాళ్లను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి మంత్రి ఫరూఖ్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, బీదమస్తాన్ రావు, ఉదయగిరి శాసనసభ్యుడు కాకర్ల సురేశ్, జిల్లా కలెక్టర్ హిమాన్షూ శుక్లా తదితరులు హాజరయ్యారు.











# శ్రీరాముని ఆశీస్సులతో ధర్మపాలన

## ఒంటిమిట్టలో సీతారాముల కళ్యాణ మహోత్సవం

## పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించిన ముఖ్యమంత్రి దంపతులు

ఒంటిమిట్ట (చైతన్యరథం): శ్రీరాముని ఆశీస్సులతో ధర్మాన్ని అనుసరించి ధర్మపాలన అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. రాముడు పేరు వినగానే గుర్తొచ్చేది రామరాజ్యం.. సుపరిపాలన అని వ్యాఖ్యానించారు. ఒంటిమిట్ట సీతారాముల వారి కళ్యాణ మహోత్సవం సందర్భంగా స్వామి వారికి సతీసమేతంగా పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. ముఖ్యమంత్రికి ఆలయ పండితులు స్వామి వార్ల చిత్రపటాన్ని అందించి ప్రసాదాలను అందించారు. అనంతరం జై శ్రీరామ్ నినాదంతో ప్రసంగాన్ని ప్రారంభించారు. 'మనందరికీ ఈరోజు చాలా పవిత్రమైనది. సీతారాముల వారి కళ్యాణోత్సవంలో పాల్గొనడం మనందరి అదృష్టం. వేంకటేశ్వరస్వామి కూడా మన రాష్ట్రంలోనే కొలువై ఉండటం గొప్పవరం. రాష్ట్రం ఎప్పుడూ సుభిక్షంగా ఉండాలని, రాముడు రామరాజ్యాన్ని అందించినట్లుగానే కూటమి పాలన సాగేలా ఆశీర్వదించాలని ఆకాంక్షిస్తున్నా. ప్రజలకు సందప, ఆరోగ్యం, ఆనందం ఇవ్వాలని శ్రీరాముణ్ని ప్రార్థించా. సమైక్య రాష్ట్రంలో భద్రాచలంలో శ్రీరామనవమి జరుపుకునేవాళ్లం. విభజన తర్వాత ఒంటిమిట్టను టీటీడీలో విలీనం చేసి ఏటా ఘనంగా బ్రహ్మోత్సవాలు జరుపుకుంటున్నాం. ఈ రోజు లోక్‌సభలో అమరావతి రాజధానిగా ప్రవేశపెట్టిన బిల్లు ఆమోదం పొందింది. నాడు అమరావతి రాజధానిగా దేవేంద్రుడు పాలిస్తే... నేడు ప్రజారాజధానిగా అమరావతి ఉంది. రాముడు రామరాజ్యాన్ని ఇచ్చినట్లుగానే రాముడి ఆశీస్సులతో ధర్మాన్ని పాటించి మీకు అండగా ఉంటాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

















# టిడిపి ఎంపిలకు మంత్రి లోకేష్ అభినందన!



అమరావతి: చారిత్మాత్మక అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ లోక్ సభలో బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో కూటమి ఎంపిలను రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అభినందించారు. అమరావతి బిల్లును నేడు రాజ్యసభలో ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో మంత్రి లోకేష్ బుధవారం రాత్రి న్యూఢిల్లీ చేరుకున్నారు. డిల్లీ చేరుకున్న లోకేష్‌కు కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్, లోక్ సభ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, దగ్గుమళ్ల ప్రసాదరావు, కేశినేని చిన్ని, బికె పార్థసారధి, హరీష్ మాధుర్, మాజీ ఎంపి కంభంపాటి రామ్మోహన్‌రావు, బైరెడ్డి శబరి, కలిశెట్టి అప్పలనాయుడు తదితరులు స్వాగతం పలికారు. గురువారం రాజ్యసభలో అమరావతి బిల్లు ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహంపై లోకేష్ ఎంపిలతో చర్చించారు.













# ప్రతి ఆంధ్రుడు గర్వంగా నిలిచే రోజు ఇది!

- అమరావతి ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక
- 5 కోట్ల ఆంధ్రుల ఆకాంక్షలకు ప్రతిఫలం
- స్వర్ణాంధ్ర నిర్మాణంలో కీలక మైలురాయి
- టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

అమరావతి, ఏప్రిల్ 02: అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు లోక్‌సభ ఆమోదం లభించడం ఐదుకోట్ల ఆంధ్రుల ఆకాంక్షలకు ప్రతిఫలంగా నిలిచిందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఇది కేవలం ఒక చట్టపరమైన నిర్ణయం మాత్రమే కాకుండా, ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన చారిత్రాత్మక ఘట్టమని అభివర్ణించారు. "నా రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ – నా రాజధాని అమరావతి" అనే భావనతో ప్రతి ఆంధ్రుడు గర్వంగా నిలిచే రోజు ఇదని తెలిపారు. అమరావతి నిర్మాణం రైతుల త్యాగాలు, మహిళల కన్నీళ్లు, ప్రజల కలల సమాహారమని పేర్కొంటూ, శాంతియుత పోరాటానికి దక్కిన విజయమిదని స్పష్టం చేశారు. రైతుల దీక్షలు, ఉద్యమాలు, ప్రజల అంకితభావానికి ఇది న్యాయం చేసిన నిర్ణయమన్నారు.

ప్రజా రాజధాని అమరావతి ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిందని, ఈ బిల్లు ఆమోదం స్వర్ణాంధ్ర నిర్మాణంలో కీలక మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు. గత పాలనలో నెలకొన్న అనిశ్చితి, సందిగ్ధతకు ఇది శాశ్వతంగా తెరదించిందన్నారు.

ప్రపంచ స్థాయి రాజధానిగా అమరావతిని తీర్చిదిద్దే దిశగా కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అమరావతిని ఏకైక రాజధానిగా కేంద్రం స్పష్టతనిచ్చిన నేపథ్యంలో రాష్ట్రానికి స్పష్టమైన దిశ లభించిందని పల్లా పేర్కొన్నారు. రాష్ట్రానికి ముఖచిత్రం, గౌరవప్రతీకగా అమరావతి నిలిచిందని, ఇకపై అభివృద్ధి దిశగా వేగంగా అడుగులు పడతాయని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని




గందరగోళంలోకి నెట్టారని పల్లా ధ్వజమెత్తారు. ప్రపంచంలో దాదాపు ఎక్కడా అమలు కాని విధానాన్ని తీసుకువచ్చి అభివృద్ధిని అడ్డుకున్నారని విమర్శించారు. సచివాలయం ఒకచోట, అసెంబ్లీ మరోచోట ఉండే పరిస్థితులు పరిపాలనలో ఆలస్యం, ఖర్చుల పెరుగుదల, సమన్వయ లోపాలు తీసుకువస్తాయని పేర్కొన్నారు. అది అభివృద్ధి కాదు, అయోమయం సృష్టించే విధానమని స్పష్టం చేశారు.

మళ్లీ మావిగన్ అని మూడు రాజధానుల పేరుతో ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేయడం జగన్‌రెడ్డి రాజకీయ స్వార్థానికి నిదర్శనమని పల్లా మండిపడ్డారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తస్మాత్ జాగ్రత్తగా వ్యవహరించాలని పల్లా హెచ్చరించారు. అమరావతి బిల్లు ఆమోదానికి సహకరించిన ప్రధాని నరేంద్ర మోదీజీకి, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకి పల్లా కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ మద్దతు, మంత్రి నారా లోకేష్ పాత్రతో ఈ విజయం సాధ్యమైందన్నారు. బలమైన రాజధాని నిర్మాణంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని, అమరావతి భవిష్యత్తుపై ఉన్న అనుమానాలకు ఇక శాశ్వతంగా ముగింపు పలుకుదామని పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.

### మధ్యాహ్న భోజనం నాణ్యత విషయంలో

# కఠినంగా వ్యవహరించండి

- రాష్ట్రవ్యాప్తంగా 9వ తరగతి విద్యార్థులకు క్లిక్కర్ విధానం అమలు
- లీప్ యాప్ వినియోగంపై తల్లిదండ్రుల్లో అవగాహన తీసుకురావాలి
- సమగ్రశిక్ష అధికారులతో రాష్ట్ర విద్య, ఐటి మంత్రి నారా లోకేష్ సమీక్ష



ఉండవల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యత విషయంలో కఠినంగా వ్యవహరించాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. ఉండవల్లి నివాసంలో సమగ్రశిక్ష అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఇరాన్ యుద్ధం కారణంగా పెట్రోలియం ఆధారిత ఉత్పత్తుల లభ్యత తగ్గడంతో స్టూడెంట్ కిట్ లపై ప్రభావంపై ఈ సందర్భంగా అధికారులు మంత్రికి వివరించారు. విద్యార్థి మిత్ర కిట్ నాణ్యత విషయంలో పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో క్లిక్కర్ ఆధారిత పునశ్చరణ విధానం పట్ల తల్లిదండ్రుల్లో సానుకూలత ఉందని ఈ సందర్భంగా అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై మంత్రి లోకేష్ స్పందిస్తూ.. రాష్ట్రవ్యాప్తంగా మొదట తొమ్మిదో తరగతి విద్యార్థులకు క్లిక్కర్ ఆధారిత అభ్యసన విధానాన్ని అమలుచేయాలని ఆదేశించారు. తదనంతరం ఇతర తరగతుల్లో క్లిక్కర్ విధానాన్ని ప్రవేశపెట్టాలని సూచించారు. లీప్ యాప్‌లో విద్యార్థులకు ఉపయోగపడే పాఠ్యాంశాల వీడియోలు ఎన్ని చేశారో మంత్రి ఆరా తీశారు.

**ఫీడ్ బ్యాక్ ఆటోమేషన్ చేయండి**

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యత విషయంలో కఠినంగా వ్యవహరించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత విషయంలో సోమవారం నుంచి లీప్ యాప్ ద్వారా టీచర్, పేరెంట్ ఫీడ్ బ్యాక్ ను సేకరిస్తున్నట్లు అధికారులు వివరించారు. మంగళవారం వరకు 6,719 పాఠశాలల నుంచి అభిప్రాయ సేకరణ చేసినట్లు తెలిపారు. ఫీడ్ బ్యాక్ ప్రక్రియను ఆటోమేషన్ చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. లీప్ యాప్ ను ఎంతమంది తల్లిదండ్రులు వినియోగిస్తున్నారని మంత్రి ఆరా తీశారు. లీప్ యాప్ వినియోగం పట్ల తల్లిదండ్రుల్లో అవగాహనకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. అభ్యసన ఫలితాల మెరుగుదలలో స్కూల్ మేనేజ్ మెంట్ కమిటీలు సమర్థవంతమైన పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా మంత్రి అభిప్రాయపడ్డారు. ఆర్టీఈ, ఆటిజం సపోర్ట్ సెంటర్స్ అంశాలపైనా సమావేశంలో చర్చించారు. ఫేజ్-1 కింద చినకాకాని, బాపట్లలో నిర్మాణం పూర్తైన ఆటిజం సపోర్ట్ సెంటర్స్ ప్రారంభానికి సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఫేజ్-2 కింద 28ఆటిజం సెంటర్స్ ఈ ఏడాది జూన్ నాటికి, 95 సెంటర్స్ ఈ ఏడాది నవంబర్ నాటికి అందుబాటులోకి వస్తాయని అధికారులు వివరించారు. ఆటిజం సపోర్ట్ సెంటర్స్ నిర్వహణకు సంబంధించి నిష్ణాతులైన మానసిక వైద్యులు, కౌన్సిలర్ల శిక్షణకు నిమ్ హాన్స్ (NIMHANS) వంటి సంస్థల సహకారం తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. కేజీబీవీ అడ్మిషన్స్ స్టేటస్, 1095 బోధనేతర, 277 బోధన సిబ్బంది నియాకంపైనా సమావేశంలో చర్చించారు.

**అమరావతి లైబ్రరీ తుది నమూనా ఆమోదం**

ప్రజాప్రభుత్వం అమరావతిలో ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న స్టేట్ సెంట్రల్ లైబ్రరీపైనా మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా భవన తుది నమూనాను ఆమోదించారు. త్వరితగతిన పనుల ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని, 2028నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మానవవనరులశాఖ కార్యదర్శి కోన శశిధర్, పాఠశాల విద్య డైరెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, సమగ్రశిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఎండీ సీఎన్ దీవన్‌రెడ్డి, పబ్లిక్ లైబ్రరీస్ డైరెక్టర్ కృష్ణ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

### ఐఐటి, నీట్ ర్యాంకులే లక్ష్యంగా

# ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

- విద్యాప్రమాణాల మెరుగుదలే కూటమి ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత
- ఇంటర్మీడియట్, ఉన్నత విద్య, స్కిల్ డెవలప్ మెంట్ అధికారులతో మంత్రి లోకేష్ సమీక్ష



అమరావతి: రాష్ట్రంలో ఐఐటి, నీట్ ర్యాంకులే లక్ష్యంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లి నివాసంలో బుధవారం ఇంటర్మీడియట్, ఉన్నత విద్య, స్కిల్ డెవలప్ మెంట్ శాఖల అధికారులతో మంత్రి లోకేష్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... ప్రతి రీజియన్ పరిధిలో 4 ఏపీ రెసిడెన్షియల్, 4 కెజిబివిల్లో కోచింగ్ సెంటర్లు ఏర్పాటుచేసి, ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ఇంటర్మీడియట్ స్పాట్ వాల్యుయేషన్ దాదాపు 70శాతానికిపైగా పూర్తయింది, ఈరోజు నుంచి ఇంటర్మీడియట్ అకడమిక్ క్యాలెండరు ప్రారంభమైంది, 6వతేదీ నుంచి ఫస్టియర్ అడ్మిషన్లు ప్రారంభమవుతాయని అధికారులు తెలిపారు. ఇంటర్మీడియట్‌లో ఎట్టి పరిస్థితుల్లో డ్రాపవుట్స్ లేకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు ఉచిత టెక్స్ట్ బుక్స్ పంపిణీ 19నాటికి పూర్తిచేస్తామని అధికారులు తెలిపారు.

**అన్నిపాఠశాలలను త్రీస్టార్‌కు చేర్చండి**

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది కనీస మౌలిక సదుపాయాలు కల్పించి త్రీస్టార్ రేటింగ్ కు చేర్చాలని మంత్రి ఆదేశించారు. అన్ని స్కూళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు మనబడి -- మన భవిష్యత్తు కింద రూ.2,034 కోట్లు సమీకరించాలని సూచించారు. ఇప్పటికే రూ.770కోట్లతో వివిధ పనులు పురోగతిలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఉపాధ్యాయులంతా లెర్నింగ్ అవుట్ కమ్స్, విద్యార్థుల ప్రవేశాలపై దృష్టి సారించాలని, విద్యాప్రమాణాల మెరుగుదలే కూటమి ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యతగా మంత్రి పేర్కొన్నారు. పాఠశాలల్లో అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టంచేశారు. ఇకపై రాష్ట్రవ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ఈ ఏడాది వయోజన విద్యలో గణనీయమైన పురోగతి సాధించడం, అక్షరాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతంగా అమలుచేయడంపై మంత్రి సంతృప్తి వ్యక్తంచేశారు. ఈ విద్యా సంవత్సరంలో 24,74,638మంది వయోజన విద్యాశాఖ నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. దీంతో గతఏడాది 73శాతంగా ఉన్న అక్షరాస్యత శాతం 83శాతానికి పెరిగినట్లు చెప్పారు. వచ్చేఏడాది నాటికి సంపూర్ణ అక్షరాస్యత సాధనే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని మంత్రి దిశా నిర్దేశం చేశారు.

**స్కిల్ డెవలప్ మెంట్ ద్వారా 1.95లక్షల మందికి ఉద్యోగాలు**

స్కిల్ డెవలప్ మెంట్ శాఖ ద్వారా ఇప్పటివరకు 1,95,078మందికి ఉద్యోగాలు కల్పించినట్లు ఆ శాఖ డైరక్టర్ గణేష్ కుమార్ మంత్రి లోకేష్ కు తెలిపారు. తమ శాఖ ద్వారా 6.87లక్షలమందికి నైపుణ్య శిక్షణ అందించామని, ప్రస్తుతం 71,193మంది శిక్షణలో ఉన్నట్లు చెప్పారు. 26రంగాల పూర్తిస్థాయి సమాచారంతో నైపుణ్యం పోర్టల్ సిద్ధమైనట్లు చెప్పారు. నిర్మాణరంగంలో జాబ్స్‌కు సంబంధించి ఈనెల 3వవారంలో 50జాతీయ, అంతర్జాతీయ కంపెనీల ప్రతినిధులతో అమరావతిలో వర్క్ షాపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో సిద్ధంగా ఉన్న 87వేలమంది నిర్మాణ కార్మికులకు జాయింట్ సర్టిఫికేషన్, ప్లేస్ మెంట్‌పై వర్క్ షాపులో ఎంఓయులు కుదుర్చుంటామని చెప్పారు. అమరావతిలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్ స్ట్రక్షన్ (చీూజ) ఆధ్వర్యాన నిర్మించతలపెట్టిన అమరావతి కన్ స్ట్రక్షన్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు సంబంధించిన ప్లానను అధికారులు ప్రదర్శించారు. ఇతర రాష్ట్రాల్లో ఇప్పటికే పనిచేస్తున్న సిఓఇలను అధ్యయనం చేయాలని మంత్రి లోకేష్ సూచించారు. మంగళగిరిలో ఏడాదికి 18వేలమందికి శిక్షణ ఇచ్చే స్కిల్ ఎక్సలెన్స్ సెంటర్ నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించినట్లు అధికారులు తెలిపారు. టెక్నాలజీ, హెల్త్ కేర్, మ్యానుఫ్యాక్చరింగ్, సర్వీసెస్ రంగాల్లో ఇక్కడ నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో కొత్తగా ప్రైవేటు యూనివర్సిటీల ఏర్పాటుకు సంబంధించిన విధివిధానాలు, డేటా ఆర్కిటెక్చర్ ట్రాన్స్‌ఫర్మేషన్, సింగిల్ ఎంట్రీ పాయింట్ ద్వారా సమాచారాన్ని క్రోడికరించే లీప్ హయ్యర్ ఎడ్యుకేషన్ యాప్ రూపకల్పనపై ఉన్నతవిద్య శాఖ అధికారులతో మంత్రి లోకేష్ సమీక్షించారు. కళాశాలల్లో ముఖ ఆధారిత హాజరును కఠినంగా అమలుచేయాలని ఆదేశించారు. అదేవిధంగా ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో కొత్త కోర్సుల అనుమతులను సరళతరం చేసే అంశంపై చర్చించారు. ఈ సమావేశంలో మానవవనరుల శాఖ కార్యదర్శి కోన శశిధర్, ఉన్నతవిద్య కమిషనర్ నారాయణ భరత్ గుప్త, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ రంజిత్ బాషా, పాఠశాల విద్య డైరక్టర్ తమీమ్ అన్సారియా, స్కిల్, ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ డైరెక్టర్ గణేష్‌కుమార్ పాల్గొన్నారు.

# ఆంధ్ర రాష్ట్రం శాశ్వతం.. అమరావతీ శాశ్వతం

### మంత్రి కొల్లు రవీంద్ర

అమరావతి (చైతన్యరథం): రాజధాని అమరావతిపై ఎన్ని కుట్రలు చేసినా ఎవరూ ఏమీ చేయలేరని, ఆంధ్ర రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. "జగన్ రెడ్డి వంటి అరాచక శక్తులకు రాష్ట్రంలో ఇకపై చోటు లేదు" అని ఆయన ఘాటుగా హెచ్చరించారు.

**అమరావతి - ఒక త్యాగం, ఒక సంకల్పం:**

2014 విభజన అనంతరం శివరామకృష్ణ కమిటీ నివేదిక ప్రకారం, విజయవాడ-గుంటూరు మధ్య అమరావతిని రాజధానిగా ఎంచుకున్నామని మంత్రి గుర్తు చేశారు. "ప్రపంచానికి ఆదర్శంగా 29వేల మంది రైతులు 33వేల ఎకరాల భూమిని స్వచ్ఛందంగా ఇచ్చారు. ప్రధాని నరేంద్రమోదీ పవిత్ర జలాలతో, పుణ్యక్షేత్రాల మట్టితో శంకుస్థాపన చేసిన ఈ నగరం నేడు పార్లమెంటు ఆమోదంతో చట్టబద్ధమైన శాశ్వత రాజధానిగా మారబోతోంది" అన్నారు.

**గత ఐదేళ్ల విధ్వంసం.. రైతులపై దమనకాండ:**

2019లో అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి 'మూడు రాజధానుల' పేరుతో రాష్ట్ర భవిష్యత్తును నాశనం చేశారని మండిపడ్డారు.

రైతులపై వేధింపులు: న్యాయం కోరిన మహిళా రైతులను బూటు కాళ్లతో తన్నడం, పాదయాత్ర చేస్తున్న వారిపై దాడులు చేయించడం వంటి దుశ్చర్యలకు పాల్పడ్డారని విమర్శించారు. చివరకు ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను తట్టుకోలేక జగన్ పరదాలు కట్టుకుని తిరిగే పరిస్థితి వచ్చిందని ఎద్దేవా చేశారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమరావతి పనులు మళ్లీ పట్టాలెక్కాయని మంత్రి తెలిపారు. ప్రస్తుతం 350 కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణం, క్వాంటమ్ వ్యాలీ పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. అమరావతిని శాశ్వత రాజధానిగా అసెంబ్లీలో తీర్మానం చేశామని, త్వరలో పార్లమెంటు ఆమోదం పొంది ఇది తిరుగులేని చట్టం కాబోతోందని వెల్లడించారు.

జగన్ రెడ్డి విశాఖ ఉక్కును అమ్మేయాలని చూస్తే, కూటమి ప్రభుత్వం కేంద్రం నుండి రూ.11 వేల కోట్లు తీసుకువచ్చి దానిని కాపాడుతోందని



మంత్రి చెప్పారు. జగన్ నిర్వీర్యం చేసిన పోలవరం ప్రాజెక్టును మళ్లీ గాడిలో పెట్టి పనులు వేగవంతం చేశామని వివరించారు.

వైసీపీ నేతలు ఇప్పటికైనా నీచ రాజ్యాంగం మానుకోవాలని, లేదంటే భవిష్యత్తులో ఆ పార్టీకి సున్నా సీట్లు రావడం ఖాయమని హెచ్చరించారు. "ఎన్ని కుట్రలు చేసినా ఆంధ్ర రాష్ట్రం శాశ్వతం.. అమరావతి శాశ్వతం. ప్రపంచంలోనే అమరావతి మేటి నగరంగా నిలవబోతోంది" అని మంత్రి కొల్లు రవీంద్ర ధీమా వ్యక్తం చేశారు.

# పూటకో మాట.. పూటకో వేషం

## ఇదే జగన్ తీరు: మంత్రి నిమ్మల

- రాజధాని విషయంలో యూటర్న్ తీసుకున్నాడు
- అమరావతిపై జగన్ వైఖరి చూసి ఊసరవెల్లి సైతం సిగ్గుపడుతుంది

పాలకొల్లు (చైతన్యరథం): రాష్ట్ర రాజధాని అమరావతిపై జగన్ వైఖరి చూస్తే రంగులు మార్చే ఊసరవెల్లి సైతం సిగ్గు పడుతుందని, 'అపరిచితుడు' సినిమాలోని అపరిచితుడు కూడా ఆశ్చర్యపోతాడని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఎద్దేవా చేశారు. బుధవారం పాలకొల్లులో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అమరావతి రాజధానికి చట్టబద్ధత తీసుకువచ్చి పార్లమెంట్లో ఆమోదం పొందబోతున్న తరుణంలో జగన్ మాట మార్చి, మడమతిప్పి మచిలీపట్నం వరకు రాజధానిని విస్తరిస్తే బాగుంటుందని ఉచిత సలహాలు ఇవ్వటం ఆయన ఊసరవెల్లి నైజాన్ని తెలియజేస్తోందన్నారు.

పూటకో మాట పేటకో వేషం అన్న చందంగా 2014-19 మధ్య కాలంలో ప్రతిపక్ష నేతగా గుంటూరు-విజయవాడ మధ్య రాజధాని నిర్మిస్తే తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని చెప్పారు. ఇందుకు 30వేల ఎకరాలు అవసరం అవుతుందని కూడా అన్నారు. అమరావతిలోనే తాను ఇల్లు కట్టుకుంటానని, అమరావతి రాజధాని అంగుళం కూడా కదలదని గంభీర ఉపన్యాసం ఇచ్చారు. 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే మాట మార్చారు. మూడుచోట్ల రాజధానులంటూ మూడుముక్కలాట ఆడారని విమర్శించారు. పోనీ ఆ మూడుచోట్ల తన ఐదేళ్ల హయాంలో ఒక్క ఇటుక కూడా పెట్టలేదన్నారు. ఈ కారణంగానే 94 శాతం స్ట్రైక్ రేటుతో కూటమిని గెలిపించారు. జగన్‌ను ఓడించారు. అమరావతి రాజధానికి ప్రజామోదం తెలిపారు' అని మంత్రి నిమ్మల చెప్పారు.

ఈ తరుణంలో యూటర్న్ తీసుకుని మళ్లీ మాట తప్పి... మడమ తిప్పి కొత్త పలుకులు పలుకుతూ ఊసరవెల్లిలా రంగులు మారుస్తున్నారని విమర్శించారు. అమరావతి ప్రజా రాజధాని సెల్ఫ్ ఫైనాన్స్ రాజధాని, అంతర్జాతీయ ప్రమాణాలతో రూపుదిద్దుకోబోతున్న ఈ నగరం తెలంగాణకు హైదరాబాదు మాదిరి, కర్ణాటకకు బెంగుళూరు మాదిరి లక్షల కోట్ల



ఆదాయాన్ని ఇవ్వబోతోందన్నారు. సంపద సృష్టి జరిగి విద్య, ఉద్యోగ అవకాశాలు విస్తృతంగా పెరుగుతాయన్నారు. 20 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. అమరావతి ద్వారా వచ్చే ఆదాయాన్ని రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలకూ సమానంగా పంచి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయవచ్చన్నారు. ఇలాంటి తరుణంలో కూటమి ప్రభుత్వానికి వచ్చే కీర్తిని చూసి ఓర్వలేకే వైసీపీ నేతలు, మాజీ మంత్రులు 'అమరావతే మా రాజధాని అంటూ చిలక పలుకులు పలకడం చూస్తే ఊసరవెల్లి సైతం సిగ్గు పడుతుందన్నారు. నిలకడ లేని, ఊసరవల్లి, అపరిచితుడు లాంటి వ్యక్తికి మనం అధికారం అప్పజెప్పామా అని ప్రజలు ఆలోచనలో పడ్డారన్నారు.

రాజకీయాల్లో కొనసాగడానికి జగన్‌కు అర్హత లేదన్నారు. ఒక రాజకీయ పార్టీ అధ్యక్షుడిగా ఆయన ఉండటానికి తగడన్నారు. తన అరాచక పాలనలో అమరావతికి భూములు ఇచ్చిన రైతులను వేధించిన సంగతిని రాష్ట్ర ప్రజలు ఎన్నటికీ మరువబోరని నిమ్మల స్పష్టం చేశారు. ఇంతకంటే దారుణంగా అమరావతి దేవతల రాజధాని కాదని, వేశ్యల రాజధాని అని వ్యాఖ్యానించిన అతడిని రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ క్షమించబోరన్నారు. ఇలాంటి దిగజారుడు భాష వాడటం వల్ల అక్కడే ఇల్లు కట్టుకున్న ఆయన కుటుంబ సభ్యులకు ఏ రకమైన సందేశం ఇవ్వదలుచుకున్నారని రామానాయుడు ప్రశ్నించారు. ఇందుకు రాష్ట్ర ప్రజలకు భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.


# ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణానికి మైలురాయి

## *అమరావతి రాజధానికి లోక్‌సభ ఆమోదంపై మంత్రి మండిపల్లి హర్షం*

అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి లోక్‌సభ చట్టబద్ధత కల్పించడం రాష్ట్ర చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయమని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. ఐదు కోట్ల ఆంధ్రుల ఆకాంక్షలకు చట్టబద్ధమైన గౌరవం దక్కడంపై ఆయన హర్షం వ్యక్తం చేస్తూ.... ఈ చారిత్రక నిర్ణయానికి సహకరించిన ప్రధాని నరేంద్రమోదీకి రాష్ట్ర ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

**చంద్రబాబు పట్టుదల.. రైతుల త్యాగం:** ముఖ్యమంత్రి అకుంఠిత దీక్ష, అహర్నిశల కృషి వల్లే అమరావతికి ఈ ఘనత సాధ్యమైంది. చంద్రబాబు సుదూర ఆలోచనా విధానం, పట్టుదల రాజధాని నిర్మాణానికి ఊపిరిపోశాయి. రాజధాని కోసం ఏళ్ల తరబడి పోరాటం చేసిన అమరావతి రైతుల త్యాగం, పట్టుదల నేడు విజయ తీరాలకు చేరింది" అని మంత్రి పేర్కొన్నారు.

రాజధానిగా అమరావతి పూర్తిస్థాయిలో అమలులోకి రానుండటం రాష్ట్ర అభివృద్ధికి కొత్త దిశానిర్దేశం చేస్తుంది. "ఒకే రాజధాని-సమగ్ర అభివృద్ధి" అనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుంది. ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు కట్టుబడి ఉన్నా మని స్పష్టం చేశారు.



**ఇకపై అమరావతి అజేయం:** గతంలో రాజధానిపై జరిగిన కుట్రలకు కాలం చెల్లిందని, చట్టబద్ధత లభించిన తర్వాత అమరావతిని ఇక ఎవరూ అంగుళం కూడా కదిలించలేరని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. ప్రపంచస్థాయి రాజధానిగా అమరావతిని తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం శక్తివంచన లేకుండా కృషి చేస్తుందని ఆయన పునరుద్ఘాటించారు.

# ధర్మం గెలిచింది

- **జగన్ మూడు ముక్కలాట ముగిసింది**
- **2028 ఆగస్టు నాటికి అమరావతి పూర్తి**
- **రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ**




*నెల్లూరు (చైతన్యరథం):అమరావతికి చట్టబద్ధత లభించడంతో చివరకు ధర్మమే గెలిచిందని, జగన్మోహన్ రెడ్డి ఆడిన మూడు ముక్కలాట ముగిసిందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ వ్యాఖ్యానించారు. నెల్లూరులో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ లోక్‌సభలో అమరావతే రాజధాని అని ఆమోదం పొందినా వైసీపీ నేతలు అవగాహన లేకుండా ప్లాట్లు, ఖర్చులంటూ అర్థం లేని విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికే 70,790 ప్లాట్లు కేటాయించామని, కేవలం 650 మందికి మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని.. డేటా తెలుసుకోకుండా మాట్లాడటం మానుకోవాలని హితవు పలికారు. తన బొమ్మ కోసం సర్వే రాళ్లపై 750 కోట్లు, పాస్‌బుక్‌ల కోసం 25 కోట్లు ప్రజా ధనాన్ని తగలేసిన జగన్, తన సొంత విలాసం కోసం రుషికొండ ప్యాలెస్ కట్టుకున్నారని ఆరోపించారు.*

*కూటమి ప్రభుత్వం 5 కోట్ల మంది ఆంధ్రుల భవిష్యత్తు కోసం రాజధాని నిర్మిస్తోందన్నారు. అమరావతి 100 శాతం సెల్ఫ్ సస్టైనబుల్ ప్రాజెక్ట్ అని... ప్రభుత్వం దగ్గరున్న ఐదువేల ఎకరాలు అమ్మి తీసుకున్న రుణాలు తీరుస్తామని, ప్రజల పన్ను నుంచి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయబోమని స్పష్టం చేశారు. హైదరాబాద్ కంటే అద్భుతంగా అంతర్జాతీయ స్థాయి క్రీడా స్టేడియాలు, ఎయిర్‌పోర్ట్‌లతో అమరావతిని తీర్చిదిద్దుతున్నామన్నారు. 2028 ఆగస్టు నాటికి ఎట్టి పరిస్థితుల్లోనూ రాజధాని నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. లోక్‌సభలో బిల్లు పెట్టిన రోజే ప్రజలను పక్కదారి పట్టించేందుకు జగన్ మావిగన్ పేరుతో మరో కుట్రకు తెరలేపారని... ఇలాంటి అబద్ధాలను ప్రజలు నమ్మరని మంత్రి నారాయణ చెప్పారు.*

*ప్రెస్ మీట్‌లో మేయర్ సుజాతాఅశోక్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాళ్లపాక అనురాధ, రాష్ట్ర వేర్‌హౌస్ కార్పొరేషన్ డైరెక్టర్ కపిర శ్రీనివాస్, టీడీపీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.*

## అంగుళం కూడా కదలదు..

# అమరావతి ఇక శాశ్వతం

**- సమాచార శాఖ మంత్రి పార్థసారథి**

అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి లోక్‌సభ 'గ్రీన్ సిగ్నల్' ఇవ్వడం ఒక చారిత్రక ఘట్టమని సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి కొనియాడారు. ఐదు కోట్ల మంది ఆంధ్రుల ఆకాంక్షలకు ప్రతిరూపమైన అమరావతి బిల్లుకు లోక్‌సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలపడం కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.

**తెలుగువారి ఆత్మగౌరవ ప్రతీక:**

"మేమంతా గర్వంగా చెప్పుకునేలా మా రాజధాని అమరావతి అని లోకానికి చాటిచెప్పే రోజు వచ్చింది. రాజ్యసభ ఆమోదం, రాష్ట్రపతి ముద్ర పడటంతో అమరావతి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. తెలుగు ప్రజల ఆశయాలను నెరవేర్చడం ఒక్క చంద్రబాబు నాయుడుకే సాధ్యమని ఈ పరిణామం నిరూపించింది" అని మంత్రి తెలిపారు.

**ముగ్గురు నేతల సంకల్పం.. రాష్ట్రానికి ప్రాణవాయువు:**

ప్రధాని నరేంద్ర మోదీ ఆశీస్సులతో, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సహకారంతో, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, యువ మంత్రి నారా లోకేష్ పడ్డ శ్రమ నేడు ఫలించిందని పార్థసారథి అన్నారు. అమరావతికి శాశ్వత రూపాన్ని, స్థానాన్ని కల్పించేందుకు కూటమి ప్రభుత్వం చేసిన ప్రతి ప్రయత్నం విజయవంతమైందని హర్షం వ్యక్తం చేశారు.

**అనుమానాలకు తెర.. అక్రమాలకు అడ్డుకట్ట:**

గతంలో రాష్ట్ర భవిష్యత్తును మూడు ముక్కలాటగా మార్చిన పరిస్థితులకు నేటితో ముగింపు పడిందని మంత్రి స్పష్టం చేశారు. "అమరావతిని ఇక అంగుళం కూడా ఎవరూ కదల్చలేరు. చట్టబద్ధంగా, పటిష్టమైన శాసనాలతో రాజధానిని కాపాడే ఘనత కూటమి



ప్రభుత్వానిదే. ఇది తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని నిలబెట్టే ప్రభుత్వం" అని పేర్కొన్నారు.

# జగన్ రెడ్డి కంటే వాళ్లే పెద్ద పిచ్చోళ్లు

- **ఉత్తరాంధ్ర ఉద్దండులమని చెప్పుకునే బొత్స, ధర్మానలకు అవగాహనే లేదు**
- **మూలపేట పోర్టు చూసేందుకు 40 మందికి అనుమతి ఇచ్చాం.. ఎందుకు వెళ్లలేదో చెప్పాలి**
- **రాష్ట్రంలో ఐదు కోట్ల మంది ప్రజల కల నేడు నెరవేరతుంది**
- **వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**



కోటబొమ్మాళి (చైతన్యరథం) జగన్ రెడ్డి కంటే ఉత్తరాంధ్ర ఉద్దండులమని చెప్పుకునే బొత్స, ధర్మానలే పెద్ద పిచ్చోళ్లు అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విమర్శించారు. కోటబొమ్మాళిలో పింఛన్ల పంపిణీ అనంతరం మాట్లాడిన ఆయన ధర్మాన వంటి సీనియర్ నాయకులకు రాష్ట్రం విడిపోతే తప్ప రాజధానులు మారవని కూడా తెలియదా అని ప్రశ్నించారు. మూలపేట పోర్టు చూసేందుకు మూడు జిల్లాల నాయకులు వచ్చారని, పోర్టును సందర్శించేందుకు 40 మందికి అనుమతి ఇచ్చినా ఎందుకు వెళ్లలేదో చెప్పాలని ప్రశ్నించారు. కళ్లకు కనిపించకపోతే భూతద్దాలు కూడా పంపిణీ చేస్తామని ఎద్దేవా చేశారు. జగన్ కారణంగా దేశంలో రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ మిగిలిపోయిందని విమర్శించారు. మూడు రాజధానుల పేరుతో జగన్ నాటకం ఆడారని, ప్రజలు ఆ విషయం గ్రహించి వైసీపీని ఓడించారన్నారు. అయినా జగన్‌కు సిగ్గు రాలేదని మండిపడ్డారు.

జగన్ జంగిల్‌రాజ్ పాలన వల్లే వైసీపీని ప్రజలు 11 సీట్లకు పరిమితం చేశారన్నారు. రాష్ట్ర రాజధాని విభజనపై అవగాహన లేని వారు డొల్లతనంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. గత ప్రభుత్వంలో పరిశ్రమల శాఖ మంత్రి ఏ పరిశ్రమలు తీసుకువచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. జగన్ లాంటి పిచ్చోడి చేతిలో రాయి ఉండకూడదనే ఉద్దేశంతో అమరావతి రాజధాని బిల్లును అసెంబ్లీలో తీర్మానించి పార్లమెంటుకు పంపామని చెప్పారు. రాష్ట్రంలోని ఐదు కోట్ల మంది ప్రజల కల నేడు నెరవేరిందన్నారు. గత ప్రభుత్వంలో కేవలం 20 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 22 నెలల్లోనే 75 శాతం పనులు పూర్తి చేసిందని తెలిపారు. వైసీపీ తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, వైసీపీ ఉందనే విషయాన్నే ప్రజలు మరిచిపోయారన్నారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం ఆర్థికంగా విచ్ఛిన్నమైందని, వ్యవస్థలన్నీ భ్రష్టుపట్టాయని, విపరీతమైన అప్పులతో రాష్ట్రం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పటికీ ఎన్డీయే ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేశామని చెప్పారు.

50 ఏళ్ల రాజకీయ అనుభవం కలిగిన చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ మళ్లీ ప్రగతి పథంలో పయనిస్తుందని అచ్చెన్నాయుడు ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అవినీతి రహిత, పారదర్శక పాలన అందించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు.

# మగ్గం నేసి.. చీర కొని..

**చేనేత కార్మికులకు హోం మంత్రి అనిత భరోసా**



నక్కపల్లి (చైతన్యరథం): "చేనేత కార్మికుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం" అని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. బుధవారం పాయకరావుపేట నియోజకవర్గం నక్కపల్లిలో పర్యటించిన ఆమె ఇంటింటికీ వెళ్లి పింఛన్లను పంపిణీ చేయడంతో పాటు చేనేత కార్మికులతో ముఖాముఖి నిర్వహించారు. నక్కపల్లి, అప్పలపాయకరావుపేట గ్రామాల్లో మంత్రి అనిత స్వయంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లను అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు ఆమెకు ఘన స్వాగతం పలికారు. చేనేత కార్మికుల కష్టాలను అడిగి తెలుసుకున్న మంత్రి ఒక కార్మికురాలితో కలిసి స్వయంగా మగ్గం నేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. అక్కడికక్కడే ఒక చేనేత చీరను కొనుగోలు చేసి కార్మికులను ప్రోత్సహించారు. అనంతరం బోదుగలం సమీపంలోని ఆర్అండ్ఆర్ కాలనీలో నూతనంగా నిర్మించిన గృహాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు.

# చంద్రబాబు విజన్‌తో సామాన్యుడికి 'శ్రీరామరక్ష'

- **అట్టడుగువర్గాలకు కార్పొరేట్ వైద్యం**
- **ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల వైద్య భరోసా**
- **ఏపీ టూరిజం చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ యాదవ్**

మంగళగిరి (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో అద్భుతమైన సమతుల్యత సాధించిందని ఏపీ టూరిజం చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ యాదవ్ పేర్కొన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు.

కేవలం మౌలిక సదుపాయాలే కాకుండా ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమని నమ్మి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 'డిజిటల్ సంజీవని' అనే ఆరోగ్య విప్లవానికి శ్రీకారం చుట్టారని తెలిపారు.

**వైద్య రంగంలో కీలక మార్పులు - ముఖ్యాంశాలు:**

ఎన్నికల హామీ మేరకు ప్రతి కుటుంబానికీ రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం అందించేలా ప్రభుత్వం నూతన పాలసీ రూపొందించింది. కేంద్ర ప్రభుత్వ ఆయుష్మాన్‌భారత్, ఈహెచ్ఎ మెడికల్ సర్వీసెస్ ట్రస్ట్ మరియు ఇన్సూరెన్స్ కంపెనీల సమన్వయంతో ఈ భారీ లబ్ధి చేకూరుతుంది.

ప్రతి పౌరుడికీ ఒక ప్రత్యేక డిజిటల్ హెల్త్ కార్డ్ అందిస్తున్నారు. దీనివల్ల రోగి ఆసుపత్రికి వెళ్లగానే వారి పూర్తి ఆరోగ్య చరిత్ర కంప్యూటర్ స్క్రీన్‌పై కనిపిస్తుంది. ఇది అత్యవసర సమయాల్లో ప్రాణాలు కాపాడేందుకు వైద్యులకు ఎంతో సహాయపడుతుంది.

ఈ పథకాన్ని తొలుత కుప్పం నియోజకవర్గంలో ప్రారంభించగా ఇప్పటికే 3.38 లక్షల మంది ఆరోగ్య వివరాల సేకరణ పూర్తయింది. త్వరలోనే ఇది రాష్ట్రవ్యాప్తంగా అమలు కానుంది.

ఈ పథకం కింద 3,200కు పైగా వివిధ రకాల వ్యాధులకు ఉచితంగా కార్పొరేట్ స్థాయి వైద్యం అందుతుంది.

**సాంకేతికతతో ప్రాణ రక్షణ:**

గత ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన 108 అంబులెన్స్ వ్యవస్థకు కూటమి ప్రభుత్వం మళ్లీ జీవం పోసింది. ప్రస్తుతం 108 వాహనం కేవలం రవాణా సాధనం మాత్రమే కాకుండా, ఒక 'మినీ ఆసుపత్రి'లా పనిచేస్తోంది. టెలి-మెడిసిన్ ద్వారా నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో అంబులెన్స్‌లోనే ప్రాథమిక చికిత్స అందుతోంది. దీనివల్ల రోడ్డు ప్రమాదాల్లో మరణాలను 20 శాతం వరకు తగ్గించగలిగారు.

**విజనరీ లీడర్ చంద్రబాబు:**

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి ఉన్న అంతర్జాతీయ సంబంధాల వల్ల బిల్ గేట్స్ (గేట్స్



ఫౌండేషన్), టాటా ట్రస్ట్ వంటి సంస్థల సహకారంతో వైద్య రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రవేశపెడుతున్నారని బాలాజీయాదవ్ కొనియాడారు. సాంకేతికతను సామాన్యుడి ఆరోగ్యానికి అనుసంధానించడం ఆయనకే సాధ్యమని, అందుకే బాబును 'విజనరీ లీడర్' అని పిలుస్తారన్నారు.

# చంద్రబాబు హీరో.. జగన్ విలన్

- రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో పరుగులు పెట్టిస్తున్న సీఎం చంద్రబాబు
- భవిష్యత్తులో జగన్‌వల్ల ఇబ్బందులు రాకూడదనే అమరావతికి చట్టబద్ధత
- రాష్ట్ర చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత

పెనుకొండ (చైతన్యరథం): రాష్ట్రంలో వరుసగా సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు ప్రజల మనస్సుల్లో హీరోగా నిలిచారని, రాష్ట్ర పతనాన్ని కోరుకుంటున్న జగన్‌ను విలన్‌గా చూస్తున్నారని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత పేర్కొన్నారు. చోరీలకు కేరాఫ్ అడ్రస్ జగన్ అని ఆమె విమర్శించారు. ఆయన చోరీలను క్రెడిట్ చేసుకోవాల్సిన దుస్థితి ఎవరికీ లేదని ఎద్దేవా చేశారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డు కాలనీలో బుధవారం నేతన్నలకు ఉచిత విద్యుత్ పథకానికి సంబంధించిన ధ్రువ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు.



రాష్ట్రంలో సంక్షేమాన్ని, అభివృద్ధిని జోడు గుర్రాల్లా సీఎం చంద్రబాబునాయుడు పరుగులు పెట్టిస్తున్నారని మంత్రి సవిత తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో అన్ని రోడ్లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. పెనుకొండ పట్టణంలో రైల్వే స్టేషన్ రోడ్డు నిర్మించడంపై పట్టణ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. జగన్ విధ్వంస పాలన వల్ల రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందన్నారు. అమరావతి రాజధానికి జగన్ వల్ల భవిష్యత్తులో ఎటువంటి నష్టం రాకూడదనే చట్టబద్ధత కల్పిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్రానికి పంపామ న్నారు. రాష్ట్రంలో వరుసగా సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న సీఎం చంద్రబాబు ప్రజల మనస్సుల్లో హీరోగా నిలిచారని, రాష్ట్ర పతనాన్ని కోరుకుంటున్న జగన్‌ను విలన్‌గా చూస్తున్నారని అన్నారు. అంతకుముందు పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డు కాలనీలో చేనేత కార్మికులకు మంత్రి సవిత ఉచిత విద్యుత్ ధ్రువపత్రాలను అందజేశారు. చేనేత రంగానికి సీఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు, చేనేత కుటుంబాలు పాల్గొన్నారు.

**ప్రతినెలా ఒకటో తేదీన పెన్షన్ల పండగ**

పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డు కాలనీలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను మంత్రి సవిత ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ప్రతినెలా ఫస్ట్ తారీఖున రాష్ట్ర వ్యాప్తంగా పెన్షన్ల పండుగ జరుగుతోందన్నారు.

# నానీ నువ్వొక 'బఫూన్'

- ఆధారాలు లేని ఆరోపణలు చేస్తే తోలు తీస్తాం
- మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరిక



మచిలీపట్నం (చైతన్యరథం): మాజీ ఎమ్మెల్యే పేర్ని నాని వ్యవహార శైలిపై రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర నిప్పులు చెరిగారు. ఆయన ఒక బఫూన్‌లా ప్రవర్తిస్తున్నారని, ఆధారాలు లేకుండా బురదజల్లే రాజకీయం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. బుధవారం మచిలీపట్నంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఆయన నాని వైఖరిని తీవ్రంగా తప్పుబట్టారు.

**తండ్రీకొడుకుల ద్వంద్వ నీతి - సిగ్గుచేటు**

'చెరువుల తవ్వకాలపై పేర్ని నాని, ఆయన కుమారుడు పరస్పర విరుద్ధ వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదం. 'చెరువులు తవ్వేస్తున్నారని తండ్రి అంటుంటే.. తవ్వనివ్వడం లేదని కొడుకు అంటున్నాడు. అసలు విషయం ఏంటో వారికే తెలియాలి. ఇలాంటి ద్వంద్వ వైఖరితో ప్రజలను మోసం చేయాలని చూస్తే సహించం" అని మండిపడ్డారు.

**ఐదేళ్ల అరాచక పాలనపై ప్రశ్నలు:**

బందర్ కోసం ఏం చేశావు?: మూడుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి మంత్రిగా పనిచేసిన పేర్ని నాని.. మచిలీపట్నం నియోజకవర్గానికి ఏం చేశారో సమాధానం చెప్పాలని రవీంద్ర డిమాండ్ చేశారు. కనీసం మురుగునీటి సమస్యపై కూడా దృష్టి పెట్టలేదని విమర్శించారు.

దోపిడీ పర్వం: ఐదేళ్లలో గోదాములు కట్టుకోవడం, పేదల బియ్యం దోచుకు తినడం తప్ప నాని సాధించిందేమీ లేదని దుయ్యబట్టారు. పెద్దపట్నం ప్రాంతంలో మడ అడవులను ధ్వంసం చేసిన ఘనత నానిదేనని ఆరోపించారు.

అధికారులపై వేధింపులు: గతంలో కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లను బెదిరించి అరాచకం సృష్టించారని... కొత్తగా వచ్చిన ఆర్డీవోను కూడా బెదిరించడం ఆయన అరాచకానికి పరాకాష్ట అన్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పనులు వేగవంతం అయ్యాయని మంత్రి వివరించారు. 'రూ.75 కోట్లతో డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నాం. ఇప్పటికే రెండు వేలకు పైగా టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించాం. మరిన్ని ఇళ్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశాం. పెద్దపట్నం ప్రాంతానికి 24 గంటల విద్యుత్ సౌకర్యం కల్పించి, ఆ ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తున్నాం.' అన్నారు.

**అమరావతికి పూర్వ వైభవం:**

శాతవాహనుల కాలం నాటి ఘనతను అమరావతికి తిరిగి తెస్తామని మంత్రి పునరుద్ఘాటించారు. జగన్ రెడ్డి తన స్వార్థం కోసం రాజధానిని నాశనం చేసినా నేడు పార్లమెంటు ఆమోదంతో అమరావతికి చట్టబద్ధత లభించిందని హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో అమరావతిలో 'క్వాంటం కంప్యూటింగ్' కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామనొల్లడించారు.

# విశ్వనగరంగా అమరావతి పునర్నిర్మాణం

- సీఎం చంద్రబాబు విజన్‌కు దక్కిన చట్టబద్ధత
- లోక్‌సభ ఆమోదంపై మంత్రి కందుల దుర్గేష్ హర్షం



అమరావతి (చైతన్యరథం): 'ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఇదొక సువర్ణ అధ్యాయం. అమరావతిని రాష్ట్ర ఏకైక రాజధానిగా గుర్తిస్తూ లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందడం చారిత్రాత్మకం' అని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ కొనియాడారు. అమరావతి రైతులు, మహిళలు ఐదేళ్లు చేసిన సుదీర్ఘ పోరాటంతోనే ఈ విజయం దక్కిందని ఆయన అభివర్ణించారు. ఈ బిల్లుతో అమరావతికి తిరుగులేని చట్టబద్ధత లభించిందని, ఇకపై ఎవరూ రాజధానిని అంగుళం కూడా కదిలించ లేరని స్పష్టం చేశారు.

త్వరలోనే కేంద్ర గెజిట్ వెలువడ నుందని, 2024 జూన్ 2 నుంచి అమరావతి అధికారికంగా ఏపీ రాజధానిగా అమలులోకి వస్తుందని వివరించారు.

**వైసీపీ తీరుపై నిప్పులు:**

లోక్‌సభలో రాజధాని బిల్లును వైసీపీ వ్యతిరేకించి వాకౌట్ చేయడాన్ని మంత్రి తీవ్రంగా తప్పుబట్టారు. "నాడు ప్రతిపక్ష నేతగా అమరావతికి జై కొట్టిన జగన్‌మోహన్ రెడ్డి, అధికారం రాగానే మూడు ముక్కలాట ఆడి రాష్ట్ర భవిష్యత్తును అంధకారంలోకి నెట్టారు. నేడు బిల్లును వ్యతిరేకించడం వారి అహంకారానికి, సిగ్గుమాలిన రాజకీయానికి నిదర్శనం. అందుకే ప్రజలు వారిని ఛీత్కరించుకున్నారు." అన్నారు.

**విశ్వనగరంగా అమరావతి:**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పట్టుదల, ప్రధాని నరేంద్ర మోదీ సహకారం, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్ కృషి వల్లే అసాధ్యం సుసాధ్యమైందని మంత్రి దుర్గేష్ అన్నారు. అమరావతిని కేవలం ఒక రాజధానిగానే కాకుండా, ప్రపంచస్థాయి 'విశ్వనగరం'గా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం శరవేగంగా పనులు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

# ఆంధ్రుల సంకల్పానికి పార్లమెంటు సలాం

**లోక్‌సభలో చారిత్రక విజయంపై మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి భావోద్వేగం**

బనగానపల్లె (చైతన్యరథం): "ఆంధ్రప్రదేశ్ కలల రాజధాని అమరావతికి లోక్‌సభలో చట్టబద్ధత లభించడం ప్రతి ఆంధ్రా పౌరుడికి గర్వకారణం. ఇది కేవలం ఒక బిల్లు ఆమోదం కాదు.. ఐదేళ్ల అణచివేతపై ఆంధ్రుల ఆత్మగౌరవ విజయం" అని రాష్ట్ర రహదారులు, భవనాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ఆయన బనగానపల్లెలో మీడియాతో మాట్లాడుతూ... అమరావతి సాధనలో ఎదురైన ఒడిదుడు కులను గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు.

రైతుల పోరాటానికే హ్యాట్సాఫ్: "అనేక అవమానాలను భరిస్తూ, రాత్రనక పగలనక రాజధాని కోసం అలుపెరగని పోరాటం చేసిన అమరావతి రైతులు, మహిళలకు శిరస్సు వంచి



నమస్కరిస్తున్నాను. మన సంకల్పం బలంగా ఉంటే ఏదైనా సాధ్యమని అమరావతి నిరూపించింది" అని మంత్రి కొనియాడారు.

చంద్రబాబు విజన్-కూటమి ఐక్యత: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అకుంఠిత దీక్ష, లోకేష్ పట్టుదల, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ సంపూర్ణ మద్దతు వల్లే నేడు అమరావతికి దేశవ్యాప్తంగా గుర్తింపు లభించిందని ప్రశంసించారు. అమరావతికి చట్టబద్ధత కల్పించిన కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్రమోదీకి, లోక్‌సభ సభ్యులకు ఆంధ్రప్రదేశ్ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

వైసీపీపై నిప్పులు: దేశమంతా అమరావతికి మద్దతు తెలుపుతుంటే వైసీపీ సభ్యులు లోక్‌సభ నుంచి వాకౌట్ చేయడం వారి అహంకారానికి, రాజధానిపై వారికున్న ద్వేషానికి నిదర్శనమని మంత్రి మండిపడ్డారు.

చారిత్రక ఘట్టం: దేశ చరిత్రలోనే పార్లమెంటు చట్టబద్ధత కలిగిన తొలి రాజధానిగా అమరావతి అవతరించబోతోందని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయకత్వంలో అమరావతి మళ్లీ తన పూర్వవైభవాన్ని సంతరించుకుంటుంది. ఇది ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తును మార్చే సరికొత్త మలుపు." అని మంత్రి వ్యాఖ్యానించారు.

# పేదలకు ఆసరాగా 'ఎన్టీఆర్ భరోసా' పెన్షన్లు

**- మచిలీపట్నంలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర**



మచిలీపట్నం (చైతన్యరథం): పేదలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా నాడు ఎన్టీఆర్ ప్రారంభించిన పెన్షన్ కార్యక్రమాన్ని నేడు దేశంలోనే అత్యుత్తమంగా తీర్చిదిద్దిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. బుధవారం ఆయన మచిలీపట్నం 26వ డివిజన్ టెక్యాలో ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణలతో కలిసి లబ్ధిదారులకు 'ఎన్టీఆర్ భరోసా' పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 64 లక్షల మందికి పెన్షన్లు అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీ మాత్రమే అన్నారు. అనంతరం మంత్రి 29వ డివిజన్లో పర్యటించి చేనేత కుటుంబాలతో మమేకమయ్యారు. వారి ఆర్థిక స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. చేనేతలను ఆదుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మచిలీపట్నం నియోజకవర్గం అర్బన్‌లో 122, చిన్నాపురంలో 150 చేనేత కుటుంబాలకు పథకాలు అమలవుతున్నాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ బాబాప్రసాద్, మార్కెట్ యార్డు చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్, ఖాజా, వెంకన్న, టీడీపీ నాయకులు, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజల ముంగిటకే పాలన

**రాయచోటిలో పింఛన్లు పంపిణీ చేసిన మంత్రి మండిపల్లి**



రాయచోటి (చైతన్యరథం): "ప్రజల సంక్షేమమే మా ధ్యేయం... ప్రతి ఇంటికీ సేవలు అందించడమే మా బాధ్యత" అని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ఉదయం ఆయన చిన్నమండెం మండలం, వండాడి గ్రామంలోని దళితవాడలో జరిగిన 'ఎన్టీఆర్ భరోసా' పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో స్వయంగా పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులను ఆత్మీయంగా పలకరించారు. వృద్ధులు, వికలాంగులు, ఇతర లబ్ధిదారులకు పింఛను నగదును స్వయంగా అందజేస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సచివాలయ సిబ్బంది, టీడీపీ మండల నాయకులతో కలిసి క్షేత్రస్థాయిలో పింఛన్ల పంపిణీ తీరును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ప్రజలందరికీ సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఫలాలు పారదర్శకంగా అందుతున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రతి నెలా ఒకటో తేదీనే లబ్ధిదారుల చేతికి పింఛన్ అందుతుండటం గర్వకారణమన్నారు.

# జగన్‌కు అమరావతిలో ఉండే అర్హత లేదు

**రాష్ట్ర సామాజిక సంక్షేమ బోర్డు చైర్మన్ పోతుల బాలకోటయ్య**

విజయవాడ (చైతన్యరథం): లోక్‌సభలో రాజధాని అమరావతి గెజిట్ నోటిఫికేషన్‌కు మద్దతు తెలపకుండా వాకౌట్ చేసి పారిపోయిన వైసీపీ 2029 ఎన్నికల్లో రాజకీయ మూల్యం చెల్లించుకోక తప్పదని రాష్ట్ర సామాజిక సంక్షేమ బోర్డు చైర్మన్ పోతుల బాలకోటయ్య అన్నారు. వైసీపీ వైఖరిని నిరసిస్తూ బుధవారం ఆయన విజయవాడలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి చిత్రపటాలను తగులబెట్టారు. ఈ సందర్భంగా బాలకోటయ్య మాట్లాడుతూ ఊరంతా ఒకదారైతే ఉలిపి కట్టెది మరోదారి అన్నట్లు రాజధానిపై తనకున్న శకుని పగను జగన్ బయటపెట్టుకున్నాడని ధ్వజమెత్తారు. అమరావతి బిల్లుకు మద్దతు తెలపని జగన్మోహన్ రెడ్డికి అమరావతిలో ఉండే అర్హత లేదన్నారు. చింత చచ్చినా పులుపు చావలేదు అన్నట్టు 2024 ఎన్నికల్లో ఘోర ఓటమి చవిచూసినా ఆయన తీరు మారలేదన్నారు. అమరావతి విధ్వంసం కారణంగానే రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి పోయిందని చెప్పారు. రాజధానిపై పూటకో మాట మాట్లాడే వైసీపీని బహిష్కరించాలని రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు.

# నెల్లూరులో పింఛన్ల పండుగ

**అవ్వాతాతలకు స్వయంగా నగదు అందజేసిన మంత్రి నారాయణ**



నెల్లూరు (చైతన్యరథం): రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఆధ్వర్యంలో నెల్లూరు నగరంలో పింఛన్ల పంపిణీ జన జాతరను తలపించింది. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ఇచ్చిన మాటకు కట్టుబడి అవ్వాతాతలకు రూ.4వేలు పింఛను ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందని ఆయన కొనియాడారు.

నగరంలోని 5వ డివిజన్ అహ్మద్‌నగర్‌లో లబ్ధిదారుల ఇళ్లకు మంత్రి నారాయణ స్వయంగా వెళ్లారు. ఆయనకు స్థానిక మహిళలు మంగళహారతులు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. పూరి గుడిసెల్లో నివసించే నిరుపేదలను కలుసుకున్న మంత్రి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. తమ ఇళ్ల వద్దకే వచ్చి పింఛను సొమ్ము ఇవ్వడంతో అవ్వాతాతలు, దివ్యాంగులు, ఒంటరి మహిళల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. వారి ఆశీస్సులే ప్రభుత్వానికి శ్రీరామరక్ష అని మంత్రి అన్నారు.

గత ప్రభుత్వం వేల కోట్ల అప్పులు పెట్టి వెళ్లినా, ఆర్థిక సవాళ్లను అధిగమించి పింఛన్లు పంపిణీ చేస్తున్నామని మంత్రి తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఒకే రోజు 99 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసి ఆంధ్రప్రదేశ్ సరికొత్త రికార్డు సృష్టించిందన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు: ఈ సందర్భంగా నెల్లూరు నగరాభివృద్ధిపై మంత్రి నారాయణ తన విజన్‌ను పంచుకున్నారు. రూ.50 కోట్లతో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. 50 వేల మొక్కలతో నెల్లూరును గ్రీన్ సిటీ'గా మార్చడమే తన లక్ష్యమని ప్రకటించారు.

మంత్రి నారాయణ క్రమశిక్షణ, దాతృత్వం నెల్లూరు అభివృద్ధికి వెన్నెముక అని డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ ప్రశంసించారు. కార్యక్రమంలో కమిషనరు నందన్, మేయర్ సుజాతాఅశోక్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాళ్లపాక అనురాధ, డివిజన్ క్లస్టర్ ఇన్‌చార్జి శశికుమార్, ప్రెసిడెంట్ గంగాధర్, యూనిట్ ఇన్చార్జిలు హబీబ్, శారద, టీడీపీ పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు, పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# రాయలసీమకు నీళ్లు ఇచ్చింది చంద్రబాబే

- **పట్టిసీమ వల్లే సీమ సస్యశ్యామలం:**
- **రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్**



పుట్టపర్తి (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు. బుధవారం ఆయన శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడంతో పాటు లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలను అందజేశారు. పుట్టపర్తిలోని ఎనుములపల్లిలో మంత్రి అనగాని స్వయంగా పేదల ఇళ్లకు వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేశారు. ప్రపంచంలోనే ఒకటో తేదీన 63 లక్షల మందికి భారీ ఎత్తున పెన్షన్లు ఇస్తున్న ఏకైక ప్రభుత్వం మన కూటమి సర్కార్ అని ఆయన కొనియాడారు. మగ్గాలకు, మరమగ్గాలకు ఉచిత విద్యుత్ ప్రకటించి చేనేత కార్మికులకు ప్రభుత్వం అండగా నిలిచిందని మంత్రి తెలిపారు. దీనివల్ల ప్రతి చేనేత కుటుంబానికి ఏడాదికి రూ.22 వేల ఆర్థిక లబ్ధి చేకూరుతుందని పేర్కొంటూ, లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. పుట్టపర్తి రైల్వే స్టేషన్ సమీపంలో నూతనంగా నిర్మించిన రెవెన్యూ భవనాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం పుట్టపర్తిలో నూతనంగా నిర్మించిన టీడీపీ కార్యాలయాన్ని కూడా ఆయన ప్రారంభించారు.

**నీటి పారుదలపై వైసీపీపై నిప్పులు:**

రాయలసీమ ప్రయోజనాలను గత వైసీపీ ప్రభుత్వం తాకట్టు పెట్టిందని మంత్రి అనగాని మండిపడ్డారు. "రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును మూలన పెట్టింది వైసీపీ ప్రభుత్వమే. నాడు చంద్రబాబు ముందుచూపుతో పట్టిసీమ నిర్మించడం వల్లే ఈనాడు శ్రీశైలం నుంచి రాయలసీమకు నీళ్లు ఇవ్వగలుగుతున్నాం. సీఎం కృషి వల్లే ఈ ఏడాది ఉమ్మడి అనంతపురం జిల్లాకు 50 టీఎంసీల నీళ్లు వచ్చాయి.

# ఆంధ్రుల సంకల్పానికి పార్లమెంటు సలాం

**లోక్‌సభలో చారిత్రక విజయంపై మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి హర్షం**



అమరావతి (చైతన్యరథం): "ఆంధ్రప్రదేశ్ కలల రాజధాని అమరావతికి లోక్‌సభలో చట్టబద్ధత లభించడం ప్రతి ఆంధ్రా పౌరుడికి గర్వకారణం. ఇది కేవలం ఒక బిల్లు ఆమోదం కాదు.. ఐదేళ్ల అణచివేతపై ఆంధ్రుల ఆత్మగౌరవ విజయం" అని రాష్ట్ర రహదారులు, భవనాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అమరావతి సాధనలో ఎదురైన ఒడిదుడుకులను గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు.

రైతుల పోరాటానికే హ్యాట్సాఫ్: "అనేక అవమానాలను భరిస్తూ, రాత్రనక పగలనక రాజధాని కోసం అలుపెరగని పోరాటం చేసిన అమరావతి రైతులు, మహిళలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను. మన సంకల్పం బలంగా ఉంటే ఏదైనా సాధ్యమని అమరావతి నిరూపించింది" అని మంత్రి కొనియాడారు.

– ముఖ్యమంత్రి చంద్రబాబు అకుంఠిత దీక్ష, మంత్రి లోకేష్ పట్టుదల, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సంపూర్ణ మద్దతు వల్లే నేడు అమరావతికి దేశవ్యాప్తంగా గుర్తింపు లభించింది.

–అమరావతికి చట్టబద్ధత కల్పించిన కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోదీకి, లోక్‌సభ సభ్యులకు ఆంధ్రప్రదేశ్ తరపున ప్రత్యేక ధన్యవాదాలు.

– దేశమంతా అమరావతికి మద్దతు తెలుపుతుంటే వైసీపీ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేయడం వారి అహంకారానికి, రాజధానిపై వారికున్న ద్వేషానికి నిదర్శనమని మంత్రి మండిపడ్డారు.

దేశ చరిత్రలోనే పార్లమెంటు చట్టబద్ధత కలిగిన తొలి రాజధానిగా అమరావతి అవతరించబోతోందని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

"చంద్రబాబు నాయకత్వంలో అమరావతి మళ్లీ తన పూర్వ వైభవాన్ని సంతరించుకుంటుంది. ఇది ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తును మార్చే సరికొత్త మలుపు." అని

# మొక్కజొన్న రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

- రైతులకు గిట్టుబాటు ధర అందేలా అన్ని చర్యలు తీసుకుంటాం
- ధరల తేడాపై కేంద్రంతో చర్చలు... రైతులకు నష్టం జరగనివ్వం
- వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

అమరావతి (చైతన్యరథం): మొక్కజొన్న రైతులకు గిట్టుబాటు ధర అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులు నష్టపోకుండా ఉండేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. మొక్కజొన్న ధరల విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రాష్ట్ర ప్రభుత్వం రైతుల వెంటే నిలుస్తుందన్నారు. మొక్కజొన్న రైతుల సమస్యను సీఎం చంద్రబాబు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారని, కేంద్రానికి లేఖ రాసి పరిస్థితిని వివరించారని తెలిపారు. రైతులకు భారం కాకుండా ఉండేలా కేంద్రం నుంచి అదనపు సహాయం, నిధులు తీసుకురావడానికి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందన్నారు. కేంద్రం కూడా రాష్ట్ర రైతుల సమస్యలను అర్థం చేసుకుని సహకరిస్తుందనే నమ్మకం తమకు ఉందన్నారు. అధిక వ్యయాలు, అంతర్జాతీయ పరిస్థితులు, ముఖ్యంగా గల్ఫ్ యుద్ధ ప్రభావం వంటి కారణాలతో మార్కెట్‌లో కొన్ని ఇబ్బందులు ఏర్పడుతున్నా యని చెప్పారు. అయినప్పటికీ రైతులకు నష్టం జరగకుండా ప్రభుత్వం అన్ని జాగ్రత్తలూ తీసుకుంటోందన్నారు. ఈ సమయంలో కొన్ని రాజకీయ పార్టీలు మార్కెట్లో ధరలు పూర్తిగా పడిపోయాయని ప్రచారం చేసి రైతుల్లో భయాందోళనలు సృష్టిస్తున్నాయని మండిపడ్డారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలు రైతులకు మరింత నష్టం కలిగించే ప్రమాదం ఉందన్నారు. గతంలో కూడా పలు పంటల విషయంలో మార్కెట్ ధరలు తగ్గినప్పుడు ప్రభుత్వం నేరుగా జోక్యం చేసుకుని రైతులను ఆదుకుందని మంత్రి గుర్తు చేశారు. ధాన్యం, మిర్చి, మామిడి, కోకో, పొగాకు, ఉల్లి, టమాటా, బొప్పాయి వంటి పంటల విషయంలో రైతులు ఇబ్బంది ఎదుర్కొన్నప్పుడు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి, మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వ కొనుగోళ్లు చేపట్టి రైతులకు భరోసా కల్పించిందన్నారు. ఇప్పుడు మొక్కజొన్న రైతుల విషయంలో కూడా ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తోందని స్పష్టం చేశారు. రైతులకు అవసరమైన విద్యుత్, సాగునీరు, నీటి భద్రత, పెట్టుబడి సహాయం వంటి అంశాల్లో ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. పీఎం కిసాన్, అన్నదాతా సుఖీభవ పథకాల కింద గత నెలలోనే మూడో విడత సాయం రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. మొక్కజొన్న కొనుగోలు దారులు, కంపెనీలు కూడా రైతులు పెట్టిన ఖర్చును దృష్టిలో పెట్టుకుని కొనుగోలు ధరలను పెంచాలని మంత్రి కోరారు. రైతులు, కొనుగోలు దారులు పరస్పర విశ్వాసంతో వ్యవహరించి రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కొనుగోళ్లు జరపాలని సూచించారు. ప్రభుత్వం, కొనుగోలుదారులు, రైతులు కలిసి పనిచేస్తేనే రైతులకు గిట్టుబాటు ధర అందుతుందని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.



# అమరావతి గెలిచింది.. ఆంధ్రుల ఆత్మగౌరవం నిలిచింది

### - రాజధాని రైతులకు హోం మంత్రి అనిత 'సలాం'



విశాఖపట్నం (చైతన్యరథం): "అమరావతి అంటే కేవలం ఒక ప్రాంతం కాదు.. అది ఐదు కోట్ల ఆంధ్రుల ఆత్మగౌరవ ప్రతీక. పార్లమెంటు సాక్షిగా అమరావతికి చట్టబద్ధత లభించడం రాజధాని రైతుల అలుపెరగని పోరాటానికి దక్కిన చారిత్రక విజయం" అని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత కొనియాడారు. బుధవారం విశాఖలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆమె అమరావతిపై కూటమి ప్రభుత్వం సాధించిన విజయాన్ని వివరించారు.

'ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిరంతర కృషి, దౌత్యం వల్లే నేడు లోక్‌సభలో అమరావతి బిల్లు ఆమోదం పొందడం సాధ్యమైంది. అమరావతి రైతుల తరపున సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు. ఎన్నో అవమానా లను భరిస్తూ, 1600 రోజులకు పైగా శాంతియుతంగా ఉద్యమించిన రాజధాని రైతులు, మహిళల త్యాగానికి ఈ రోజు న్యాయం జరిగింది' అని మంత్రి భావోద్వేగంతో చెప్పారు. "ఇకపై అమరావతిని ఎవరూ అంగుళం కూడా కదల్చలేరు. కట్టుదిట్టమైన చట్టాలు, శాసనాలతో రాజధానిని భద్రపరిచిన ఘనత కూటమి ప్రభుత్వానిదే. అమరావతికి బాసటగా నిలిచిన ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి, మద్దతు తెలిపిన అన్ని రాజకీయ పక్షాలకు కృతజ్ఞతలు తెలిపారు. 'అమరావతిపై పోరాడి విజయం సాధించిన ప్రతి ఒక్క రైతుకూ నా అభినందనలు. రాజధాని కోసం అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతున్నాను. ఇది ధర్మం సాధించిన విజయం." అని ముగించారు.

# జగన్ 'మూడుముక్కలాట'కు ముగింపు!

### మంత్రి అనగాని సత్యప్రసాద్

అమరావతి (చైతన్యరథం): "గత ఎన్నికల్లో తమను చిత్తుగా ఓడించి 11 సీట్లకే పరిమితం చేసిన ఆంధ్రప్రదేశ్ ప్రజలపై జగన్ మోహన్ రెడ్డి కక్ష కట్టారు. అందుకే రాష్ట్ర ప్రయోజనాలకు అత్యంత కీలకమైన అమరావతి రాజధాని అంశంపై లోక్‌సభలో వైసీపీ డ్రామాలు ఆడుతోంది" అని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ మండిపడ్డారు. బుధవారం అమరావతిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసీపీ ద్వంద్వ నీతిని నిలదీశారు.

లోక్‌సభలో వాకౌట్-ప్రజల పట్ల కక్ష: అమరావతి రాజధాని బిల్లుపై లోక్‌సభలో వైసీపీ సభ్యులు వాకౌట్ చేయడం వారి అహంకారానికి, ప్రజల పట్ల ఉన్న వ్యతిరేకతకు నిదర్శనమని మంత్రి అన్నారు.

ఆంధ్రుల కలల రాజధానిని అడ్డుకోవడమే లక్ష్యంగా జగన్ పనిచేస్తున్నారని ధ్వజమెత్తారు. "జగన్‌కు మతి భ్రమించింది. అందుకే రాజధానిపై



రోజుకో మాట మాట్లాడుతున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అమరావతే రాజధాని అని ఒప్పుకుని, అధికారంలోకి రాగానే మూడు ముక్కలాట ఆడారు. ఇప్పుడు ఓడిపోయాక నాగార్జున యూనివర్సిటీ వద్ద పెడితే సరిపోతుందని కొత్త రాగం అందుకుంటున్నారు" అని మంత్రి ఎద్దేవా చేశారు.

ప్రజల మనోభావాలతో చెలగాటం: 30వేల ఎకరాల భూమి సరిపోదని గతంలో చెప్పి ఇప్పుడు రాజధాని అవసరం లేదన్నట్లుగా ప్రవర్తించడం ఆంధ్రుల ఆత్మగౌర వాన్ని దెబ్బతీయడమేనని అనగాని స్పష్టం చేశారు.

అభివృద్ధికి అడ్డుతగులుతున్న వైసీపీ: అమరావతితో పాటు ప్రజలకు ఉపయోగపడే ప్రతి పనినీ అడ్డుకోవడమే జగన్ ఏకైక అజెండాగా పెట్టుకున్నారని, ఓడించిన ప్రజలను అవమానించడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు.

**మంత్రి అనగాని పవర్‌ఫుల్ పంచ్:**

"జగన్ ఎన్ని కుట్రలు చేసినా అమరావతి అజేయం. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయకత్వంలో అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్ది తీరుతాం."

## 'పీఎం సూర్యఘర్'తో సోలార్ పార్కింగ్ స్థలాలకు ఊతం

- ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు ప్రశ్నకు
- లోక్‌సభలో కేంద్ర మంత్రి శ్రీపాద్ యశోనాయక్ సమాధానం




న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సౌరశక్తి వినియోగాన్ని పెంపొందించడం, ముఖ్యంగా పార్కింగ్ స్థలాలు, కార్‌పోర్ట్‌లలో సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుపై కేంద్ర ప్రభుత్వం తన విధానాన్ని స్పష్టం చేసింది. బుధవారం లోక్‌సభలో చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు అడిగిన ప్రశ్నలకు కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన శాఖ సహాయ మంత్రి శ్రీపాద్ యశోనాయక్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

సోలార్ కార్‌పోర్ట్‌ల ఏర్పాటుకు ప్రస్తుతానికి ఎటువంటి ప్రత్యేక ఆర్థిక ప్రోత్సాహకాలు లేవని కేంద్రం స్పష్టం చేసింది. అయితే "పీఎం సూర్యఘర్-ముఫ్తీ బిజిలీ యోజన" కింద గ్రూప్ హౌసింగ్ సొసైటీలు, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్లు తమ ఉమ్మడి సౌకర్యాల కోసం సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపింది. ఇందులో భాగంగానే ఈవీ చార్జింగ్ పాయింట్లు, సోలార్ కార్‌పోర్ట్‌లకు ఆర్థిక సహాయం పొందే అవకాశం ఉందని వివరించింది.

ఏపీలో ప్రైవేట్ సంస్థలతో కలిసి ఏవైనా పైలట్ ప్రాజెక్టులు చేపట్టారా అని ఎంపీ దగ్గుమళ్ళ ప్రశ్నించగా.. క్లీన్ మొబిలిటీని ప్రోత్సహించేందుకు భవిష్యత్తులో ఇవి దోహదపడతాయని కేంద్రం పేర్కొంది.

దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఇప్పటికే సోలార్ కార్‌పోర్ట్‌లు విజయవంతంగా నడుస్తున్నాయని కేంద్ర మంత్రి వివరించారు.

చండీగఢ్: 22 ప్రాంతాల్లో 3,745 కిలోవాట్ల సామర్థ్యంతో ఏర్పాటు.

గుజరాత్: మోతేరా సూర్య దేవాలయం, గాంధీనగర్ సచివాలయం, స్టాచ్యూ ఆఫ్ యూనిటీ వద్ద బ్యాటరీ స్టోరేజ్ సౌకర్యంతో కూడిన కార్‌పోర్ట్‌లు.

జార్ఖండ్: హైకోర్టు ప్రాంగణంలో 2 మెగావాట్ల భారీ సోలార్ కార్‌పోర్ట్.

లడఖ్: లేహ్‌లో అత్యాధునిక బ్యాటరీ వ్యవస్థతో సీఈఎస్ఎల్ (జజుూా) ఏర్పాటు చేసిన ప్రాజెక్ట్.

కేంద్ర మంత్రి ఇచ్చిన సమగ్ర సమాధానంపై ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో పర్యావరణహిత రవాణా పెరగడానికి ఇటువంటి మౌలిక సదుపాయాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

## నేతన్నలకే కాదు..
## రైతన్నకూ అండగా కూటమి సర్కార్

**- 305 ఎకరాల 'చుక్కల భూములకు' విముక్తి**
**మంత్రి అనగాని సత్యప్రసాద్**



పుట్టపర్తి (చైతన్యరథం): "రైతు సంక్షేమమే ధ్యేయంగా.. దశాబ్దాలుగా నలుగుతున్న భూ సమస్యలను పరిష్కరించడానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది" అని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు. శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, జాయింట్ కలెక్టర్ భరద్వాజ్ గ్రామీణ స్థాయిలో రైతుల సమస్యను పరిష్కరించిన తీరును ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

దశాబ్దాల నిరీక్షణకు తెర: నల్లమడ మండలం గోపేపల్లి గ్రామంలోని 305 ఎకరాల భూమి గత కొన్నేళ్లుగా 'చుక్కల భూములు'గా నమోదై ఉంది. దీనివల్ల రైతుల వద్ద అన్ని రకాల పత్రాలు ఉన్నప్పటికీ భూముల క్రయ, విక్రయాలకు తీవ్ర ఆటంకం ఏర్పడేది. తమ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని కోరుతూ రైతులు ఏళ్ల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా గతంలో ఫలితం దక్కలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, జేసీ భరద్వాజ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. స్వయంగా పత్రాలను పరిశీలించి, నిబంధనల ప్రకారం ఆ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించి రైతులకు ఊరటనిచ్చారు.

**మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రశంసలు**

"శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్, జేసీలు కూటమి ప్రభుత్వం ఆకాంక్షిస్తున్నట్లుగా ప్రజాపక్షపాతిగా పని చేశారు. దశాబ్దాల నాటి సమస్యను పరిష్కరించిన వీరి పనితీరు గర్వకారణం." శ్రీసత్యసాయి జిల్లా అధికారుల స్ఫూర్తితో ఇతర జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు కూడా పెండింగులో ఉన్న భూ సమస్యలను నిబంధనల మేరకు వేగంగా పరిష్కరించాలని మంత్రి సూచించారు.

## అమరావతి గెలిచింది..
## వైసీపీ భూస్థాపితమైంది

**- 'శాప్' చైర్మన్ రవినాయుడు**



అమరావతి (చైతన్యరథం): "ఈరోజు అమరావతి గెలిచిన రోజు.. అదే సమయంలో కుట్రలు చేసిన వైసీపీ రాజకీయంగా భూస్థాపితమైన రోజు" అని రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) చైర్మన్ రవినాయుడు వ్యాఖ్యాని ంచారు. అమరావతి రాజధానికి దేశవ్యాప్త మద్దతు లభించడంపై ఆయన హర్షం వ్యక్తం చేస్తూనే వైసీపీ ఎంపీల తీరును తీవ్రంగా ఎండగట్టారు. అమరావతి రాజధానిగా నిలవడం అనేది కేవలం ఒక ప్రాంత విజయం కాదని, ఇది ఐదేళ్లుగా పోరాటం చేస్తున్న అమరావతి రైతుల అకుంఠిత దీక్షకు లభించిన విజయమని రవినాయుడు కొనియాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నిరంతర కృషి వల్లే నేడు పార్లమెంటు లో దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు ఏకగ్రీవంగా అమరావతికి మద్దతు తెలిపాయన్నారు. రాజధానిపై వైసీపీ చేసిన తప్పుడు ప్రచారాలను తిప్పికొడుతూ రాయలసీమ ప్రజలు కూడా అమరావతినే తమ ఏకైక రాజధానిగా కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. లోక్‌సభ సాక్షిగా అమరావతిని వ్యతిరేకిస్తూ వైసీపీ ఎంపీలు వ్యవహరించిన తీరు తెలుగుజాతి పరువు తీసేలా ఉందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ స్వార్థమే వారికి ముఖ్యమని విమర్శించారు.

# చంద్రబాబు విజన్.. మోదీ సహకారం

**అమరావతి అజేయం : మంత్రి ఆనం రామనారాయణరెడ్డి హర్షం**



నెల్లూరు (చైతన్యరథం): "ఆంధ్రుల కలల రాజధాని అమరావతికి లోక్‌సభలో చట్టబద్ధత కల్పించడం ఒక చారిత్రక ఘట్టం. ఇది రాజధాని రైతుల త్యాగాలకు, వారి మొక్కవోని దీక్షకు లభించిన విజయం" అని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి కొనియాడారు. బుధవారం నెల్లూరులో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన అమరావతిపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

రైతుల పోరాట ఫలితం: అమరావతి కోసం దాదాపు 1600 రోజులకు పైగా అలుపెరగని ఉద్యమం చేసిన రైతుల పట్టుదలకే ఈ విజయం దక్కిందని మంత్రి ఆనం స్పష్టం చేశారు. వారి త్యాగాలను రాష్ట్రం ఎన్నటికీ మరువదని పేర్కొన్నారు.

జగన్ కుట్రలకు చరమగీతం: "రాష్ట్రానికి శాశ్వత రాజధాని లేకుండా చేయడమే లక్ష్యంగా గతంలో జగన్ కుట్రలు చేశారు. కానీ ఇకపై ఆయన ఎన్ని జన్మలెత్తినా అమరావతిని తాకలేరు" అని మంత్రి ఘాటుగా విమర్శించారు.

చంద్రబాబు విజన్-కూటమి ఐక్యత: ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టి, కేంద్ర పెద్దల సహకారం వల్లే ఇది సాధ్యమైందని ప్రశంసించారు. రాష్ట్ర అభివృద్ధిలో కీలకంగా వ్యవహరిస్తున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కి, రాజధాని రైతుల కోసం నిరంతరం పోరాడిన యువ నేత నారా లోకేష్‌కి మంత్రి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

అమరావతితో నవశకం:

ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో అమరావతికి న్యాయం జరిగిందని, ఇది ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుకు బలమైన పునాది అని మంత్రి ఆనం అభివర్ణించారు. "రైతుల ఆశయాలకు అనుగుణంగా అమరావతి ప్రపంచ స్థాయి రాజధానిగా రూపుదిద్దుకోబోతోంది. ఈ అభివృద్ధి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సరికొత్త వెలుగులను తీసుకువస్తుంది." అని ఆనం స్పష్టం చేశారు.

# పులివెందుల పులకేసి జగన్‌కి
# రాజధానిపై మాట్లాడే నైతిక అర్హత లేదు

**- మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి**



అమరావతి (చైతన్యరథం): ఐదు కోట్ల ఆంధ్రుల ఆశ, శ్వాస అయిన అమరావతికి పార్లమెంట్ ఆమోదం చారిత్రాత్మకమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు. బుధవారం లోక్‌సభలో అమరావతి చట్టబద్ధత బిల్లు ఆమోదం పొందడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబునాయుడు, ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అమరావతి బిల్లును వ్యతిరేకిస్తూ బాయ్‌కాట్ చేసినందుకు వైసీపీ ఎంపీలు ప్రజలకు క్షమాపణ చెప్పాలని, లేకుంటే రాష్ట్ర ద్రోహులుగా చరిత్రలో మిగిలిపోతారన్నారు. రాజధానిపై పూటకో మాట మాట్లాడే పులివెందుల పులకేసి జగన్‌కి అమరావతి గురించి మాట్లాడే నైతిక అర్హత లేదన్నారు. మాట తప్పడం, మడమ తిప్పడం తప్ప జగన్‌కి పాలన గురించి, రాజధాని గురించి ఏం తెలుసని ప్రశ్నించారు. 'నదీ తీరాన విలసిల్లిన అమరావతిని రాజధానిగా ఏర్పాటు చేసిన సీఎం చంద్రబాబునాయుడు ఆలోచన విధానం అమోఘం. ఇక అమరావతిని కదల్చడం జగన్ తరం కాదు' అని మంత్రి స్పష్టం చేశారు.

# మాట ఇచ్చాం... నెరవేర్చాం

**- బనగానపల్లెలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి**
**- సంగపట్నంలో ఇంటింటికీ వెళ్లి పింఛన్ల పంపిణీ**





బనగానపల్లె (చైతన్యరథం): "పేదల సంక్షేమమే లక్ష్యంగా.. ఇచ్చిన మాట ప్రకారం ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛన్ల పండుగ నిర్వహిస్తున్న ఏకైక ప్రభుత్వం మన కూటమి సర్కారు" అని రాష్ట్ర రహదారులు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ఆయన బనగానపల్లె నియోజకవర్గం సంగపట్నం గ్రామం లో విస్తృతంగా పర్యటించారు. స్వయంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి 'ఎన్టీఆర్ భరోసా' పింఛన్లు అందజేశారు. వృద్ధులు, దివ్యాంగుల యోగక్షేమాలను అడిగి తెలుసుకు న్నారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు మంత్రి ప్రాధాన్యత ఇచ్చారు. రూ.38లక్షలతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లను ప్రారంభించారు. ఐ.చిన్న హుస్సేన్‌రెడ్డి కాలనీలో రూ.40 లక్షలతో రోడ్డు పనులను ప్రారంభించారు. స్థానికులతో మంత్రి నేరుగా మాట్లాడి ప్రభుత్వ పనితీరు, గ్రామంలోని సమస్యలపై ఆరా తీశారు.

# చంద్రబాబు విజన్.. అమరావతి 'విశ్వనగరం'



**- రైతుల త్యాగానికి దక్కిన చట్టబద్ధమైన గౌరవం**
**- సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి**

నెల్లూరు/పొదలకూరు (చైతన్యరథం): "ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుకు భరోసా లభించింది. అమరావతి రాజధానికి లోక్‌సభలో చట్టబద్ధత కల్పించడం ద్వారా గత ఐదేళ్ల అంధకారానికి తెరపడింది" అని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పొదలకూరు మండల పర్యటనలో ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు.

రైతుల త్యాగం-సువర్ణ అధ్యాయం: దేశంలోనే మొట్టమొదటిసారిగా 'ల్యాండ్ పూలింగ్' విధానాన్ని నమ్మి, రాజధాని కోసం 34 వేల ఎకరాల భూమిని త్యాగం చేసిన అమరావతి రైతుల మేలును రాష్ట్రం ఎప్పటికీ మరువదని సోమిరెడ్డి కొనియాడారు. లోక్‌సభలో బిల్లు ఆమోదంతో భూముల విలువ పెరగడమే కాకుండా, పెట్టుబడులు వెల్లువెత్తుతాయని ధీమా వ్యక్తం చేశారు. జగన్ డ్రామాలకు చెక్: మూడు రాజధానుల పేరుతో జగన్ మోహన్ రెడ్డి ఆడిన 'మూడు ముక్కలాట'కు కాలం చెల్లిందని ఆయన మండిపడ్డారు. "రాజ్యాంగంలో రాజధాని అనే పదమే లేదని నేడు కొత్త రాగం అందుకుంటున్నారు. సీఎం ఎక్కడ ఉంటే అదే రాజధాని అనడం హాస్యాస్పదం. ఆయన తన ప్యాలెస్‌లోనో, బెడ్‌రూమ్‌లోనో ఉంటే అవి రాజధానులు అయిపోతాయా?" అని నిలదీశారు.

చంద్రబాబు బ్రాండ్-విశ్వనగరం: అమరావతిని అద్భుతమైన నగరంగా నిర్మించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తన 'బ్రాండ్' ఏంటో మరోసారి ప్రపంచానికి చాటిచెప్పబోతున్నారని సోమిరెడ్డి అన్నారు. ఇప్పటికే 66 జాతీయ సంస్థలు, 60కి పైగా హైరైజ్ టవర్ల నిర్మాణం జరుగుతోందని గుర్తుచేశారు.

"దేశంలోనే తొలి క్వాంటం వ్యాలీ అమరావతిలోనే రాబోతోంది. ఇది ప్రతి ఒక్క ఆంధ్రా పౌరుడు గర్వించదగ్గ విషయం."

వైసీపీ ద్వంద్వ నీతి: పార్లమెంటు బయట ఒకలా, లోపల మరోలా వ్యవహరిస్తూ వైసీపీ ఎంపీలు ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నారని విమర్శించారు. రాజధాని విషయంలో ఆ పార్టీకి అసలు స్పష్టతే లేదని ధ్వజమెత్తారు. ఆత్మగౌరవ ప్రతీక: పొరుగు రాష్ట్రాల వారు మన రాజధాని గురించి అడిగితే సమాధానం చెప్పుకోలేని దుస్థితి నుంచి నేడు గర్వంగా 'అమరావతి మన రాజధాని' అని చెప్పుకునే రోజు వచ్చిందని హర్షం వ్యక్తం చేశారు.

# నేతన్నల జీవితాల్లో వెలుగులు నింపుతున్న ఉచిత విద్యుత్ : ఎమ్మెల్యే గొండు శంకర్



శ్రీకాకుళం (చైతన్యరథం): రాష్ట్రంలో చేనేత రంగానికి కొత్త ఊపిరి పోసే దిశగా కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చిన "ఉచిత విద్యుత్" పథకం నేతన్నల జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపుతోంది. ఈ పథకం కింద చేనేత మగ్గాలకు నెలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ అందజేయడం ద్వారా కరెంట్ బిల్లుల భారాన్ని తగ్గించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 1,04,000 వరకు చేనేత కుటుంబాలు లబ్ధి పొందనున్నాయి. చేనేత కుటుంబాలకు నెలకు రూ.720, సంవత్సరానికి రూ.8,640 వరకు ఆదా కాగా, మరమగ్గాల కేంద్రాలకు నెలకు రూ.1,800, సంవత్సరానికి రూ.21,600 వరకు ఖర్చు తగ్గనుంది. ఇందుకోసం ప్రభుత్వం ఏటా సుమారు రూ.150 కోట్లను వెచ్చించనుంది. ఇది మాత్రమే కాకుండా నేతన్నల సంక్షేమానికి ప్రభుత్వం మరిన్ని చర్యలు చేపడుతోందన్నారు. "నేతన్నల ఆర్థిక స్థితి మెరుగుపడేలా ప్రభుత్వం తీసుకున్న ఉచిత విద్యుత్ పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. చేనేతలకు ఇది ఒక గొప్ప సహాయం" అని ఎమ్మెల్యే గొండు శంకర్ వ్యాఖ్యానించారు.

# ఏజెన్సీ ప్రాంతాల్లో సామాజిక పింఛన్ల పండుగ

• ఇంటింటికి వెళ్లి పింఛన్లు అందజేసిన ఎమ్మెల్యే శిరీషాదేవి



రంపచోడవరం (చైతన్యరథం): అత్యంత పారదర్శకంగా ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు పంపిణీ చేస్తున్నామని రంప చోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ మిరియాల శిరీషాదేవి అన్నారు. గంగవరం మండలం జడేరు గ్రామంలో బుధవారం మండల పార్టీ అధ్యక్షులు పల్లాల వెంకటరెడ్డి సౌజన్యంతో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన ఆమెకు కూటమి శ్రేణులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కష్టాల్లో ఉన్న పేదలకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు చాలా భరోసాగా ఉన్నాయన్నారు. ఎలాంటి పరిస్థితులు ఉన్నా పింఛన్లు సకాలంలో పారదర్శకంగా పంపిణీ చేస్తున్న ప్రభుత్వం మన కూటమి ప్రభుత్వమని కొనియాడారు. త్వరలో అర్హులైన అందరికీ కొత్తగా పింఛన్లు ఇస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 22 నెలల కాలంలో రూ.60,437 కోట్ల రూపాయలు పింఛన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు.

**ప్రభుత్వ యంత్రాంగం ప్రజలకు అందుబాటులో ఉండాలి**

ప్రభుత్వ అధికారులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి ఆదేశించారు. ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి విచ్చేసిన ఆమెకు ప్రజలు పలు విషయాలు ఆమె దృష్టిలో పెట్టారు. దీంతో స్పందించిన ఆమె ప్రభుత్వ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. కార్యాలయాలకు వివిధ రకాల పనులు కోసం వచ్చే ప్రజలతో సౌమ్యంగా ఉండాలని ఆదేశించారు.

# మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే కూన రవికుమార్



ఆముదాలవలస (చైతన్యరథం): నియోజకవర్గంలోని కొరపాం పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ కస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అంగన్వాడీలో అమలు అవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, శుభ్రత, మెనూ వంటి అంశాలను అధికారులు మరియు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో స్నేహపూర్వకంగా మాట్లాడి వారి అభిప్రాయాలను కూడా తెలుసుకున్నారు. ఈ సందర్శనలో ఎమ్మెల్యే కూన రవికుమార్ విద్యార్థులతో కలిసి నేలపై కూర్చొని మధ్యాహ్న భోజనం చేయడం. ఆయన ఎంతో ఆప్యాయంగా పిల్లలతో కలిసిపోయి చదువు బోధన సదుపాయాలు కోసం పిల్లలతో చర్చించారు. ప్రభుత్వ పథకాల అమలు పట్ల ఎటువంటి నిర్లక్ష్యం సహించబోమని, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడం అత్యంత ముఖ్యమని తెలిపారు.

# నారాయణపురం చీరలకు విదేశాల్లో గిరాకీ వచ్చేలా కృషి చేస్తా

• చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్తు అమలు సభలో మాట్లాడిన ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర



పార్వతీపురం (చైతన్యరథం): మన్యం జిల్లాలోని బలిజిపేట మండలం నారాయణపురం గ్రామంలోని చేనేత కార్మికులు నేస్తున్న చీరలకు విదేశాల్లో మంచి గిరాకీ వచ్చేటట్టు తన వంతు కృషి చేస్తామని విజయ్ చంద్ర అన్నారు. కూటమి ప్రభుత్వం చేనేత కార్మికులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు అమలు కార్యక్రమంలో ఆయన పాల్గొని అర్హులైన చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్తు సరఫరా చేసే ధ్రువ పత్రాలను అందజేశారు. అనంతరం సభలో మాట్లాడుతూ... నారాయణపురం గ్రామంలోని చేనేత కార్మికులు నేస్తున్న చీరలకు జియో టాకింగ్ ఏర్పాటుచేసి ప్రత్యేక బ్యానర్తో దేశ,విదేశాల్లో ఈ కార్మికులకు గుర్తింపు వచ్చేటట్టు తనవంతు కృషి చేస్తామన్నారు. నారాయణపురం చేనేత కార్మికులు నేర్పిన చీరలను జిల్లా ఉత్పత్తుల కింద చేర్చి జాతీయ స్థానంలో గుర్తింపు వచ్చేటట్టు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో 77 మంది అర్హులైన చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్తు అర్హత పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముందుగా ఆయన నారాయణపురం చేనేత కార్మికులు చేనేత మగ్గాలపై తయారుచేసిన చీరలను తన సొంత డబ్బులతో కొనుగోలు చేసి మండల స్థాయికి చెందిన నలుగురు మహిళ అధికారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పి. వేణుగోపాల్ నాయుడు, అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు బూరాడ రామ్మోహన్నాయుడు, రాష్ట్ర కొప్పుల వెలమ సంక్షేమ సంఘం డైరెక్టర్ గొట్టాపు వెంకటనాయుడు, మండల పెదపాపి నాయుడు, బోను చంద్రమౌళి, అధికారులు, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పేదల సేవలో ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి



కురుపాం (చైతన్యరథం): పార్వతీపురం మన్యం జిల్లా, కురుపాం నియోజకవర్గం గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలోని గడ్డికోలని వీధిలో బుధవారం నాడు ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షులు అద్దాకుల నరేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ మరియు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలోని అర్హులైన లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి పెన్షన్ అందజేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి నెల ఒకటవ తేదీన లబ్ధిదారుల ఇంటి వద్దకే పెన్షన్ అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పెన్షన్ అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

# ప్రజలకు మరింత సౌకర్యాల కల్పన దిశగా పనిచేస్తున్నాం

• లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే మామిడి గోవిందరావు



పాతపట్నం (చైతన్యరథం): నియోజకవర్గం కొత్తూరు మండలం మెట్టూరు బిట్-III పరిధిలోని ఇరపాడు గ్రామంలో గ్రామ సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్, రైతు సేవ కేంద్రం నూతన భవనాలను పాతపట్నం నియోజకవర్గం శాసనసభ్యులు మామిడి గోవిందరావు ఘనంగా ప్రారంభించారు. అనంతరం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన అన్ని సేవలు ఒకే చోట అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు పారదర్శకంగా సేవలు అందుతున్నాయని, విలేజ్ హెల్త్ క్లినిక్ల ద్వారా గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు. రైతు సేవ కేంద్రాలు రైతులకు ఎంతో ఉపయోగకరమని, వ్యవసాయరంగం బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలు గ్రామాల అభివృద్ధికి దోహదపడతాయని, ప్రతి గ్రామం అభివృద్ధి చెందేలా తాను కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

# మూడు రాజధానుల డ్రామా అంతం... అమరావతితోనే నవ్యాంధ్ర పునర్నిర్మాణం : ఎమ్మెల్యే గణబాబు




విశాఖపట్నం తూర్పు (చైతన్యరథం): "గత ఐదేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వం ఆడిన మూడు రాజధానుల 'మూడు ముక్కలాట' రాష్ట్రానికి శాపంగా మారింది" అని విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు విమర్శించారు. పార్లమెంట్లో అమరావతిని శాశ్వత రాజధానిగా గుర్తిస్తూ బిల్లు ఆమోదం పొందడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ప్రాంతీయ విద్వేషాలు, కులాల మధ్య విభేదాలను సృష్టించి అభివృద్ధిని 30 ఏళ్లు వెనక్కి నెట్టిందని ఎమ్మెల్యే ధ్వజమెత్తారు. "విశాఖను రాజధాని చేస్తామని చెప్పి ఒక్క ఇటుక కూడా వేయని జగన్ మోహన్ రెడ్డి, అమరావతిలో నిర్మించిన రూ.10,000 కోట్ల సంపదను పాడుపెట్టారు" అని మండిపడ్డారు. స్మార్ట్ సిటీ నిధులను దారి మళ్లించి రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్ను దెబ్బతీశారని మండిపడ్డారు. కేవలం 90 రోజుల్లో 34,000 ఎకరాలు ఇచ్చిన 29,000 మంది రైతులది ప్రపంచ చరిత్రలోనే అరుదైన త్యాగమని, రాజధాని కోసం మహిళలు, వృద్ధులు చేసిన పోరాటం దేశంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య నిరసన అని కొనియాడారు. వైసీపీ ప్రభుత్వ వేధింపుల వల్ల ప్రాణాలు కోల్పోయిన 230 మంది రైతుల త్యాగ ఫలమే నేటి అమరావతి విజయం అని ఎమ్మెల్యే గణబాబు వ్యాఖ్యానించారు. ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వం అమరావతిని అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తోందని, రూ.2,245 కోట్లతో అమరావతికి రైల్వే కనెక్టివిటీ, హై స్పీడ్ రైల్ కారిడార్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందన్నారు. అమరావతి కేవలం ఒక నగరం మాత్రమే కాదని, 175 నియోజకవర్గాల యువతకు ఉపాధి కల్పించే 'గ్రోత్ ఇంజిన్' అని గణబాబు పేర్కొన్నారు. విశాఖపట్నం, తిరుపతి మరియు అమరావతిని మూడు ప్రధాన ఆర్థిక మండలాలుగా తీర్చిదిద్ది, 'స్వర్ణాంధ్ర 2047' లక్ష్యాన్ని చేరుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అమరావతి నిర్మాణంతో రాష్ట్ర ఆదాయం పెరిగి, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందుతాయని ఆయన స్పష్టం చేశారు.

జోన్ - 2
(కాకినాడ, అమలాపురం, నర్సాపురం, రాజమహేంద్రవరం, ఏలూరు)
చైతన్యరథం

## ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలు అందజేస్తాం : గొల్లపల్లి అమూల్య



రాజోలు (చైతన్యరథం): మామిడికుదురు మండలం గెద్దాడ గ్రామంలో "పేదలసేవలో" భాగంగా “ఎన్టీఆర్ భరోసా పెన్షన్” కార్యక్రమంలో కూటమి శ్రేణులు సచివాలయ సిబ్బందితో కలిసి రాజోలు తెలుగుదేశంపార్టీ ఇన్‌ఛార్జ్ గొల్లపల్లి అమూల్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమూల్య... పెన్షన్ లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేశారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ వృద్ధులకు వికలాంగులకు భరోసాగా ఉంటుందని, ప్రభుత్వ పథకాల ద్వారా అందిస్తున్న సహాయాన్ని మరింత సమర్థవంతంగా అందించేందుకు కృషి చేస్తున్నామని, వృద్ధులు, వికలాంగులు తదితర అర్హులైన లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుందని తెలిపారు. సమాజంలోని ప్రతి అర్హుడికి సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేయడం మన అందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు ప్రభుత్వంపై విశ్వాసం మరింత పెరుగుతుందని నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేదల పాలిట ఎన్టీఆర్ భరోసా వరం : ఎమ్మెల్యే చదలవాడ

నరసరావుపేట (చైతన్యరథం): పల్నాడు జిల్లాలో అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పాలనా యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగుతున్న తీరుకు బుచ్చిపాపన్నపాలెం వేదికైంది. బుధవారం రొంపిచర్ల మండలం బుచ్చిపాపన్నపాలెం గ్రామంలో పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా, నరసరావుపేట శాసనసభ్యులు చదలవాడ అరవిందబాబు సంయుక్తంగా పర్యటించి, పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కృతిక శుక్లాలోని మానవీయ కోణం అందరినీ ముగ్ధులను చేసింది. హోదాను పక్కన పెట్టి, సామాన్యురాలిగా చిన్నారుల చెంత నేలపై కూర్చుని, వారితో ఆత్మీయంగా ముచ్చటించడం చూపరుల మనసు గెలుచుకుంది. అంగన్‌వాడీల్లో నాణ్యమైన పౌష్టికాహారం, విద్యా ప్రమాణాల అమలుపై ఆమె ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు.



**ఎన్టీఆర్ భరోసాతో సామాన్యుడికి అండ - ఎమ్మెల్యే చదలవాడ**

‘ఎన్టీఆర్ భరోసా’ పథకం ద్వారా లబ్ధిదారులకు పింఛన్లను కలెక్టర్, ఎమ్మెల్యే స్వయంగా పంపిణీ చేశారు. ప్రతి పేదవాడి ఇంటికి సంక్షేమ ఫలాలు చేరాలన్నదే ప్రభుత్వ ఆశయమని, చదలవాడ అరవిందబాబు పునరుద్ఘాటించారు. నిరంతరం ప్రజల కోసం పరితపించే ఎమ్మెల్యే చొరవను గ్రామస్తులు కొనియాడారు.

**పాడి రైతులకు రక్షణ కవచం - గాలికుంటు వ్యాధి టీకా పంపిణీ**

జాతీయ పశు వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా గాలికుంటు వ్యాధి టీకా పంపిణీని ఎమ్మెల్యే ప్రారంభించారు. పశువర్ధక శాఖ మెడికల్ క్యాంపును పరిశీలించిన ఆయన, “పాడి రైతు ఆర్థికంగా ఎదిగినప్పుడే గ్రామం బాగుంటుంది. వ్యాధి నివారణ చర్యలతో పశువులను కాపాడుకోవాలి” అని పిలుపునిచ్చారు.

## మూడు ముక్కలాటకు నేటితో తెర : దేగల ప్రభాకర్

గుంటూరు (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి కృషి వల్లే రాజధాని అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభలో ఆమోదం పొందిందని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దేగల ప్రభాకర్ అన్నారు. అమరావతే ఏపీ రాజధాని అంటూ ఏపీ అసెంబ్లీ చేసిన తీర్మానాన్ని లోక్‌సభ ఆమోదించడం శుభపరిణామం. దేశంలోనే మొదటిసారిగా ల్యాండ్ పూలింగ్ విధానాన్ని అంగీకరించి 34 వేల ఎకరాలు ఇచ్చిన అమరావతి రైతుల మేలును రాష్ట్రం ఎప్పటికీ మరిచిపోదు. ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి వల్లే ఇదంతా సాధ్యమైందన్నారు. అమరావతి రైతుల తరఫున సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు. మూడు రాజధానులంటూ మూడు ముక్కలాట ఆడిన వైసీపీ అధినేత జగన్‌రెడ్డి డ్రామాలకు ఇప్పుడు చెక్ పడిందని ఎద్దేవా చేశారు. ఇది రైతుల త్యాగాలకు, శాంతియుత పోరాటానికి దక్కిన ఫలితమన్నారు. అమరావతిని అంగుళం కూడా వేరొకరు కదిపే పరిస్థితి లేకుండా కట్టుదిట్టంగా చట్టాలు, శాసనాలతో



ఏర్పాటు చేసిన ఘనత కూటమి ప్రభుత్వం సొంతమన్నారు. ఆంధ్రుల ఆత్మగౌరవ రాజధానిగా అమరావతిని పునఃప్రతిష్ఠించిన కేంద్ర ప్రభుత్వానికి, మద్దతుగా నిలిచిన అన్ని పక్షాలకు ధన్యవాదాలు తెలిపారు.

## అమరావతి ఇక అజేయం... అజరామరం : డూండీ రాకేష్

ఢిల్లీ / విజయవాడ (చైతన్యరథం): ప్రజా రాజధాని అమరావతి ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక అని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్ తెలిపారు. బుధవారం లోక్‌సభలో అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లు ఆమోదం పొందడం ఆంధ్రులకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు తెలిపారు. గత పాలనలో ఎదురైన చీకట్లు తొలగిపోయి, అమరావతి భవిష్యత్తుపై ఉన్న సందిగ్ధతకు శాశ్వతంగా తెరపడిందని పేర్కొన్నారు. రైతుల త్యాగానికి, ప్రజల ఆకాంక్షలకు దక్కిన గౌరవం ఇదన్నారు. స్వర్ణాంధ్ర నిర్మాణంలో ఇది ఓ కీలక మైలురాయన్నారు. అమరావతి ఇక అజేయం.. అజరామరం అని డూండీ రాకేష్ తెలిపారు. ఢిల్లీలో పార్లమెంట్ సమావేశంలో ఏపీ రాజధాని అమరావతికి చట్టబద్ధత బిల్లును లోక్‌సభలో ఆమోదించడంతో డూండీ రాకేష్... కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ తదితర టీడీపీ



ఎంపీలను పార్లమెంట్ వద్ద కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. జై అమరావతి నినాదాలు చేశారు.

## ఎమ్మెల్యే గంటాను కలిసిన సినీ డైరెక్టర్ సుకుమార్

విశాఖపట్నం (చైతన్యరథం): భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును స్టార్ డైరెక్టర్ సుకుమార్ ఎంవీపీ కాలనీ నివాసంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తెలుగు సినీ పరిశ్రమ అభివృద్ధికి సంబంధించిన అంశాలు వారు మధ్య చర్చకు వచ్చాయి. విశాఖ సినిమా షూటింగ్ లకు అనువైన ప్రదేశమని పేర్కొన్నారు. బ్లాక్ బస్టర్ సినిమాలతో దేశవ్యాప్త క్రేజ్ తీసుకువచ్చిన సుకుమార్ భవిష్యత్ లో మరిన్ని సక్సెస్ ఫుల్ సినిమాలు తియ్యాలని గంటా ఆకాంక్షించారు. సుకుమార్‌ను శాలువా కప్పి సన్మానించారు. మైత్రి మూవీ మేకర్స్ నవీన్ ఎర్నేని కూడా ఉన్నారు.



## చేనేత కార్మికులకు ఇకనుండి ఉచిత విద్యుత్

●కడియం మండలం వీరవరం గ్రామంలో పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి



రాజమహేంద్రవరం (చైతన్యరథం): చేనేత కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని. ఎన్నికల హామీలో భాగంగా ఇకనుండి నేతన్నలకు ఉచిత విద్యుత్ అమలు చేయడం జరుగుతుందని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రకటించారు. తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం వీరవరం గ్రామంలో ఎమ్మెల్యే గోరంట్ల ఈ పథకాన్ని బుధవారం ప్రారంభించారు. 200 యూనిట్ల వరకు చేనేత కార్మికులకు ఎటువంటి విద్యుత్తు రుసుము ఉండదని గోరంట్ల పేర్కొన్నారు. అలానే చేనేత కార్మికులకు అధునాతన యంత్ర పరికరాల వినియోగం పట్ల శిక్షణ ఇవ్వడం ద్వారా వారి ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తామని తెలిపారు. అన్న ఎన్టీఆర్ పాలన నుండి చేనేత కార్మికులకు అండగా తెలుగుదేశం పార్టీ నిలుస్తుందన్నారు. తెలుగుదేశం పార్టీతో చేనేత కార్మికులకు అనుబంధం ముడిపడి ఉందన్నారు. అందుకే ఇంత దశాబ్దాలుగా వారి ఎదుర్కొంటున్న సమస్యలపై పరిష్కారం దిశగా కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తుందన్నారు.

## మగ్గాలకు ఉచిత విద్యుత్... కొత్త వెలుగుల దిశగా నేతన్నల భవిష్యత్

●చేనేత కార్మికుల సభలో మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు



చిలకలూరిపేట (చైతన్యరథం): నేతన్నల జీవితాల్లో కూటమి ప్రభుత్వం కొత్త వెలుగులు నింపిందని, హ్యాండ్ లూమ్స్‌కు (చేతి మగ్గాలు) నెలకు 200 యూనిట్లు, పవర్ లూమ్స్ (మరమగ్గాలు)కు నెలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తామన్న యువగళం హామీని మంత్రి నారా లోకేశ్ నెరవేర్చారని, ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని 1.05 లక్షల చేనేత కుటుంబాలకు లబ్ది కలగనుందని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ అందిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ, స్థానిక నేతన్నలు బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సభలో ప్రత్తిపాటి మాట్లాడారు.

**ఆర్థిక భారం తగ్గడంతో పాటు.. సాంప్రదాయ చేనేతకు ఊతం**

చంద్రబాబు నాయకత్వంలోని కూటమిప్రభుత్వ తీసుకున్న ఈ నిర్ణయంతో చేనేత కార్మికులకు ఆర్థిక భారం తగ్గుతుందని ప్రత్తిపాటి చెప్పారు. నెలకు 200 యూనిట్లు, 500 యూనిట్ల ఉచిత విద్యుత్ వ్యయం తగ్గినందున కార్మికులు పనితీరు మెరుగుపడుతుందన్నారు. ముఖ్యంగా సాంప్రదాయ చేనేత వర్గాలకు ఈ నిర్ణయం ఊతంగా నిలుస్తుందన్నారు.

**నేతన్నల సంక్షేమమే కూటమిప్రభుత్వ లక్ష్యం..**

నియోజకవర్గంలో చేతి మగ్గాలు 93 వేలుంటే, పవర్ లూమ్స్ 11,458 వరకు ఉన్నాయని, చేతి మగ్గాలకు 200 యూనిట్లు, పవర్ లూమ్స్‌కు 500యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను ప్రభుత్వం అందిస్తోందన్నారు. నేతన్నల సంక్షేమమే లక్ష్యంగా కూటమిప్రభుత్వం వారికి రాయితీపై రుణాలు, యాంత్రీకరణ పరికరాలను కూడా సమకూరుస్తోందన్నారు. ఉచిత విద్యుత్ పొందడానికి అర్హత ఉన్న నేతన్నలు తమ వివరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, ప్రయోజనాలు పొందవచ్చని ప్రత్తిపాటి సూచించారు. మగ్గాలకు ఉచిత విద్యుత్ అందించాలన్న ప్రభుత్వ నిర్ణయంపై నేతకుటుంబాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయన్నారు.

## చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ హర్షణీయం

● రాజానగరంలో కార్యక్రమాన్ని ప్రారంభించిన బొడ్డు వెంకటరమణ

రాజానగరం (చైతన్యరథం): రాజానగరం గ్రామంలో చేనేత కార్మికులకు ‘ఉచిత విద్యుత్ పథకం’ అమలు కార్యక్రమంలో రూడా చైర్మన్, తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, రాజానగరం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బొడ్డు వెంకటరమణచౌదరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం చేనేత కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ రాష్ట్రవ్యాప్తంగా ‘ఉచిత విద్యుత్ పథకం’ను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం కింద చేనేత మగ్గాలకు నెలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు నెలకు 500 యూనిట్ల చొప్పున ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని లక్షకు పైగా (1,04,488) చేనేత కుటుంబాలకు నేరుగా లబ్ధి చేకూరనుందని తెలిపారు. నేతన్నల శ్రమను గౌరవిస్తూ, వారి ఆర్థిక భారం తగ్గించేందుకు ప్రభుత్వం ఏటా సుమారు రూ.150 కోట్లు ఖర్చు చేస్తోందని వెల్లడించారు.

జోన్ - 3
(మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు, బాపట్ల, నరసరావుపేట)
చైతన్యరథం

# రాజధాని అమరావతి చట్టబద్ధతతో రాష్ట్ర అభివృద్ధికి కొత్త దశ

**◆ హర్షం వ్యక్తం చేసిన ఏపీ టీఎస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ**

**◆ గుంటూరులో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ**



గుంటూరు (చైతన్యరథం): రాజధాని అమరావతి చట్టబద్ధతతో రాష్ట్ర అభివృద్ధికి కొత్తదశ మొదలైందని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ వ్యాఖ్యానించారు. రాజధాని అమరావతి చట్టబద్ధత బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం తెలపడం ఆనందంగా ఉందని వ్యాఖ్యానించారు. బుధవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గం, 36వ డివిజన్ స్తంభాలగరువు ప్రాంతంలో ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. అనంతరం మన్నవ మోహనకృష్ణ మీడియాతో మాట్లాడుతూ... సామాజిక పెన్షన్లు పెంచుతామని అధికారంలోకి వచ్చిన జగన్ ఏటా రూ.250 పెంచుకుంటూ పోయారని, కానీ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తొలి నెల నుంచే రూ.1000 పెంచి రూ.4 వేలు పెన్షన్ అందించడం జరగిందన్నారు. వైసీపీ వికలాంగుల పెన్షన్ 3000 ఇస్తే కూటమి ప్రభుత్వం 6000 చేసిందని, తీవ్ర వైకల్యం ఉన్నవారికి గత ప్రభుత్వంలో వైసీపీ 5000 ఇస్తే కూటమి ప్రభుత్వం 15,000 ఇచ్చిందని, 1వ తేదీ తెల్లవారుజామునే అధికారులు లబ్ధిదారుల గడప తట్టి పెన్షన్ అందిస్తుంటే, లబ్ధిధారుల ముఖంలో కనిపిస్తున్న ఆనందమే ఈ ప్రభుత్వానికి అసలైన విజయమన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజధాని హైదరాబాద్‌ను ఐటీ హబ్‌గా అభివృద్ధి చేసిన నారా చంద్రబాబు నాయుడు, ఇప్పుడు ఏపీ రాజధాని అమరావతిని అంతకుమించి అభివృద్ధి చేస్తారని స్పష్టం చేశారు. అమరావతి రాష్ట్రాభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి అవకాశాల విస్తరణకు కేంద్రబిందువుగా నిలుస్తుందని మన్నవ మోహనకృష్ణ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# అమరావతి చట్టబద్ధతతో రైతుల త్యాగానికి న్యాయం జరిగింది : ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అమరావతిని ఏకైక రాజధానిగా చట్టబద్ధత కల్పించడం చారిత్రక నిర్ణయమని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. అమరావతి అభివృద్ధికి కృషి చేసిన ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. అమరావతి కేవలం రాజధాని మాత్రమే కాకుండా, వేల సంవత్సరాల చరిత్ర, సంస్కృతి, నాగరికతకు ప్రతీకగా నిలుస్తుందని, 29 గ్రామాలకు చెందిన రైతులు సుమారు 29,000 ఎకరాల భూమిని స్వచ్ఛందంగా ఇచ్చి ప్రపంచానికి ఆదర్శంగా నిలిచారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి కొనియాడారు. రైతుల త్యాగం, మహిళల దీక్ష, ప్రజల విశ్వాసమే అమరావతి నిర్మాణానికి పునాది అని, గత ప్రభుత్వంలో అమరావతిని రాజకీయ ప్రయోజనాల కోసం మూడు భాగాలుగా విభజించడం వల్ల రాష్ట్రానికి చెందిన ఐదు సంవత్సరాల అమూల్యమైన కాలం వృథా అయిందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి విమర్శించారు. రైతులను అవమానించడం, ఉద్యమాలను అణచివేయడం వంటి ఘటనలు రాష్ట్ర చరిత్రలో మచ్చగా మిగిలిపోయాయని, 1631 రోజుల పోరాటం కేవలం ఉద్యమం మాత్రమే కాదు, అది ఆత్మగౌరవ యుద్ధమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి అభివర్ణించారు. అమరావతి నిర్మాణం రైతుల త్యాగానికి సమాధానం మాత్రమే కాకుండా, తెలుగు జాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.

# వినుకొండలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ

**●ఇంటింటికి తిరిగి పెన్షన్లు అందజేసిన జిడిసిసిబి ఛైర్మన్ మక్కన**

వినుకొండ (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని జిడిసిసిబి ఛైర్మన్ మక్కన మల్లికార్జునరావు అన్నారు. ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు ఆదేశాల మేరకు వినుకొండ పట్టణంలోని 19 వ వార్డు రామాలయం వద్ద బుధవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి స్వయంగా లబ్ధిదారులకు పెన్షన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పెంపు రాష్ట్రంలో విప్లవాత్మక మార్పు అని తెలిపారు. వినుకొండ నియోజకవర్గంలో 40330 వేల మంది లబ్ధిదారులకు 17.40 కోట్లు విలువైన పెన్షన్లను అందజేయడం జరుగుతుందన్నారు. వినుకొండ పట్టణంలో 5208 మందికి 2.34 కోట్లు విలువైన పెన్షన్లు ప్రతినెల ఇస్తున్నట్లు వివరించారు. సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఒకవైపు రాజధాని, పోలవరం తదితర అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రజా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి సూపర్ సిక్స్ పథకాలను సూపర్ సక్సెస్ చేశారని వివరించారు.

# కృష్ణాజిల్లా అభివృద్ధిపై ఇన్‌ఛార్జ్ మంత్రి వాసంశెట్టి సమగ్ర సమీక్ష



మచిలీపట్నం (చైతన్యరథం): కృష్ణాజిల్లా అభివృద్ధి కార్యక్రమాలపై ఇన్‌ఛార్జ్ మంత్రి వాసంశెట్టి సుభాష్, జిల్లా కలెక్టర్ బాలాజీ, ఎమ్మెల్యేలతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ప్రజలకు అందుతున్న సేవలపై సమగ్రంగా చర్చించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు చేరేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, విద్య, ఆరోగ్యం, రహదారుల అభివృద్ధి వంటి కీలక రంగాల్లో మరింత శ్రద్ధ పెట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేస్తే జిల్లాలో అభివృద్ధి వేగవంతమవుతుందని మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు.

# ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్



జగ్గయ్యపేట (చైతన్యరథం): వత్సవాయి మండలం కాకరవాయి గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్లను నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను లబ్ధిదారులకు స్వయంగా అందజేశారు. తదుపరి, వత్సవాయి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను అందజేశారు. అనంతరం కాకరవాయి గ్రామ సర్పంచి గుర్రం సత్యవతి రామారావు పదవీ విరమణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆమె సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వత్సవాయి మండల తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు వడ్లమూడి రాంబాబు, గ్రామ సొసైటీ ఛైర్మన్ ఏపూరి నాగ శ్రీను, చిట్టూరి సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగురాలి జీవితంలో వెలుగులు... 18 ఏళ్ల తర్వాత పింఛన్ మంజూరు

**◆ఫలించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ కృషి**

**◆సీఎంకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన ఎమ్మెల్యే నసీర్, బాలిక తల్లి**



గుంటూరు (చైతన్యరథం): గుంటూరు తూర్పు ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో రాష్ట్ర చరిత్రలో ఎన్నడూలేని విధంగా ఓ దివ్యాంగురాలికి పింఛన్ మంజూరైంది. దివ్యాంగురాలి పరిస్థితి చూసి 18 ఏళ్లుగా సాయం కోసం తల్లిదండ్రులు చేస్తోన్న ప్రయత్నం ఎమ్మెల్యే నసీర్ కృషితో నెరవేరింది. గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని మంగళదాస్ నగర్‌కు చెందిన ఎనుముల కనకదుర్గ పుట్టుకతోనే కంటిచూపు చేతులు సరిగా లేకుండా జన్మించింది. ఆమె తల్లిదండ్రులు రామ శ్రీనివాస రెడ్డి, సత్య గోమేశ్వరి కూతురికి ఆధార్ కార్డు కోసం అన్ని కార్యాలయాల చుట్టూ తిరిగారు. ఫింగర్ ప్రింట్స్, ఐరిస్ లేకపోవడంతో ఆధార్ కార్డు లేదు. దీంతో దివ్యాంగ పింఛన్ కోసం 18 ఏళ్లుగా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. కానీ ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ క్రమంలో మూడేళ్ల క్రితం బాలిక తండ్రి మరణించారు. ఆరు నెలల క్రితం స్థానిక కూటమి నాయకుల సాయంతో కనకదుర్గ తల్లి ఎమ్మెల్యే నసీర్‌ను కలిశారు. బాలిక వేదనను చూసి ఎమ్మెల్యే నసీర్ చలించిపోయారు. ఎలాగైనా కనకదుర్గకు న్యాయం చేస్తామని, పింఛన్ వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే నసీర్ స్వయంగా కనకదుర్గ పరిస్థితిని సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లారు. సీఎం వెంటనే స్పందించి ఐరిస్, ఫింగర్ ప్రింట్ లేకుండా పింఛన్ అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో కనకదుర్గకు ఏప్రిల్ నుంచి పింఛన్ మంజూరైంది. బుధవారం మంగళదాస్ నగర్ వెళ్లిన ఎమ్మెల్యే నసీర్ కనకదుర్గకు స్వయంగా పింఛన్ పంపిణీ చేశారు. ఇంత కాలానికి తమ బిడ్డకు పింఛన్ అందేలా చేసిన ఎమ్మెల్యే నసీర్‌కి, సీఎం చంద్రబాబునాయుడుకి బాలిక తల్లిదండ్రులు రెండు చేతులు జోడించి ధన్యవాదాలు తెలిపారు.

# ప్రజల ఆకాంక్షలకు న్యాయం చేసిన కూటమి ప్రభుత్వం: ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



గుంటూరు (చైతన్యరథం): పార్లమెంట్లో అమరావతి రాజధాని బిల్లుకు ఆమోదం తెలపడంపై పెదకూరపాడు నియోజకవర్గ శాసన సభ్యులు భాష్యం ప్రవీణ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అమరావతి రాజధాని నిర్మాణం కోసం ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రజల కలను నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం చారిత్రాత్మక అడుగు వేసిందన్నారు. గత ప్రభుత్వం అమరావతిని నిర్లక్ష్యం చేసి అభివృద్ధిని అడ్డుకుందని, రైతుల త్యాగాలను పట్టించుకోలేదని తీవ్రంగా విమర్శించారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అమరావతిని తిరిగి పునరుద్ధరించేందుకు కట్టుబడి ఉందని తెలిపారు. పార్లమెంట్లో ఈ బిల్లుకు ఆమోదం రావడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయానికి నిదర్శనమని పేర్కొన్నారు.

# లబ్ధిదారులకు స్వయంగా పెన్షన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి (చైతన్యరథం): నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేస్తున్నామని, ఒకటో తేది ఉదయాన్నే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి స్వయంగా పెన్షన్లు పంపిణీ చేయడం సంతోషంగా ఉందని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రభుత్వం సూచనల మేరకు బుధవారం సత్తెనపల్లి రూరల్ మండలం నందిగామ గ్రామం నందు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు ఇంటింటికి వెళ్లిన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ... లబ్ధిదారులకు స్వయంగా పెన్షన్లు పంపిణీ చేశారు. పెద్దఎత్తున ప్రజలకు సంక్షేమం అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని, ప్రజలకు అభివృద్ధితో కూడిన సూపరిపాలన అందిస్తున్నామని అన్నారు. పేదల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ద్వారా లక్షలాది మంది నిరుపేదలకు ఆర్థిక భరోసా లభిస్తుందన్నారు. ఇచ్చిన హామీ మేరకు ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికి రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెన్షన్ పెంచడం జరగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

జోన్-4
(ఒంగోలు, నెల్లూరు, రాజంపేట, తిరుపతి, చిత్తూరు)
చైతన్యరథం

# రాష్ట్రానికి ఒకే రాజధాని ...అది అమరావతి

**అమరావతి బిల్లు ఆమోదం లభించడం పట్ల ఎమ్మెల్యే ప్రశాంతి హర్షం సీఎం చంద్రబాబు, విజన్‌తో రాష్ట్రానికి భద్రత, మోదీకి కృతజ్ఞతలు**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు లోక్‌సభ ఆమోదం లభించడం రాష్ట్రానికి మరువలేని రోజని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. రాజధాని నిర్మాణానికి అవిరళ కృషి చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీకి ధన్యవాదాలు తెలిపారు. సీఎం చంద్రబాబు విజన్‌తో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోందని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి మరియు అమరావతి లక్ష్య సాధనలో యువ నాయకుడిగా నారా లోకేష్ చూపుతున్న చొరవ, పట్టుదల హర్షించదగ్గ విషయమని చెప్పారు. మన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్... మన రాజధాని అమరావతి అని గర్వంగా చాటాలన్నారు. అమరావతి కోసం దీర్ఘకాలంగా పోరాడిన రైతుల త్యాగాలు ఇందుకు ప్రధాన కారణమని, ఈ చట్టబద్ధతతో పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు మరింత మెరుగవుతాయని ఆమె ఆకాంక్షించారు.



# ఉచిత విద్యుత్ చేనేతలకు చేయూత

**చేనేతలకు ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే సునీత**

రాప్తాడు (చైతన్యరథం): చేనేత మగ్గాలకు ఉచిత విద్యుత్ అన్నది వారికి ఒక వరం కానుందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. చేనేతలకు ఉచిత విద్యుత్ పథకం ప్రారంభోత్సవం బుధవారం రోజు అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పరిటాల సునీత తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. సిండికేట్ నగర్ కు చెందిన చేనేతలు, మండల టిడిపి నాయకులు, హ్యాండ్ లూమ్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. చేనేతలకు ఉచిత విద్యుత్ కు సంబంధించిన పత్రాలను అందజేశారు. రాష్ట్రంలో వ్యవసాయం తర్వాత అత్యధిక మంది చేనేత వృత్తిపై ఆధారపడ్డారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత అన్నారు. వారిని ప్రోత్సహించేందుకు ఈ ప్రభుత్వం అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటుందన్నారు. ఇప్పటికే చేనేతలు నేసిన వస్త్రాలను మార్కెటింగ్ చేసేందుకు అనేక చోట్ల ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేస్తోందన్నారు. అసెంబ్లీలో సైతం చేనేత వస్త్రాల ప్రదర్శన నిర్వహించడం, మహిళా ఎమ్మెల్యేలు చేనేత వస్త్రాలు ధరించడం వంటి కార్యక్రమాలు చేసినట్లు వివరించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా చేనేతలకు ఉచిత విద్యుత్ పథకాన్ని కూడా నేడు ప్రారంభిస్తున్నట్లు వివరించారు. నేతన్నల కుటుంబాలకు ఆర్థిక భరోసా కోసం ఉచిత విద్యుత్ పథకం ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు. చేనేత కుటుంబాలకు నెలకు హ్యాండ్లూమ్ యూనిట్లకు 200 యూనిట్లు, పవర్లూమ్ యూనిట్లకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించడం వల్ల వారి మీద ఉన్న ఆర్థిక భారం గణనీయంగా తగ్గనుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 93వేల మంది చేనేత కార్మిక కుటుంబాలు సుమారు 11వేల 5వందల పవర్లూమ్ యూనిట్ల లబ్ధిదారులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందనున్నట్లు చెప్పారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.150 కోట్ల బడ్జెట్ కేటాయించడం నేతన్నల సంక్షేమం కోసం పాటుపడుతున్న చిత్తశుద్ధికి నిదర్శనం అన్నారు. ఈ పథకం ద్వారా నేతన్నల జీవనోపాధి బలోపేతం కావడంతో పాటు, గ్రామీణ ఉపాధి వస్త్రరంగ అభివృద్ధికి కొత్త ఊపిరి లభించనుందన్నారు. చేనేతలకు ఈ పథకం తో పాటు మరిన్ని ప్రోత్సహకాలు భవిష్యత్తులో ఉంటాయని ఎమ్మెల్యే సునీత తెలిపారు.

# పేరూరు రైతులకు పరిహారం చెల్లించాలి

**ధర్మవరం టీడీపీ ఇన్చార్జి పరిటాల శ్రీరామ్**



పుట్టపర్తి (చైతన్యరథం): సత్యసాయి జిల్లా సమగ్ర అభివృద్ధి (డీఆర్సీ) సమావేశంలో ధర్మవరం టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ కీలక అంశాలను ప్రస్తావించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్లో జరిగిన సమావేశంలో ఇన్ ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, మంత్రులు సత్య కుమార్, సవితతో పాటు ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో శ్రీరామ్ ధర్మవరం, రాప్తాడు నియోజకవర్గాల్లో రైతుల సమస్య గురించి ప్రస్తావించారు. 2018లో ప్రారంభమైన పేరూరు ప్రాజెక్టుకు నీరు అందించే కాలువల కోసం రైతులు ఎంతో మంచి హృదయంతో భూములు ఇచ్చారన్నారు. అయితే అప్పట్లో వారికి కేవలం ఐదు కోట్ల రూపాయలు మాత్రమే చెల్లించారన్నారు. మిగిలిన మొత్తం నేటికీ చెల్లించని పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికే 8కోట్ల రూపాయల పరిహారాన్ని ప్రభుత్వం విడుదల చేసినప్పటికీ.. అవి పోర్టల్ లోనే ఆగిపోయాయన్నారు. వీటిని వెంటనే విడుదల చేయాలని శ్రీరామ్ విజ్ఞప్తి చేశారు. అలాగే ముదిగుబ్బ మండలంలో ఆగిపోయిన జిల్లేడు బండ ప్రాజెక్టు గురించి ప్రధానంగా శ్రీరామ్ ప్రస్తావించారు. ఇక్కడ 2.4 టిఎంసిల సామర్థ్యంతో ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారని.. దీనివల్ల 3300 ఎకరాల వరకు భూమి సేకరించాల్సి వస్తోందన్నారు. దీంతో ఒక గ్రామం మొత్తం ఖాళీ అయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ ప్రాజెక్టు పై ప్రాంతంలో మారాల రిజర్వాయర్ ఉందని.. ఈ నేపథ్యంలో జిల్లేడుబండ ప్రాజెక్టు సామర్థ్యాన్ని 1.5 లేదా 1.4నాలుగు టిఎంసిలకు తగ్గించాలన్నారు. దీనివల్ల భూసేకరణ కూడా తగ్గే అవకాశం ఉందన్నారు. దీనిపై రైతుల నుంచి విజ్ఞప్తి వస్తోందన్నారు. ప్రాజెక్టు సామార్థ్యాన్ని తగ్గించి పనులు చేపట్టేలా చూడాలని కోరారు. అలాగే పీఏబిఆర్ కుడికాలువ ద్వారా రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల్లోని 49 చెరువులకు నీరు అందాల్సి ఉందని.. అయితే కనీసం 30శాతం కూడా నీరు అందని పరిస్థితి ఉందన్నారు. తగినంత సామర్థ్యంతో నీటి విడుదల జరగడం లేదన్నారు. ఈ పరిస్థితి వలన ప్రతిఏటా రైతులు పంటలు వేసుకుని నష్టపోతున్నారన్నారు. అందుకే ఆత్మకూరు మండలంలో హంద్రీనీవా కాలువను పీఏబీఆర్ కాలువకు అనుసంధానం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇదే అంశాన్ని ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు చెప్పారు. మరోవైపు ధర్మవరంలో అసలు పూర్తిగా ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మాణాలు ఆగిపోయాయని పరిటాల శ్రీరామ్ మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. శ్రీరామ్ ప్రస్తావించిన అంశాలపై మంత్రులు అధికారులు వివరణ ఇచ్చారు. పేరూరు ప్రాజెక్టుకు సంబంధించి రైతులకు ఇవ్వాల్సిన పరిహారం వెంటనే విడుదల చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. పీఏబీఆర్-హంద్రీనీవా కాలువల అనుసంధానంపై ఇప్పటికే ముఖ్యమంత్రి కూడా సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. జిల్లెడుబండ ప్రాజెక్టు విషయంలో కూడా త్వరలో ఒక కీలక నిర్ణయం తీసుకుంటామని మంత్రి సత్యకుమార్ తెలిపారు.

# త్వరలో అన్నా క్యాంటీన్ ప్రారంభం

**ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ వెల్లడి**




శింగనమల (చైతన్యరథం): బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో త్వరలో ప్రారంభించే అన్నా క్యాంటీన్‌ను శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ, అనంతపురం జిల్లా టీడీపీ అధ్యక్షులు పూల నాగరాజు, ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసా నాయుడు సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చే అన్నా క్యాంటీన్‌లో అసంపూర్తిగా ఏమైనా నిర్మాణ పనులు, సదుపాయాలు గురించి ఆరా తీశారు. నియోజకవర్గ పరిధిలోని మొదటి అన్నా క్యాంటీన్ ను త్వరలో ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం అన్నా క్యాంటీన్‌లను రద్దు చేసి, పేదల కడుపు ఆకలితో అలమటించే లాగా సైకో పాలన చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తిరిగి అన్నా క్యాంటిన్ లను పునఃప్రారంభించి, పేదలకు మూడు పూట్ల కడుపునిండా ఆహారం అందిస్తుందని తెలిపారు. త్వరలోనే శింగనమల నియోజకవర్గం లో అన్న క్యాంటీన్లను ప్రారంభించి పేదల ఆకలి కష్టాలను తీరుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి ,మండల కన్వీనర్ లక్ష్మీ నారాయణ, సింగల్ విండో అధ్యక్షులు కేసన్న, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ శైలజ, ఎంపీపీ దాసరి సునీత, జిల్లా టీడీపీ నాయకులు జీసీ బాబు, శ్రీరాంరెడ్డి, కూటమి పార్టీల నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజల గడప వద్దకే భరోసా

నెల్లూరు (చైతన్యరథం): నగరంలోని 47వ డివిజన్‌లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. టీడీపి బీసి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ధర్మవరం సుబ్బారావు ఆధ్వర్యంలో 47 టీడీపీ డివిజన్ ఇన్‌చార్జ్ డాక్టర్ గణేష్‌కుమార్ బృందం ఇంటింటికీ వెళ్లి వృద్ధులు, వితంతువులు (స్పౌస్ పెన్షన్ లబ్ధిదారులు), దివ్యాంగులు, డయాలిసిస్ రోగులకు స్వయంగా పెన్షన్లు అందజేశారు. పెన్షన్ కోసం ఎదురు చూస్తున్న వారికి నేరుగా ఇంటి వద్దే అందజేయడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ధర్మవరం సుబ్బారావు మాట్లాడుతూ "ఎన్టీఆర్ భరోసా పథకం బలహీన వర్గాలకు జీవనాధారం. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు ఆర్థికంగా నిలబడేందుకు ఇది ఒక పెద్ద భరోసా. ప్రభుత్వం సంక్షేమాన్ని ప్రజల గడప వద్దకు తీసుకెళ్తోంది" అని తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పథకం సమాజంలోని బలహీన వర్గాలకు అండగా నిలుస్తోంది. వృద్ధులకు ఆర్థిక భరోసా, వితంతువులకు జీవనాధారం, దివ్యాంగులకు స్వావలంబన, డయాలిసిస్ రోగులకు వైద్య ఖర్చులకు ఇది కీలకంగా మారిందని ధర్మవరం సుబ్బారావు గారు తెలిపారు.ఈ పెన్షన్ మా జీవితానికి అండగా నిలుస్తుందని . రోజువారీ ఖర్చులు, మందుల కోసం ఎంతో ఉపయోగపడుతోంది" అని లబ్ధిదారులు భావోద్వేగంతో తెలిపారు.మంత్రి నారాయణ అన్ని విధాలుగా ఆదుకుంటున్నారని పేద ప్రజల కోసం కూటమి ప్రభుత్వం ద్వారానే కాదు తన సొంత నిధులతో ఆర్థిక సాయం చేస్తున్నారని అన్నారు., వైద్య, విద్య లు ఇప్పుడు పేదలకు కూడ అందుబాటులో తీసుకొచ్చారని . పిల్లల భవిష్యత్తు బంగారు బాట వేసారన్నారు.ఈ కార్యక్రమంలో మునిసేఖర్ (వైస్ ప్రెసిడెంట్), కల్వకుంట భాస్కర్ (జనరల్ సెక్రటరీ), సచివాలయ సిబ్బంది వీఆర్వో ప్రశాంతి, వీఆర్వో చాణిక్య,తలారి హనీ, పూజారి సారిక, అలేఖ్య, పజార్ల సుహాసిని, కంచి కృష్ణ, మునికుమార్, సునీల్ సింగ్ గౌడ్, కంచి కిరణ్, పట్నం కవిత, బాలాజీ సింగ్, పలూరు విమల, పసుపులేటి పెంచలయ్య, రవి సింగ్, చైతన్య, నాగమణి, గుంజి రత్నమ్మ, సునీత తదితరులు పాల్గొన్నారు.






పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లిలో చేనేత కార్మికులకు నేటి నుండి 200 యూనిట్లు వరకు, పవర్ లూమ్ కు 500 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ సదుపాయం కల్పిస్తున్న నేపథ్యంలో జిల్లా ఇంచార్జ్ మంత్రి అనగాని సత్యా ప్రసాద్, జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, జిల్లా టీడీపీ అధ్యక్షులు ఎంఎస్ రాజు, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, సంబంధిత అధికారులతో కలిసి ఆయా లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నేతన్నల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని, ఈ పథకం ద్వారా దాదాపు 1,04,488 చేనేత కుటుంబాలకు లబ్ధి చేకూరుతోందని తెలియజేశారు.

# ఎన్టీఆర్ హయాంలోనే వితంతు పింఛన్లు మొదలు

## కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు



కళ్యాణదుర్గం చైతన్యరథం):ఆంధ్రప్రదేశ్ లో మొట్టమొదటి సరిగా వృద్దులు, వికలాంగులు, వితంతువులకు పింఛన్లు అందించిన ఘనత అన్న నందమూరి తారక రామరావుకే దక్కుతుందని, నేడు దేశంలో అత్యధికంగా పింఛన్లు అందిస్తున్నది మన రాష్ట్రమేనని రాష్ట్ర వ్యాప్తంగా పింఛన్ల పండుగ జరుగుతోందని అందులోను అన్న ఎన్టీఆర్ విగ్రహం వద్దే పింఛన్లు అందించడం నా అదృష్టమని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పేర్కొన్నారు. కుందుర్పి మండలం కృష్ణాపురం, తూమకుంట గ్రామాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు విచ్చేయగా గ్రామస్థులు, టీడీపీ నాయకులు పూలవర్షం కురిపించి ఘన స్వాగతం పలికారు.. అనంతరం గ్రామాల్లోని ఎన్టీఆర్, భగీరత, కనకదాసు విగ్రహాలకు పూలమాల వేయడం జరిగింది..ఈ సందర్బంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఐదేళ్ల అభివృద్ధి, సంక్షేమాన్ని గాలికి వదిలేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని, ఇక కళ్యాణదుర్గం మంత్రి దందాలు, దోపిడీలు, కబ్జాలతో ఉన్నదంతా దోచుకుని మరో నియోజకవర్గానికి వెళ్ళిపోయిందని, ఇక్కడ రంగయ్య ఎంపీగా ఉన్న రోజుల్లో ఏఒక్క అభివృద్ధి చేయకుండా కనీసం తాగునీటి అవసరాలు కూడా తీర్చలేకపోయారని, ప్రస్తుతం వేసవి కాలం కావడంతో ఎక్కడా కూడా తాగునీటి ఇబ్బంది లేకుండా అవసరం ఉన్న చోట బోర్లు వేయించి నీటిని అందిస్తున్నామని అన్నారు..రెండు గ్రామాల్లోను ఎస్సీ కాలనీల్లో తాగునీటి ఇబ్బందులు ఉన్నాయని వారంలోగా కొత్త బోర్లు వేయించి అక్కడే ట్యాంకులు ఏర్పాటు చేస్తామని, కృష్ణాపురం గ్రామంలో భగీరథ విగ్రహానికి పైకప్పు కోసం 50 వేల రూపాయలు స్వంత నిధులు అందజేశారు..ప్రైమరీ పాఠశాలకు తరగతి గది మంజూరు చేస్తామని, చిన్నారులకు క్రికెట్ కిట్, స్కిప్పింగ్ తాళ్ళు వారంలో అందజేస్తామని హామీ ఇచ్చారు..




పుట్టపర్తి (చైతన్యరథం): జిల్లా సమీక్షా సమావేశానికి హాజరైన చైర్మన్ గడుపూటి నారాయణస్వామి సత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తి కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా సమీక్షా సమావేశానికి రాష్ట్ర మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి హాజరైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ చైర్మన్ గడుపూటి నారాయణస్వామి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి శ్రీ అనగాని సత్యప్రసాద్, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలు ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి చైర్మన్ గడుపూటి నారాయణస్వామి ఈ సమావేశంలో పాల్గొని జిల్లా అభివృద్ధిపై చర్చించారు.



కదిరి రూరల్ అప్గ్రేడ్ పోలీస్ స్టేషన్ పునర్ ప్రారంభోత్సవ పూజ కార్యక్రమంలో పాల్గొని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన కదిరి నియోజకవర్గ శాసనసభ్యుడు కందికుంట వెంకటప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్, అనంతరం పోలీస్ స్టేషన్ బయట ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్‌తో కదిరి డీఎస్పీ శివనారాయణ స్వామి, అప్గ్రేడ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ నిరంజన్ రెడ్డి,రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగేంద్ర ప్రసాద్, టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ నారాయణ రెడ్డి, కూటమి నాయకులు కలిసి ప్రారంభించారు.



శ్రీ సత్యసాయి జిల్లా తెలుగుదేశం పార్టీ జిల్లా నూతన కార్యాలయం ప్రారంభోత్సవంలో పాల్గొన్న జిల్లా ఇంచార్జ్ మంత్రి అనగాని సత్య ప్రసాద్, బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవిత, జిల్లా అధ్యక్షులు ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథరెడ్డి, కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్, గుండుమల తిప్పేస్వామి, పరిటాల శ్రీ రామ్ తదితరులు

# ఆర్డీటీ సేవా యజ్ఞానికి ప్రభుత్వం చేయూత

## ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, మాంచూ ఫెర్రర్‌తో ఆత్మీయ కలయిక

అనంతపురం (చైతన్యరథం): ఆర్డీటీ సేవా యజ్ఞానికి కూటమి ప్రభుత్వం చేయూత ఎప్పటికీ ఉంటుందని అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు స్పష్టం చేశారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ అయిన నేపథ్యంలో పూల నాగరాజు ఆ సంస్థ నిర్వాహకులు మాంఛో ఫెర్రర్‌ను జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పూల నాగరాజు, జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరిఆర్డీటీ ప్రధాన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మాంచు ఫెర్రర్‌ని పూల నాగరాజు గారు సత్కరించారు. మీ సహకారం ఎప్పటికీ మరువలేమని మాంఛో ఫెర్రర్ అన్నారు. ప్రతి ఒక్కరూ ఆర్డీటీ కోసం తమ వంతుగా స్పందించారన్నారు. ఈ సందర్భంగా పూల నాగరాజు మాట్లాడుతూ ఆర్డీటీ అందించిన సేవా కార్యక్రమాలు జిల్లాలో కొన్ని లక్షల కుటుంబాలకు చేరాయన్నారు. అంతర్జాతీయ స్థాయిలో పాఠశాలలు, ఆసుపత్రులు ఏర్పాటు చేసి సేవలందిస్తున్నారన్నారు. ప్రతి ఏటా 6వేల మంది విద్యార్థులకు ఉచితంగా విద్యనందించి.. ఉన్నత శిఖరాలకు చేర్చారన్నారు. అలాగే ఆసుపత్రిల ద్వారా ప్రతి ఏటా లక్షల మందికి సేవలందిస్తున్నారన్నారు. క్రీడా పరంగా అంతర్జాతీయ ప్రమాణాలతో స్టేడియంలు నిర్మించి.. గ్రామీణ ప్రాంతంలో ఉన్న మట్టిలో మాణిక్యాలను వెలికి తీశారన్నారు. యువగళం పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం నారా లోకేష్ ఆర్డీటీ ఎఫ్ సీఆర్ఏ రెన్యువల్ కోసం కృషి చేశారన్నారు. నారా లోకేష్ కృషిని ఎప్పటికి మరువలేమని పూల నాగరాజు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముత్తవలిల సంఘం అధ్యక్షుడు షకిల్ షఫీ, టీడీపీ రాష్ట్ర నాయకుడు కొండవీటి సుధాకర్ నాయుడు, రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళి, జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణకుమార్, మాజీ ఎంపీపీ ప్రతాప్, టీడీపీ జిల్లా కార్యాలయ కార్యదర్శి తాజుద్దీన్, జిల్లా మీడియా కోఆర్డినేటర్ దబ్బర కుమారస్వామి పాల్గొన్నారు.






# పదేళ్ల ప్రస్థానం

## సంబరాలకు సిద్ధమైన చికాగో ఆంధ్ర సంఘం

### 11, 12 తేదీల్లో దశాబ్ది వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు

**చికాగో:** చికాగో ఆంధ్ర సంఘం (CAA) పదేళ్ల మైలురాయిని పురస్కరించుకుని 2016-2026 దశాబ్ది ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు సిద్ధమైంది. రెండు రోజుల పాటు జరిగే సంబరాల్లో భాగంగా ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను ఖరారు చేశారు.

**కార్యక్రమ షెడ్యూలు:**

ఏప్రిల్ 11 (శనివారం): ఉదయం 9 గంటలకు అరోరాలోని శ్రీబాలాజీ టెంపుల్, సుబ్బయ్య హాల్లో 'శ్రీసీతారామ కల్యాణోత్సవం' జరుగుతుంది.

ఏప్రిల్ 12 (ఆదివారం): మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి ఎనిమిది గంటలవ వరకు బోలింగ్‌బ్రూక్ హైస్కూల్లో 'దశాబ్ది ఉత్సవాల' ప్రధాన వేడుకలు నిర్వహిస్తారు.

**నిర్వాహక బృందం:**

ఈ వేడుకలను విజయవంతం చేసేందుకు చికాగో ఆంధ్ర సంఘం కార్యవర్గ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధానంగా... రాఘవ జట్ల (ఛైర్మన్), తమిశ్ర కొంచాద (ప్రెసిడెంట్), రామకృష్ణ తాడేపల్లి (వైస్ ప్రెసిడెంట్), నరసింహారెడ్డి ఒగ్గు (సెక్రటరీ), బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు, ట్రస్టీలు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే ఈ వేడుకల్లో పాల్గొదలచిన వారు ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కమిటీ సభ్యులు కోరారు. మరిన్ని వివరాలకు www.chicagoandhra.org వెబ్‌సైట్ చూడవచ్చు.

# తెలుగు వెలుగుల 'తానా'

## 90వ అంతర్జాతీయ సాహిత్య సదస్సు విజయవంతం

**దల్లాస్, టెక్సాస్:** తెలుగు భాషా పరిరక్షణలో తనదైన ముద్ర వేస్తున్న 'తానా' ప్రపంచ సాహిత్య వేదిక, ప్రతిష్ఠాత్మకమైన 'నెల నెలా తెలుగు వెలుగు' వరుసలో 90వ సమావేశాన్ని అత్యంత వైభవంగా నిర్వహించింది. డిజిటల్ మాధ్యమాల ద్వారా తెలుగు సాహిత్యాన్ని ప్రపంచవ్యాప్తం చేస్తున్న 'భాషా యోధుల' కృషిని ఈ సదస్సు వేదికగా కొనియాడారు.

ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ సాహితీవేత్త, 'పద్మభూషణ్' డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్... ప్రముఖ కవి, మానవతావాది కవి ఆలూరి బైరాగి సాహిత్యంపై అద్భుత విశ్లేషణ చేశారు. బైరాగి సమగ్ర సాహిత్యాన్ని భావితరాల కోసం ఈ-బుక్, ముద్రణ రూపంలో త్వరలోనే అందుబాటులోకి తీసుకొచ్చే ప్రయత్నంలో ఉన్నానని ప్రకటించారు.

గౌరవ అతిథిగా పాల్గొన్న ఏపీ తెలుగు, సంస్కృత అకాడమీ ఛైర్మన్ శరత్‌చంద్ర (ఆర్జీ విల్సన్) మాట్లాడుతూ.. వార, పక్ష, మాస పత్రికలు ఆర్థికంగా ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న ప్రస్తుత కాలంలోనూ 'ఉష' గ్రూపు పత్రికల చీఫ్ ఎడిటర్‌గా, మేనేజింగ్ డైరెక్టర్‌గా అచ్చు, అంతర్జాలంలో కూడా పిల్లల కోసం 'ఉష' బాల పత్రికలను నిర్వహిస్తున్నామన్నారు. భాషా వికాసానికి ప్రింట్ మీడియా అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు.

'తానా' సాహిత్య వేదిక నిర్వాహకుడు డాక్టర్ ప్రసాద్ తోటకూర మాట్లాడుతూ... కేవలం




సాహిత్యం మాత్రమే కాకుండా తెలుగును పూర్తిస్థాయి పాలనా భాషగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ కార్యాలయాల్లో నామఫలకాలు, ఉత్తర్వులు కచ్చితంగా తెలుగులోనే ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

తెలుగు సాహిత్యాన్ని డిజిటల్ మాధ్యమాల్లోకి తీసుకెళ్తున్న పలువురు ప్రముఖులు తమ అనుభవాలను పంచుకున్నారు.

రజన్ పీటీఎస్కే (అజగవ సాహిత్య చానల్)
దాసు కిరణ్ (దాసుభాషితం పాడ్‌కాస్ట్)
పాతూరి కొండలరెడ్డి (పద్య పరిమళం యూట్యూబ్ చానల్)
పవన్ సంతోష్ (వికీమీడియా ఫౌండేషన్)
కల్పన రెంటాల (సారంగ సాహిత్య వారపత్రిక)
సురేష్ కొలిచాల (ఈమాట అంతర్జాల పత్రిక)
కిరణ్ ప్రభ (కౌముది వెబ్ పత్రిక, రేడియో టాక్ షో)
డాక్టర్ కె.గీత (నెచ్చెలి అంతర్జాల వనితా మాధ్యమం)

వీరంతా తెలుగు భాష, సాహిత్య వికాసాల కోసం చేస్తున్న కృషిని సోదాహరణంగా వివరించి అందరినీ ఆశ్చర్యపరిచారు.

కార్యక్రమ సమన్వయకర్త చిగురుమళ్ల శ్రీనివాస్ అతిథులందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ తెలుగు భాషా వికాసం కోసం నిరంతరం శ్రమిస్తున్న ప్రతి ఒక్కరికీ 'తానా' అండగా ఉంటుందని స్పష్టం చేశారు. కాగా గత ఐదున్నర సంవత్సరాలుగా ఒక్క నెల కూడా విరామం లేకుండా 'తానా' ఈ సాహిత్య సదస్సులను నిర్వహించడం విశేషం.

# అగ్రరాజ్యంలో 'తెలుగు' ముద్ర

## కార్మిక శాఖ ముఖ్య సమాచార అధికారిగా మంగళ కుప్పా నియామకం

**అమెరికా పాలనా యంత్రాంగంలో భారతీయుల ప్రభంజనం కొనసాగుతోంది. తాజాగా తెలుగు మూలాలున్న మేధావి మంగళ కుప్ప అగ్రరాజ్యంలో అత్యంత కీలకమైన రెండు పదవులను దక్కించుకున్నారు.**

**వాషింగ్టన్:** అమెరికా ప్రభుత్వంలో భారత సంతతికి చెందిన మరో సాంకేతిక నిపుణురాలు కీలక బాధ్యతలు చేపట్టారు. అమెరికా కార్మిక శాఖ ముఖ్య సమాచార అధికారిగా భారత సంతతికి చెందిన మంగళ కుప్పా నియమితులయ్యారు. గత ఏడాది అక్టోబరు నుంచి తాత్కాలిక హోదాలో ఈ పదవిలో కొనసాగుతున్న ఆమెకు ఇప్పుడు పూర్తిస్థాయి బాధ్యతలను అప్పగించారు.

**ఏఐ విభాగానికి కూడా నేతృత్వం:**

సీఐఓ బాధ్యతలతో పాటు ఈ నెల ప్రారంభం నుంచి కార్మిక శాఖ విభాగానికి ముఖ్య కృత్రిమ మేధస్సు (Chief AI Officer) అధికారిగా కూడా ఆమె నియామకం జరిగింది. కొత్త బాధ్యతల్లో భాగంగా సమాచార సాంకేతిక వ్యూహం, డిజిటల్ పరివర్తన, ఏఐ వినియోగాన్ని ఆమె పర్యవేక్షిస్తారు.



**అపారమైన అనుభవం:**

టెక్నాలజీ ఎగ్జిక్యూటివ్‌గా మంగళ కుప్పాకు సుమారు 25 ఏళ్లకు పైగా అనుభవం ఉంది. ఆమె 2010లో కార్మిక శాఖలో చేరారు. అప్పటి నుంచీ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్, డైరెక్టర్ ఆఫ్ బిజినెస్ అప్లికేషన్ సర్వీసెస్ వంటి ఉన్నత స్థాయి పదవులను సమర్థవంతంగా నిర్వహించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు.

# న్యూజెర్సీలో ఘంటసాల స్వరార్చన

## డాక్టర్ శరత్‌చంద్ర ఆధ్వర్యంలో పద్యాలు, పాటలపై ఈ నెల 22 నుంచి 27 వరకు ప్రత్యేక వర్క్‌షాప్

**న్యూజెర్సీ:** అమెరికాలోని ప్రముఖ తెలుగు సాంస్కృతిక సంస్థ తెలుగు కళా సమితి (Telugu Fine Arts Society -TFAS) న్యూజెర్సీలో ఘంటసాల గాన మాధుర్యాన్ని భావి తరాలకు అందించేందుకు ఒక అద్భుతమైన అవకాశాన్ని కల్పిస్తోంది. "స్వరసామ్రాట్", ఘంటసాల స్వర పరిశోధకుడు డాక్టర్ టి.శరత్‌చంద్ర పర్యవేక్షణలో ఘంటసాల పాటలు, పద్యాలపై ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రకటించింది.




**వర్క్‌షాప్ వివరాలు:**

తేదీలు: ఏప్రిల్ 22 నుంచి 27 వరకు

సమయం: సాయంత్రం ఆరు గంటలకు.

వేదిక: శ్రీగంగాధర్ దేశు నివాసం, 11 అర్లింగ్టన్ కోర్ట్, వారెన్, NJ 07059.

రిజిస్ట్రేషన్ ఫీజు: $100.

అర్హత: ఈ శిక్షణ పెద్దలకు, పిల్లలకు అందుబాటులో ఉంటుంది.

**ముఖ్య ఆకర్షణ:**

ఈ వర్క్‌షాప్‌లో శిక్షణ పొందిన వారు మే 3న నిర్వహించబోయే ఉగాది వేడుకల్లో ప్రదర్శన ఇచ్చే అరుదైన అవకాశం పొందుతారు.

**సంప్రదించాల్సిన వారు:**

రిజిస్ట్రేషన్, ఇతర వివరాలకు వరలక్ష్మి శ్రీనివాస్ (774-288-9365) లేదా డాక్టర్ శరత్‌చంద్ర (+91 95422 44456-వాట్సాప్ మాత్రమే) సంప్రదించవచ్చు. రిజిస్ట్రేషన్ కోసం https://tinyurl.com/2026TFASGhantasala లింక్‌ను సందర్శించవచ్చు.

TFAS బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ (2024-2026): ఈ కార్యక్రమ నిర్వహణలో మధు అన్న, లోకేందర్ గిరకల, అరుంధతి శకెల్లి, వెంకట సత్య టాటా, శేషగిరిరావు కంభంమెట్టు, వరలక్ష్మి రాధాకృష్ణ, వాణి కునిశెట్టి, లతాదేవి మాడిశెట్టి, ప్రసాద్ పూటుకూరు చురుకైన పాత్ర పోషిస్తున్నారు.

# చార్లెట్‌లో జూలై 17 నుంచి సీఎంఈ సదస్సు

**చార్లెట్:** తెలంగాణ అమెరికా తెలుగు సంఘం (TTA) ఆధ్వర్యాన చార్లెట్‌లో జూలై 17 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించనున్న మెగా కన్వెన్షన్-2026లో భాగంగా అత్యంత ప్రతిష్ఠాత్మకమైన కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్ (CME) సదస్సు ఏర్పాటు చేశారు. వైద్య రంగంలో అంతర్జాతీయ ఖ్యాతి గడించిన ప్రముఖులతో ఈ సెషన్ నిర్వహిస్తారు. ఈ సదస్సులో ఏఐజీ హాస్పిటల్స్ వ్యవస్థాపకుడు, 'పద్మవిభూషణ్' డాక్టర్ దువ్వూరు నాగేశ్వర్‌రెడ్డి కీనోట్ స్పీకర్‌గా పాల్గొంటారు. ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్, కిమ్స్-సన్‌షైన్ హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ గురువారెడ్డి గెస్ట్ స్పీకర్‌గా హాజరై తన అనుభవాలను పంచుకుంటారు.

వైద్య నిపుణులు డాక్టర్ సంతోష్‌రెడ్డి దేవరపల్లి, డాక్టర్ దీపక్ గరిపల్లి, డాక్టర్ నందిని సుంకిరెడ్డి, డాక్టర్ లలిత సి.మేడెపల్లి పలు కీలక అంశాలపై ప్రసంగిస్తారు.

**రిజిస్ట్రేషన్ వివరాలు:** ఈ సదస్సులో పాల్గొనే వైద్యులకు AMA PRA Category 1 Credits పొందే అవకాశం ఉంటుంది. మెడికల్ స్టూడెంట్స్‌కు ప్రవేశం ఉచితం. ఆసక్తి కలిగిన వారు త్వరగా రిజిస్టర్ చేసుకోవాలని TTA ప్రతినిధులు కోరారు. రిజిస్ట్రేషన్ లింక్: www.ttaconvention.org/Ce_Cme_Registration. మరిన్ని వివరాలకు డాక్టర్ సంతోష్ దేవరపల్లి: (910) 824-1392/డాక్టర్ నందిని సుంకిరెడ్డి: (318) 953-2809లను సంప్రదించవచ్చు.

చైతన్యరథం

# యువరాజుకు వందోసారి ఓటమి ఖాయం

## అస్సాం ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ




అస్సాంలో భాజపా మూడోసారి విజయదుందుభి మోగించి హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని ఉద్దేశిస్తూ.. 'ఆ పార్టీ యువరాజుకు వందోసారి కూడా ఓటమి తప్పదు' అని ఎద్దేవా చేశారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మోదీ అస్సాంలో పర్యటించారు. ఈ సందర్భంగా గోగముఖ్ జరిగిన బహిరంగ సభలో పాల్గొని మాట్లాడారు.'అస్సాం మాజీ సీఎం సర్బానంద సోనోవాల్ నాయకత్వంలో, ప్రస్తుత సీఎం హిమంత బిశ్వశర్మ నాయకత్వంలో రాష్ట్రం చాలా అభివృద్ధి చెందింది. ఈసారి కూడా ఎన్డీయే ప్రభుత్వం గెలిచి హ్యాట్రిక్ కొట్టడం ఖాయం. అలాగే కాంగ్రెస్ కూడా వరుసగా మూడోసారి ఓటమి చవిచూడాల్సి వస్తుంది. ఆ పార్టీ యువరాజుకు వందోసారి కూడా ఓటమి తప్పదు' అని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కాంగ్రెస్ విభజన విధానాలను అనుసరిస్తోందని ఆరోపించారు. ఈ సందర్భంగా భాజపా విడుదల చేసిన మ్యానిఫెస్టో గురించి ప్రధాని ప్రస్తావించారు. అస్సాంలో ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ)ని అమలుచేస్తామని ప్రధాని మోదీ పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఆదివాసీల హక్కులను కాపాడతామన్నారు.

### తేయాకు తోటలో మోదీ సెల్ఫీ

అంతకుముందు డిబ్రుగఢ్ జిల్లాలోని ఒక తేయాకు తోటను ప్రధాని మోదీ సందర్శించారు. అక్కడి మహిళా కార్మికులతో కలిసి తేయాకు ఆకులను కోశారు. వారితో సెల్ఫీలు కూడా దిగారు. ఈ ఫొటోలను మోదీ తన అధికారిక ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు.

# అస్సాం, కేరళ ఎన్నికల్లో బీజేపీ హామీల జల్లు

## ఆయా రాష్ట్రాల్లో మేనిఫెస్టోల విడుదల



మహిళలకు, 70 ఏళ్లు దాటిన వృద్ధులకు, పేద కుటుంబాలకు ఆర్థిక సాయం అందిస్తామని, ప్రతి కుటుంబానికి ఏటా రెండు సిలిండర్లు ఉచితంగా ఇస్తామని కేరళలో భాజపా హామీ ఇచ్చింది. రాష్ట్రంలో ఎయిమ్స్‌ను ఏర్పాటు చేస్తామని, ప్రార్థనా స్థలాలను పరిరక్షిస్తామని పేర్కొంది. ఈ నెల 10న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల కోసం ఆ పార్టీ మ్యానిఫెస్టోను విడుదల చేసింది. తిరువనంతపురంలో ఆ బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్ దీనిని విడుదల చేశారు..


పేద కుటుంబాల్లోని ప్రతి మహిళకు 'భక్ష్య ఆరోగ్య సురక్ష కార్డు' అందజేత. ప్రతి నెలా రూ.2500తో రీఛార్జి. ఈ డబ్బుతో వారు ఔషధాలు, నిత్యావసరాలు కొనుక్కోవచ్చు.కుటుంబాన్ని నడిపే పేద మహిళలకు, వితంతువులకు, 70 ఏళ్లు దాటిన సీనియర్ సిటిజన్లకు సంక్షేమ పింఛనుగా రూ.3,000 అందజేత. ఓనం, క్రిస్మస్ సందర్భంగా ఒక్కో సిలిండరు ఉచితంగా సరఫరా.. తిరువనంతపురం నుంచి కన్నూర్ వరకు హైస్పీడ్ రైల్వే నెట్వర్క్ ఏర్పాటు. ప్రతి కుటుంబానికి 20,000 లీటర్ల తాగునీరు ఉచితం. ముళ్ల పెరియార్ డ్యాంకు సంబంధించి తమిళనాడుకు నీరు, కేరళకు భద్రత. శబరిమల ఆలయంలో బంగారం చోరీపై కాల పరిమితితో సీబీఐ దర్యాప్తు, శబరిమల మౌలిక వసతుల అభివృద్ధి బోర్డు ఏర్పాటు. పంటలకు కనీస మద్దతు ధర.

### అస్సాంలో మ్యానిఫెస్టో విడుదల

అస్సాం అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అధికార భారతీయ జనతా పార్టీ(భాజపా) మ్యానిఫెస్టోను విడుదల చేసింది. మొత్తం 31 హామీలతో విడుదల చేసిన ఈ సంకల్ప పత్రంలో మహిళా సాధికారతకు పెద్దపీట వేసింది. 'ఒరుజోదోయ్' పథకం కింద రూ.1,500గా ఉన్న నగదు సహాయాన్ని రూ.3 వేలకు పెంచుతామని, 'లఖ్పతి దీదీ' ద్వారా 40 లక్షల మంది మహిళలను లక్షాధికారులుగా చేసేందుకు రూ.25,000 చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చింది.

# ఒకప్పుడు ఆప్తమిత్రులు.. ఇప్పుడు రాజకీయ విరోధులు

## మాజీముఖ్యమంత్రులు వీ వైద్యలింగం వర్సెస్ రంగస్వామి



రంగసామి, వి. వైద్యలింగం.. గతంలో మిత్రులే. కాంగ్రెస్లో కలిసున్నారు. 2011లో రంగసామి సొంతంగా ఆలిండియా ఎన్ఆర్ కాంగ్రెస్ పెట్టేవరకూ ఒకే పార్టీలో సభ్యులు, ఇద్దరూ ముఖ్యమంత్రులుగా పని చేశారు. ఒకరు సీఎంగా ఉంటే మరొకరు పాలనలో భాగమయ్యారు. రంగసామి బయటికొచ్చి పార్టీ పెట్టడంతో ఇద్దరూ రాజకీయ విరోధులయ్యారు. ఇప్పుడు ఎన్డీయే కూటమికి రంగసామి నాయకత్వం వహిస్తుండగా, డీఎంకే, కాంగ్రెస్ ఉన్న లౌకికవాద ప్రగతిశీల కూటమిని (ఎస్పీఏ) వి. వైద్యలింగం నడిపిస్తున్నారు. ఇద్దరూ ఇప్పుడు ముఖ్యమంత్రి అభ్యర్థులే.... ఆశ్చర్యకరంగా వారిద్దరూ ఒకే నియోజకవర్గం నుంచి బరిలో ఉన్నారు. తట్టంచావడిలో తలపడుతున్నారు. దీంతో పోటీ అత్యంత ఆసక్తికరంగా మారింది.గతంలో వైద్యలింగం ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రంగసామి వ్యవసాయ సహకారశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఇప్పుడు ముఖ్యమంత్రిగా ఎదిగి తన సహచరుడిపైనే 'సై' అంటున్నారు. ప్రస్తుతం పోటీ చేస్తున్న తట్టంచావడి నియోజకవర్గం నుంచే గతంలో 1000–2006 మధ్య నాలుగు సార్లు, 2021లో మరోసారి గెలిచారు. పుదుచ్చేరిలో ఫ్రెంచి పాలనపై తిరుగుబాటు చేసిన కుటుంబం నుంచి వచ్చారు వి. వైద్యలింగం. వారిది తెలుగు మూలాలున్న కుటుంబం. తండ్రి వెంకటసుబ్బ రెడ్డియార్ గతంలో రెండుసార్లు పుదుచ్చేరి ముఖ్యమంత్రిగా పని చేశారు. తాత వైద్యలింగం రెడ్డియార్ పుదుచ్చేరిలోని నెట్టపాక్కం ప్రాంత మేయర్‌గా పని చేశారు. వారి నుంచి రాజకీయ ఓనమాలు నేర్చుకున్న వి. వైద్యలింగం.. అదే బాటలో తిరుగులేకుండా నడుస్తున్నారు. తన తొలి ఎన్నిక తప్పితే.. డబుల్ హ్యాట్రిక్‌తో కలిపి వరుసగా సార్లు ఎమ్మెల్యే అయ్యారు. నెట్టపాక్కం నుంచి ఆరుసార్లు, కామరాజనగర్ నుంచి రెండుసార్లు గెలిచారు. 2010., 2024లో రెండు సార్లు ఎంపీ అయ్యారు.



# 'ఇంధన ధరలు పెంచే ప్రసక్తే లేదు

## పెట్రోలియం శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ వెల్లడి

పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతాయన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో కేంద్రం స్పందిస్తూ.. 'ఇంధన ధరలు పెంచే ప్రసక్తే లేదని స్పష్టం చేసింది. దేశంలో చమురు నిల్వలు సరిపడా ఉన్నాయని పెట్రోలియం శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ వెల్లడించారు. "దేశంలో చమురు, గ్యాస్ నిల్వలు రెండు నెలలకు సరిపడా ఉన్నాయి. రాబోయే రోజుల్లో కొరత ఏర్పడుతుందనే ఆందోళనతో అధికంగా కొనాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం ఎల్పీజీ నిల్వలు కూడా సరిపడా ఉన్నాయి. ఒక వేళ సరఫరాలో అంతరాయాలు ఏర్పడితే తీసుకోవాల్సిన చర్యలపై కేంద్రం యోచిస్తోంది. రిఫైనరీలు గరిష్ఠ సామర్థ్యంతో పనిచేస్తున్నాయి. రెండు నెలల క్రితం బ్యారెల్కు 70 డాలర్ల దగ్గర ట్రేడ్ అయిన బ్రెంట్ క్రూడ్, ఈ రోజు 100 డాలర్ల మార్కును దాటింది. 2022 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు డీజిల్, పెట్రోలు ధరలను పెంచలేదు. వినియోగదారులపై భారం తగ్గించేందుకు ఎక్సైజ్ డ్యూటీ తగ్గించాం" అని పేర్కొన్నారు.



# ఛత్తీస్‌గఢ్‌లో 34 మంది మావోయిస్టుల లొంగుబాటు

## బీజాపూర్ ఎస్పీ జితేంద్రకుమార్ యాదవ్ వెల్లడి

ఛత్తీస్‌గఢ్‌లోని వివిధ జిల్లాల్లో 34 మంది మావోయిస్టులు లొంగిపోయారు. దేశానికి మావోయిస్టు తీవ్రవాదం నుంచి విముక్తి కల్పించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నక్సల్స్ మిషన్–2026 గడువు మార్చి 31తో ముగిసింది. దాంతో చివరిరోజు మావోయిస్టులు భారీ సంఖ్యలో లొంగిపోయారు. బీజాపూర్ జిల్లాలో 25 మంది లొంగిపోవడంతోపాటు 08 ఆయుధాలను, రూ.11.10 కోట్ల విలువైన 1.2 కిలోల బంగారాన్ని, రూ.200 కోట్ల నగదును అప్పగించినట్లు ఆ జిల్లా ఎస్పీ జితేంద్రకుమార్ యాదవ్ వెల్లడించారు. దంతెవాడ జిల్లాలో మావోయిస్టుల దండకారణ్య ప్రత్యేక జోనల్ కమిటీకి చెందిన ఐదుగురు తమ ఆయుధాలతో సహా లొంగిపోయారు. సుక్మా జిల్లాలో ఇద్దరు మహిళా మావోయిస్టులు లొంగిపోయారు. వీరిచ్చిన సమాచారంతో రూ.10 లక్షల నగదు. భారీగా ఆయుధాల డంపును బలగాలు స్వాధీనం చేసుకున్నాయని ఎస్పీ కిరణ్ చవాన్ తెలిపారు. కాంకేర్ జిల్లాలోనూ ఇద్దరు లొంగిపోయి, ఏకే–47 రైఫిల్‌ను పోలీసులకు అందజేశారు.

# ఛత్తీస్‌గఢ్ బీజేపీ కార్యాలయం వద్ద పేలుడు

చండీగఢ్‌లోని కార్యాలయం వద్ద పేలుడు సంభవించింది. పార్కింగ్ చేసిన స్కూటీలో పేలుడు జరిగింది. పోలీసులు ఘటనాస్థలిక చేరుకొని దర్యాప్తు చేపట్టారు. చిన్న పేలుడు వస్తువు విసిరినట్లు అనిపించిందని, ఇది ఆకతాయిల పని అయి ఉండవచ్చని అనుమానిస్తున్నట్టు సీనియర్ ఎస్పీ కన్వార్ద్ ప్ కౌర్ వెల్లడించారు. ఘటనా ప్రదేశాన్ని ఆధీనంలోకి తీసుకున్న పోలీసులు.. నగరంలో భద్రతను కట్టుదిట్టం చేశారు.



# కారు చౌకగా క్రిప్టో మైనింగ్.. ఆపై కనకవర్షం..!

## తుక్కు నౌకలు, మడ్డి చమురుతో ఇరాన్ సాధించి సంధించిన రహస్య ఆయుధాలు



వేల కొద్దీ అంతర్జాతీయ ఆంక్షలు.. అమెరికాకు భయపడి అంటీముట్టనట్లుండే మిత్రులు.. డాలర్ తో పోలిస్తే పాతాళానికి పడిపోయిన కరెన్సీ.. మరోవైపు ఆధునిక కాలంలో యుద్ధం అంటే కరెన్సీ కట్టలను కుప్పలు పోసి తగలపెట్టడం లాంటిదే.. సొంతంగా ఆయుధాలు తయారు చేసుకోవాలన్నా భారీగా సొమ్ములు అవసరం. దాదాపు నెల రోజులుగా ఇరాన్ తనపై ఇజ్రాయెల్, అమెరికా చేస్తున్న దాడులకు బలంగా సమాధానం ఇస్తోంది. ఆ దేశం వద్ద ఆదాయానికి ఉన్న మార్గాలు మొత్తం మూసుకుపోయినా ఎలా సాధ్యమైంది. ఇరాన్ ఆంక్షలకు రాటుదేలిపోయింది.. తన వద్ద ఉన్న వనరులను వాడుకొని వాటికి ప్రత్యామ్నాయ మార్గాలను కనుగొని చురుగ్గా ఉపయోగించుకుంటోంది. దీంతో అమెరికా, ఇజ్రాయెలను ఎదురు దాడులతో ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

ఇరాన్ నుంచి కొన్నేళ్లుగా అంతర్జాతీయ చమురు ఎగుమతులు నిలిచిపోయాయి. కానీ, ఆ దేశం వద్ద చమురు నిల్వలు పుష్కలంగా ఉన్నాయి. మరోవైపు క్రిప్టో మైనింగ్ కు భారీగా విద్యుత్తు అవసరం. ఇక్కడే టెహ్రాన్ తెలివిగా ఆలోచించింది. చైనా సహకారంతో బిట్ కాయిన్ మైనింగ్‌క్కు పెట్టుబడులను సాధించింది. 2019లో ఇరాన్లో క్రిప్టో మైనింగ్ చట్టబద్ధం చేసి.. లైసెన్సు జారీ చేయడం మొదలుపెట్టింది. వీరిక అవసరమైన విద్యుత్తును అధిక రేట్లకు విక్రయించింది. ప్రభుత్వ సాయంతో కూడా. మైనింగ్ కొనసాగింది. ఇరాన్కు చెందిన రివల్యూషనరీ గార్డ్స్ కోర్ కూడా దీనిలో చురుకైన పాత్ర పోషించింది. ఇరాన్లో 2020లో బిట్కాయిన్ మైనింగు 600 మెగావాట్ల విద్యుత్తును వాడినట్లు చైనాన్స్ .కామ్ పేర్కొంది. ఇది కోటి బ్యారెళ్ల చమురుతో సమానం. ఇరాన్కు ఒక బిట్ కాయిన్ మైనింగ్కు 1,300 డాలర్లు మాత్రమే ఖర్చవుతుందని అమెరికాకు చెందిన క్రిప్టో ప్లాటజిస్ట్ జాక్ పెర్సీ వెల్లడించారు. ఇదే అంతర్జాతీయ మార్కెట్లో 60,000–75,000 డాలర్ల మధ్యలో ట్రేడవుతోంది. పైగా దీనిపై అమెరికా డాలర్ వలే ప్రపంచ బ్యాంకింగ్ వ్యవస్థలోని అమెరికా ట్రెజరీ, స్విఫ్ట్ వ్యవస్థ ఆంక్షలు దీనిపై పనిచేయవు. 2025 నాటికి ఇరాన్ వద్ద 7.78 బిలియన్ డాలర్లు విలువైన క్రిప్టో సామ్రాజ్యం ఉన్నట్లు బ్లాక్లెన్ ఎనాలసిస్ సంస్థ అంచనా వేసింది. వీటిల్లో సగానికి పైగా బఆర్ జెసీ నుంచే వచ్చాయి. ఒక్క 2025లోనే 3 బిలియన్ డాలర్ల విలువైన క్రిప్టోను తరలించేశారు. అమెరికా దాడులు మొదలయ్యాక.. ఇరాన్ అతిపెద్ద క్రిప్టో ఎక్స్చేంజి నోబిటెక్స్ నుంచి మొదటి మూడ్రోజుల్లో 10 మిలియన్ డాలర్ల విలువైన బిట్కాయిన్లు విదేశీ ఎక్స్ చేంజిలకు వెళ్లిపోయాయి. ఇది ఆ ఎక్స్చేంజి సాధారణ సగటు కంటే 8.3 అధికం.

# భారత్‌కు బయలుదేరిన ఇరాన్ చమురు నౌక



యుద్ధం కారణంగా సముద్రంలో నిలిచిపోయిన ఇరాన్ ముడి చమురుపై ఆంక్షలను ఎత్తివేస్తున్నట్లు ఇటీవల అమెరికా పేర్కొన్న విషయం తెలిసిందే. దీంతో ఇరాన్ చమురు కొనుగోలుకు భారత రిఫైనరీలు ఆసక్తి చూపిస్తున్నాయి. ఈ క్రమంలో ఇటీవల ఇరాన్ నుంచి ఓ ఆయిల్ ట్యాంకర్ భారత్ వైపు బయల్దేరింది. మార్చి 4వ తేదీన ఖర్గ్ ద్వీపం వద్ద ట్యాంక్ లోకి చమురు లోడింగ్ చేశారని.. ఏప్రిల్ 4న గుజరాత్ వాడినార్ పోర్టుకు ఇది చేరుకోనుందని డేటా ఇంటెలిజెన్స్ సంస్థ కెప్లర్ వెల్లడించింది. 2019 తర్వాత ఇరాన్ చమురు భారత్ రావడం ఇదే తొలిసారి. ఇందులో దాదాపు 6,00,000 బ్యారెళ్ల చమురు ఉండొచ్చని అంచనా. ఇరాన్ నుంచి వస్తున్న ఈ చమురును ఏ భారతీయ రిఫైనరీ ఉపయోగించనుందనే విషయంపై ఎటువంటి సమాచారం లేదు. గతంలో భారత్ ఇరాన్ చమురుకు ప్రధాన కొనుగోలుదారుగా ఉండేది. ఒకానొక సమయంలో.. మొత్తం చమురు దిగుమతుల్లో ఇరాన్ వాటా సుమారు 11.5 శాతంగా ఉండేది. 2018లో భారత్ రోజుకు సుమారు 5,18,000 బ్యారెళ్ల ఇరాన్ చమురును దిగుమతి చేసుకోగా.. మే 2019 నాటికి అది రోజుకు 2,68,000 బ్యారెళ్లకు తగ్గింది. ఆ తర్వాత, ఇరాన్పై అమెరికా ఆంక్షల కారణంగా ఆ దేశం నుంచి చమురు దిగుమతులు పూర్తిగా తగ్గిపోయాయి.

# అది మా యుద్ధం కాదు!

## యూకే ప్రధాని కీర్ స్టార్మర్ కీలక వ్యాఖ్యలు



పశ్చిమాసియా ఘర్షణలతో హర్మూజ్ జలసంధిలో తీవ్ర అంతరాయాలు నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో యూకే ప్రధాని కీర్ స్టార్మర్ కీలక వ్యాఖ్యలు చేశారు. హర్మూజ్‌ను తిరిగి తెరిచే మార్గాలపై చర్చించేందుకు ప్రపంచ స్థాయి సదస్సు నిర్వహిస్తామని ప్రకటించారు. ఇందుకోసం అందుబాటులో ఉన్న ప్రతి దౌత్య మార్గాన్ని పరిశీలిస్తున్నామన్నారు. అయితే ఇరాన్ యుద్ధంలోకి మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ దిగబోమని తేల్చిచెప్పారు. హర్మూజ్ జలసంధి విషయంలో తన మాట వినని యూకేకు అమెరికా సాయం చేయబోదన్న ట్రంప్ హెచ్చరికలపై స్టార్మర్ స్పందిస్తూ.. ఎవరు ఎంత ఒత్తిడి తీసుకువచ్చినా బ్రిటన్ ప్రయోజనాల కోసమే ఆలోచిస్తానన్నారు. ఇది తమ యుద్ధం కాదని.. అందువల్లే ఇందులోకి వెళ్లదలుచుకోలేదని స్పష్టంచేశారు. ప్రస్తుత సంఘర్షణలతో యూకే భవిష్యత్తుపై గణనీయమైన ప్రభావం పడుతోందని.. ఇంధన సరఫరాకు అంతరాయం కలగడం వల్ల జీవన వ్యయం పెరుగుతుందని అన్నారు. అయినప్పటికీ ఈ సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి దేశం సిద్ధంగా ఉందన్నారు.. ప్రస్తుత సమయంలో అమెరికాతో కంటే సహచర ఐరోపా దేశాలతో బలమైన సంబంధాలు కలిగి ఉండడమే బ్రిటన్ కు ప్రయోజనకరమని అభిప్రాయం వ్యక్తం చేశారు.



# ఆ కూటమి కాగితపు పులి

## అందుకే నాటో నుంచి తప్పుకునే ఆలోచనలో ఉన్నా : ట్రంప్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. నాటో కూటమి నుంచి వైదొలిగే యోచనలో ఉన్నామని అన్నారు. బ్రిటన్‌కు చెందిన 'ది టెలిగ్రాఫ్' పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఆ కూటమి ఓ కాగితపు పులి వంటిదన్నారు. ఈ విషయం రష్యాకూ తెలుసునని చెప్పారు. ఆ కూటమి మాటలకు తానెప్పుడూ ప్రభావితం కాలేదన్నారు. హర్మూజ్ జలసంధిని తెరిపించేందుకు కలిసి రావాలని చేసిన విజ్ఞప్తిని పట్టించుకోకపోవడంపై నాటో దేశాలపై తీవ్ర స్థాయిలో మండిపడుతున్న ట్రంప్.. వాళ్లు పిరికివాళ్లంటూ ఇటీవల విమర్శించిన విషయం తెలిసిందే. రష్యాతో నాలుగేళ్లుగా ఉక్రెయిన్ చేస్తున్న యుద్ధానికి తాము మద్దతుగా నిలిచినప్పటికీ... ఇరాన్ విషయంలో నాటో మిత్రదేశాలు అమెరికాకు తోడుగా రావడం లేదని ట్రంప్ అభిప్రాయపడ్డారు. దీన్ని తాను ఊహించలేదన్నారు. ఉక్రెయిన్‌తో తమకు సంబంధం లేకున్నా.. వారికి అండగా నిలిచామన్నారు. అయినప్పటికీ వాళ్లు తమతో కలిసి రావడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే, ట్రంప్ ఇటువంటి బెదిరింపులు చేయడం ఇదే తొలిసారి కాదు. 2018లో అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనూ ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. సభ్యదేశాలు రక్షణ బడ్జెట్‌ను ఆశించిన మేర ఖర్చు పెట్టకపోతే నాటో నుంచి బయటకు వెళ్లిపోతామని అన్నారు. ప్రతి సభ్య దేశం తన జీడీపీలో కనీసం రెండు శాతం రక్షణపై ఖర్చు చేయాలని సభ్య దేశాలు గతంలో నిర్ణయించాయి.

## ట్రంప్ సుంకాలన్నీ 45 రోజుల్లో వెనక్కు

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన సుంకాలు వెల్లవంటూ ఆ దేశ సుప్రీంకోర్టు గతంలో తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో టారిఫ్ రూపంలో వసూలు చేసిన 166 బిలియన్ డాలర్ల సొమ్మును తిరిగి ఇవ్వాల్సిన పరిస్థితి వచ్చింది. ఈ రిఫండింగ్ ప్రాసెస్ కు సంబంధించి ఏర్పాటుచేసిన వ్యవస్థ దాదాపు పూర్తయిందని అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ సంస్థ పేర్కొంది. రిఫండ్లకు సంబంధించిన దరఖాస్తులను సమీక్షించి ప్రాసెస్ చేయడానికి 45 రోజుల సమయం పట్టవచ్చని పేర్కొన్నారు.

# రెచ్చిపోయిన సైబర్ నేరగాళ్ళు

## అమెరికన్ కంపెనీలకు కోలుకోలేని దెబ్బ

ఉత్తర కొరియాకు చెందిన సైబర్ నేరగాళ్లు రెచ్చిపోయారు. వేలాది అమెరికా కంపెనీలు ఉపయోగించే సాఫ్ట్వేర్ ప్యాకేజీని అక్రమంగా యాక్సెస్ చేశారు. ఈ సైబర్ దాడి నుంచి అమెరికా కంపెనీలు కోలుకోవడానికి కొన్ని నెలల సమయం పట్టనుందని సెక్యూరిటీ నిపుణులు అంచనా వేస్తున్నారు..అమెరికా ఆర్థికవ్యవస్థకు సంబంధించిన ప్రతి రంగంలోని కంపెనీలు ఉపయోగించేయాక్సియోస్ అనే ఓపెన్ సోర్సు సాఫ్ట్వేర్కు నిర్వహించే ఓ సాఫ్ట్వేర్ డెవలపర్‌ఖాతాను హ్యాకర్లు యాక్సెస్ చేశారు. దాంతో ఆ సాఫ్ట్వేర్కు సంబంధించిన తప్పుడుఅప్ డేట్లను కంపెనీలకు పంపించారు. హ్యాకింగ్ను గుర్తించిన సాఫ్ట్వేర్ డెవలపర్ తనఅకౌంట్ను తిరిగి తన నియంత్రణలోకి తెచ్చుకొనేవరకు ఈ దాడి జరిగినట్లుఅంతర్జాతీయ కథనాలు వెల్లడించాయి. ఈ ప్రభావాన్ని అంచనా వేసి, దానినుంచికోలుకునేందుకు ఆయా కంపెనీలకు కొన్ని నెలల సమయం పట్టొచ్చని తెలుస్తోంది.ఇది ఉత్తరకొరియా హ్యాకర్ల పనేనని సైబర్ ఇంటెలిజెన్స్ సంస్థలు వెల్లడిస్తున్నాయి. ఉత్తర కొరియాకు చెందిన హ్యాకర్లు ఇలాంటి దాడులకు పాల్పడటం ఇదేం కొత్తకాదు. గతంలో పలు బ్యాంకులు, క్రిప్టో కరెన్సీ సంస్థలపై సైబర్ దాడికి పాల్పడి బిలియన్ల డాలర్లు దొంగిలించారని వార్తలు వచ్చాయి. ఆ సొమ్మును కిమ్ యంత్రాంగం తమ క్షిపణుల అభివృద్ధికి వినియోగిస్తున్నట్లు సమాచారం.



# ఢిల్లీపై లక్నో విజయం



ఐపీఎల్ 2026 సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ శుభారంభం చేసింది. బుధవారం లక్నో వేదికగా జరిగిన తమ తొలి మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన ఢిల్లీ క్యాపిటల్స్ 6 వికెట్ల తేడాతో లక్నో సూపర్ జెయింట్స్‌ను ఓడించింది. బౌలింగ్‌లో లుంగి ఎంగిడ(3/27), నటరాజన్(3/29) తీన్మార్ బౌలింగ్‌తో సత్తా చాటితే.. బ్యాటింగ్‌లో ఇంపాక్ట్ ప్లేయర్ సమీర్ రిజ్వీ(47 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్స్‌లతో 70 నాటౌట్), ట్రిస్టన్ స్టబ్స్(32 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 39) అసాధారణ ప్రదర్శనతో విజయంలో కీలక పాత్ర పోషించారు.

ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన లక్నో సూపర్ జెయింట్స్ 18.4 ఓవర్లలో 141 పరుగులకు ఆలౌటైంది. మిచెల్ మార్ష్(28 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లతో 35), అబ్దుల్ సమద్(25 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 36) టాప్ స్కోరర్లుగా నిలవగా.. మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. ఢిల్లీ బౌలర్లలో లుంగి ఎంగిడితో పాటు నటరాజన్ మూడు వికెట్లు తీయగా.. కుల్దీప్ యాదవ్ రెండు వికెట్లు పడగొట్టాడు. అక్షర్ పటేల్‌కు ఒక వికెట్ దక్కింది.

అనంతరం ఢిల్లీ క్యాపిటల్స్ 17.1 ఓవర్లలో 4 వికెట్లకు 145 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. టాప్-4 బ్యాటర్లు కేఎల్ రాహుల్(0), పాతుమ్ నిస్సంక(1), నితీష్ రాణా(15), అక్షర్ పటేల్(0) విఫలమైనా.. ట్రిస్టన్ స్టబ్స్, సమీర్ రిజ్వీ అసాధారణ బ్యాటింగ్‌తో ఢిల్లీ విజయలాంఛనాన్ని పూర్తి చేశారు. ఈ ఇద్దరూ ఐదో వికెట్‌కు అజేయంగా 119 పరుగులు జోడించారు. లక్నో బౌలర్లలో ప్రిన్స్ యాదవ్ 2 వికెట్లు తీయగా.. మహమ్మద్ షమీ, మోహ్‌సిన్ నఖ్వీ తలో వికెట్ తీసారు.

**టర్నింగ్ పాయింట్..**

లక్నో సూపర్ జెయింట్స్ బ్యాటింగ్ వైఫల్యం ఆ జట్టు విజయవకాశాలను దెబ్బతీసింది. బౌలింగ్‌లో ఆ జట్టుకు మెరుగైన ఆరంభం లభించినప్పటికీ.. ట్రిస్టన్ స్టబ్స్, సమీర్ రిజ్వీ అసాధారణ బ్యాటింగ్‌తో మ్యాచ్‌ను లాగేసుకున్నారు. ఈ జోడీని విడదీయడంలో విఫలమైన లక్నో బౌలర్లు మూల్యం చెల్లించుకున్నారు. 4.3 ఓవర్లలో 26/4 స్కోర్‌తో పీకల్లోతు కష్టాల్లో పడ్డ జట్టును స్టబ్స్-రిజ్వీ గట్టెక్కించారు.

ముఖ్యంగా ఇంపాక్ట్ ప్లేయర్‌గా బరిలోకి దిగిన రిజ్వీ.. ఔటాఫ్ సిలబస్‌లా బ్యాటింగ్ చేశాడు. అతని బ్యాటింగ్‌కు ఫిదా అయిన స్టబ్స్ ఆచితూచి ఆడి రిజ్వీకి స్ట్రైక్ ఇచ్చాడు. దూకుడైన బ్యాటింగ్‌తో 33 బంతుల్లోనే ఈ జోడీ 51 పరుగులు జోడించి మ్యాచ్ మూమెంటమ్‌ను మార్చింది. దాంతో లక్నోబౌలర్లు తేలిపోయారు. మొత్తానికి ఈ జోడీ అసాధారణ బ్యాటింగ్ ప్రదర్శనతో ఢిల్లీని గెలిపించింది.

# స్టార్ కంటే సంతోషమే ముఖ్యం..

## అర్జున్ టెండూల్కర్ ఆసక్తికర వ్యాఖ్యలు



భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కుమారుడు అర్జున్ టెండూల్కర్ ఐపీఎల్‌లో ఎంట్రీ ఇచ్చి మూడేళ్లు అయినా ఇంకా అంచనాలను అందుకోలేకపోతున్నాడు. గతంలో ముంబై ఇండియన్స్ ఆడిన అతడు, ఇప్పుడు లక్నో సూపర్ జెయింట్స్ జట్టుకు మారి కొత్త సీజన్‌కు సిద్ధమవుతున్నాడు. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో అర్జున్ తన ఫోకస్ మొత్తం ఆటపైనే ఉందని చెప్పాడు. అయితే భారత్‌కు ఆడడమా లేదా ఐపీఎల్ స్టార్ అవ్వడమా అన్న ప్రశ్నకు, "ఇతరులను బాధపెట్టకుండా నేను సంతోషంగా జీవించడమే నా లక్ష్యం" అని సమాధానం ఇచ్చి అందరినీ ఆశ్చర్యపరిచాడు. సోషల్ మీడియా ట్రోల్స్‌ను పట్టించుకోనని, తన ఆటను ఆస్వాదిస్తూ అవకాశాలు వచ్చినప్పుడు బెస్ట్ ఇవ్వాలని ప్రయత్నిస్తానని తెలిపాడు. అలాగే ఇంపాక్ట్ ప్లేయర్ రూల్‌కు తాను వ్యతిరేకమని, క్రికెట్ 11 మందితోనే ఆడాలని అభిప్రాయం వ్యక్తం చేశాడు. మొత్తానికి, ఈ సీజన్‌లో లక్నో తరఫున అర్జున్ తన ప్రతిభను నిరూపించుకోవాలని చూస్తున్నాడు.

# చరిత్ర సృష్టించిన న్యూజిలాండ్

- **టీమిండియా రికార్డు బద్దలు కొట్టిన కివీస్ మహిళల జట్టు**
- **అమేలియా కెర్ అద్భుత ఇన్నింగ్స్**
- **చివరి ఓవర్లో ఉత్కంఠభరిత ముగింపు**
- **దక్షిణాఫ్రికా భారీ స్కోరు వృథా**



మహిళల వన్డే క్రికెట్ చరిత్రలో బుధవారం ఒక చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో న్యూజిలాండ్ సంచలన విజయం సాధించింది. మహిళల వన్డే క్రికెట్ చరిత్రలోనే అత్యంత భారీ లక్ష్యాన్ని ఛేదించి కొత్త ప్రపంచ రికార్డును సృష్టించింది.

వెల్లింగ్టన్‌లోని బేసిన్ రిజర్వ్ మైదానంలో జరిగిన ఈ మ్యాచ్ క్రికెట్ అభిమానులకు అద్భుత అనుభూతిని అందించింది. 347 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించిన న్యూజిలాండ్ జట్టు.. వన్డే చరిత్రలోనే అత్యధిక రన్ ఛేజ్ చేసిన జట్టుగా నిలిచింది. చివరి వరకు ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోరులో కేవలం రెండు వికెట్ల తేడాతో కివీస్ విజయం సాధించింది.

ఈ విజయంతో భారత మహిళల జట్టు పేరిట ఉన్న పాత రికార్డు చెరిపోయింది. గత ఏడాది అక్టోబర్‌లో ఆస్ట్రేలియాపై 339 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన భారత్ అప్పట్లో రికార్డు సృష్టించింది. అయితే ఇప్పుడు న్యూజిలాండ్ 347 పరుగుల లక్ష్యాన్ని చేరుకోవడంతో భారత్ రెండో స్థానానికి పడిపోయింది.

ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ కెప్టెన్ అమేలియా కెర్ విశ్వరూపం ప్రదర్శించింది. భారీ లక్ష్య ఛేదనలో వికెట్లు పడుతున్నా, ఆమె మాత్రం ధైర్యంగా పోరాడింది. కేవలం 139 బంతుల్లో 23 ఫోర్లు, ఒక సిక్సర్‌తో అజేయంగా 179 పరుగులు చేసి జట్టును విజయతీరాలకు చేర్చింది.

చివరి ఓవర్లో 11 పరుగులు అవసరమైన సమయంలో, నాడిన్ డిక్లర్క్ బౌలింగ్‌లో వరుసగా మూడు ఫోర్లు బాది మ్యాచ్‌ను ముగించింది. ఇసాబెల్లా గేజ్ 68 పరుగులతో అందించిన మద్దతు కూడా కీలకంగా మారింది.

ఇక ముందుగా బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా జట్టు 50 ఓవర్లలో 6 వికెట్లకు 346 పరుగులు చేసింది. లారా వోల్వార్డ్ 69, అనీకే బోష్ 91 పరుగులతో బలమైన పునాది వేశారు. చివర్లో క్లో ట్రయాన్ 25 బంతుల్లో 52 పరుగులతో వేగంగా ఆడింది.

అయితే అమేలియా కెర్ అద్భుత ఇన్నింగ్స్ ముందు ఆ స్కోరు సరిపోలలేదు. అయాబొంగా ఖాకా మూడు వికెట్లు తీసినా ఫలితం మారలేదు.

ఈ విజయంతో మూడు వన్డేల సిరీస్ 1-1తో సమమైంది. సిరీస్‌ను నిర్ణయించే చివరి మ్యాచ్ ఏప్రిల్ 4న ఇదే వేదికగా జరగనుంది. ఒకే మ్యాచ్‌లో రెండు జట్లు కలిపి దాదాపు 700 పరుగులు రావడం మహిళల క్రికెట్ ఎదుగుదలను స్పష్టంగా చూపిస్తోంది. ఇప్పుడు అందరి చూపు ఏప్రిల్ 4న జరిగే నిర్ణయాత్మక పోరు కోసం ఆసక్తిగా ఎదురుచూస్తోంది.



# మ్యాక్స్‌వెల్‌కు షాక్..

## ఆసీస్ సెంట్రల్ కాంట్రాక్ట్‌లో దక్కని చోటు

*సిడ్నీ: ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డు 2026-27 సీజన్‌కు సంబంధించిన సెంట్రల్ కాంట్రాక్ట్‌ల జాబితాను ప్రకటించింది. మొత్తం 21 మంది ఆటగాళ్లకు చోటు కల్పించిన ఈ జాబితాలో వెటరన్ ఆల్‌రౌండర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్‌కు స్థానం లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఏ కేటగిరీలోనూ అతడికి అవకాశం ఇవ్వకపోవడం ఆశ్చర్యానికి గురిచేసింది.*

*మ్యాక్స్‌వెల్ చివరిసారిగా 2017లో టెస్టు మ్యాచ్ ఆడాడు. రాబోయే సీజన్‌లో భారత్, న్యూజిలాండ్, ఇంగ్లాండ్, బంగ్లాదేశ్‌లతో ఆస్ట్రేలియా కీలక టెస్టు సిరీస్‌లు ఆడనున్న నేపథ్యంలో, టెస్టు ఫార్మాట్‌లో రాణించే ఆటగాళ్లకే కాంట్రాక్ట్‌లు ఇచ్చినట్లు తెలుస్తోంది.*

*ఇప్పటికే వన్డేలకు వీడ్కోలు పలికిన 37 ఏళ్ల మ్యాక్స్‌వెల్ ప్రస్తుతం కేవలం టీ20 ఫార్మాట్‌కే పరిమితమయ్యాడు. అయితే గత టీ20 ప్రపంచకప్‌లో అతని ప్రదర్శన ఆశించిన స్థాయిలో లేకపోవడం గమనార్హం. మరో రెండేళ్ల తర్వాత జరిగే టీ20 ప్రపంచకప్ దృష్ట్యా క్రికెట్ ఆస్ట్రేలియా ప్రణాళికలు రూపొందిస్తున్నప్పటికీ, వాటిలో మ్యాక్స్‌వెల్‌కు స్థానం దక్కే అవకాశాలు తగ్గినట్లే కనిపిస్తున్నాయి. దీంతో అతని అంతర్జాతీయ కెరీర్ ముగింపు దశకు చేరిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.*

*ఇక ఈ కాంట్రాక్ట్ జాబితా టెస్టు ఫార్మాట్‌కు అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు స్పష్టమవుతోంది. ఇటీవల టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించిన ఉస్మాన్ ఖవాజాకు అవకాశం లభించలేదు. అలాగే బోర్డర్-గావస్కర్ ట్రోఫీ 2024లో రాణించిన ఓపెనర్ కొన్స్టాస్ ఇటీవలి కాలంలో ఫామ్ కోల్పోవడంతో అతడినీ ఎంపిక చేయలేదు.*

*కాంట్రాక్ట్ పొందిన ఆటగాళ్లు: జేవియర్ బార్ట్‌లెట్, స్కాట్ బార్ట్‌లెట్, అలెక్స్ కేరీ, పాట్ కమిన్స్, బ్రెండన్ డగెట్, నాథన్ ఎలిస్, కామెరూన్ గ్రీన్, జోష్ హేజిల్‌వుడ్, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, మాథ్యూ కున్హెమన్, మార్నస్ లబుషేన్, నాథన్ లయన్, మిచెల్ మార్ష్, టాడ్ మార్ఫీ, మైకెల్ నెసెర్, స్టీవ్ స్మిత్, మిచెల్ స్టార్క్, జేక్ వెదర్లాండ్, బ్యూ వెబర్, ఆడమ్ జంపా.*

చైతన్య రథం
సినిమా
గురువారం 2 ఏప్రల్ 2026 X

# ‘బైకర్’ బాక్సాఫీస్ రెడీ




శర్వానంద్ హీరోగా తెరకెక్కిన తాజా చిత్రం ‘బైకర్’ మోటార్ రేసింగ్ నేపథ్యంలో, ఏప్రిల్ 3న విడుదలకు సిద్ధమవుతోంది. అయితే, విడుదలకు ఒక రోజు ముందు, అంటే ఏప్రిల్ 2న, హైదరాబాద్‌లోని పలు థియేటర్లలో ప్రత్యేక పెయిడ్ ప్రీమియర్స్ ఏర్పాటు చేశారు. ఈ షోలకు టిక్కెట్లు హాట్ కేకుల్లా అమ్ముడైపోయి, ఇప్పుడే అన్ని చోట్ల హౌస్‌ఫుల్ బోర్డులు కనిపిస్తున్నాయి.

ప్రేక్షకుల నుండి వచ్చిన భారీ రెస్పాన్స్ చూసి, చిత్ర యూనిట్ మరిన్ని థియేటర్లలో అదనపు ప్రీమియర్ షోలను ప్లాన్ చేస్తున్నారు. శర్వానంద్ ఈ సినిమా కోసం చేసిన మేకోవర్ మరియు కొత్త రకమైన కథాంశం ప్రేక్షకుల్లో మంచి బజ్ క్రియేట్ చేశాయి.

యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో మాళవిక నాయర్ హీరోయిన్‌గా నటించినట్లుగా, సీనియర్ నటుడు రాజశేఖర్ కూడా ఒక ముఖ్య పాత్రలో కనిపించనున్నారు.

దర్శకుడు అభిలాష్ రెడ్డి రూపొందించిన ‘బైకర్’ కేవలం రేసింగ్ సినిమా మాత్రమే కాదు; ఇమోషనల్ రైడ్గా ఉండబోతోంది. విశేషంగా, విజువల్స్ మరియు సౌండ్ పరంగా సరికొత్త అనుభూతిని ఇవ్వగల ఈ చిత్రం, శర్వానంద్ కెరీర్‌లో పెద్ద హిట్ అవుతుందనే ట్రేడ్ వర్గాల అంచనా.

# 100వ సినిమాతో కింగ్ బిజీ.. బిజీ



టాలీవుడ్ మెగా స్టార్ కింగ్ నాగార్జున తన 100వ సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ సినిమాకు రా. కార్తీక్ దర్శకత్వం వహిస్తున్నారు. నాగార్జున ఇటీవల కొన్ని ముఖ్యమైన అప్‌డేట్స్ ఇచ్చారు: ఇప్పటివరకు 45 శాతం షూటింగ్ పూర్తయిందని, అయితే సినిమా పేరు ఇంకా ఖరారు కాలేదని తెలిపారు.

నాగార్జున తెలిపినట్లుగా, ఈ సినిమా కథ తండ్రి-కూతుళ్ల సెంటిమెంట్ చుట్టూ తిరుగుతుంది. ఇది ఒక కమర్షియల్ మూవీ, సున్నా నుండి కోటీశ్వరుడిగా ఎదిగే ఒక వ్యక్తి ప్రయాణాన్ని చూపించనుంది. అన్నపూర్ణ స్టూడియోస్ ఈ భారీ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

స్పెషల్ ఫీచర్‌గా, నాగార్జునను 25 ఏళ్ల యువకుడిగా చూపించడానికి ‘డీ-ఏజింగ్’ టెక్నాలజీ వాడుతున్నారు. అంటే, సినిమాలో ఆయన 25 ఏళ్ల నుండి 60 ఏళ్ల వరకు వయసుల్లో కనిపించనున్నారు.

ఈ చిత్రంలో టబు, సుస్మితా భట్, విజయేంద్ర ముఖ్యమైన పాత్రల్లో నటిస్తున్నారు. మరిన్ని వివరాలు త్వరలోనే అభిమానులతో పంచుకోబడతాయి.

# డైరెక్టర్‌పై లైంగిక వేధింపుల కేసు..

మలయాళ చిత్ర పరిశ్రమలో సంచలనం రేపుతున్న లైంగిక వేధింపుల కేసులో ప్రముఖ దర్శకుడు రంజిత్ను పోలీసులు అరెస్టు చేశారు. ఓ మహిళా నటి ఇచ్చిన ఫిర్యాదు మేరకు, ఇడుక్కి జిల్లాలో ఆయనను కస్టడీలోకి తీసుకున్నట్లు సమాచారం.

బాధితురాలి ఆరోపణల ప్రకారం, షూటింగ్ సమయంలో కారవాన్‌కు పిలిపించి తనపై లైంగిక దాడికి పాల్పడ్డారని పేర్కొంది. ఈ మేరకు కొచ్చి సిటీ పోలీసులు కేసు నమోదు చేసి, తోడుపుజా పోలీస్ స్టేషన్‌లో విచారణ కొనసాగిస్తున్నారు.

మహిళలపై జరుగుతున్న అకృత్యాలపై ఏర్పాటైన జస్టిస్ హేమ కమిటీ నివేదికలో కూడా రంజిత్ పేరు ప్రస్తావనకు రావడం



గమనార్హం. అంతేకాకుండా, గతంలో 2024లో ఒక బెంగాలీ నటి కూడా ఆయనపై తీవ్ర ఆరోపణలు చేశారు. 2009లో ‘పాలేరి మాణిక్యం’ సినిమా ఆడిషన్స్ సమయంలో అసభ్యంగా ప్రవర్తించారని ఆమె కొచ్చి పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన విషయం వెలుగులోకి వచ్చింది.

వరుస ఆరోపణల నేపథ్యంలో, పోలీసులు ఈ అరెస్టు ప్రక్రియను అత్యంత రహస్యంగా నిర్వహించినట్లు సమాచారం. ప్రస్తుతం రంజిత్ పోలీసుల అదుపులో ఉండగా, మహిళా పోలీస్ స్టేషన్‌లో బాధితురాలి వాంగ్మూలాన్ని రికార్డు చేశారు.

హేమ కమిటీ నివేదిక బయటకు వచ్చిన తర్వాత, మలయాళ సినిమా రంగంలో ప్రముఖులపై వరుసగా కేసులు నమోదవుతున్నాయి. ఈ పరిణామం ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ కేసులో తదుపరి విచారణలో మరిన్ని కీలక వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# ‘లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ’

# తెలుగు టీజర్ రిలీజ్

తమిళ యంగ్ హీరో ప్రదీప్ రంగనాథన్ నటిస్తూ, విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో తెరకెక్కిన సరికొత్త చిత్రం ‘లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ’ (LIK) రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ చిత్రంలో కృతి శెట్టి హీరోయిన్‌గా నటిస్తుండగా, ఏప్రిల్ 10న తమిళంతో పాటు తెలుగులోనూ గ్రాండ్ రిలీజ్ కానుంది.

ఈ నేపథ్యంలో చిత్ర బృందం తాజాగా తెలుగు టీజర్ను విడుదల చేసింది. దాదాపు ఏడు నెలల క్రితమే తమిళంలో వచ్చిన ఈ టీజర్‌ను, ఇప్పుడు చిన్నపాటి మార్పులతో తెలుగు ప్రేక్షకులకు అందించారు.

టీజర్‌ను పరిశీలిస్తే, ఈ సినిమా 2040 కాలానికి చెందిన ఫ్యూచరిస్టిక్ కాన్సెప్ట్‌తో కూడిన ఫన్ అండ్ రొమాంటిక్ ఎంటర్టైనర్గా కనిపిస్తోంది. ప్రస్తుత కాలంలోని ఇన్‌స్టంట్ రిలేషన్‌షిప్స్‌ను ఇష్టపడని ధీమా (కృతి శెట్టి) పాతకాలపు స్వచ్ఛమైన ప్రేమను కోరుకుంటుంది.


అయితే, వీరి ప్రేమకథకు అడ్డుగా నిలిచే ‘లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ’ యజమాని సూర్య పాత్రలో ఎస్.జె. సూర్య కనిపించడం ఆసక్తిని పెంచుతోంది. అసలు అతను వీరి ప్రేమకు ఎందుకు అడ్డుగా నిలుస్తున్నాడో తెలుసుకోవాలంటే సినిమా చూడాల్సిందే.



ఈ చిత్రాన్ని నయనతారతో కలిసి ఎస్.ఎస్. లలిత్ కుమార్ నిర్మిస్తుండగా, సంగీతాన్ని అనిరుధ్ రవిచందర్ అందించారు. అలాగే యోగి బాబు, సీమన్, గౌరీ కిషన్ ఇతర కీలక పాత్రల్లో నటించారు. తెలుగులో ఈ చిత్రాన్ని శ్రీ పద్మిని సినిమాస్ విడుదల చేస్తోంది. విభిన్నమైన కాన్సెప్ట్‌తో వస్తున్న ‘హ×ఖ’, ముఖ్యంగా యూత్‌ను ఎంతవరకు ఆకట్టుకుంటుందో చూడాలి.

## మెగా డాటర్ కొత్త సినిమా..

# ‘రాకాస’ రేపే గ్రాండ్ రిలీజ్




మెగా డాటర్ నిహారిక కొణిదెల తన పింక్ ఎలిఫంట్ పిక్చర్స్ బ్యానర్‌లో తాజాగా ‘రాకాస’ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తుంది. ఈ సినిమాలో సంగీత్ శోభన్ హీరోగా, నయన్ సారిక హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇప్పటికే బజ్ క్రియేట్ చేసిన ఈ సినిమా ఏప్రిల్ 3న గ్రాండ్ రిలీజ్‌కు రానుంది.

ఇక చిత్రానికి సంబంధించిన ప్రమోషన్స్‌ను నెక్స్ట్ లెవల్‌లో చేస్తున్నారు చిత్ర యూనిట్. ఈ క్రమంలో నిహారిక ఓ ఇంటర్వ్యూలో తన బ్యానర్ నుంచి రాబోతున్న నెక్స్ట్ ప్రాజెక్ట్ ‘బరి’ గురించి కొన్ని ఇంట్రెస్టింగ్ విషయాలను పంచుకున్నారు.

నిహారిక తెలిపిన వివరాల ప్రకారం, ఈ సినిమా వరుణ్ తేజ్ హీరోగా, యదు వంశీ డైరెక్షన్‌లో పూర్తి స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కుతుంది. ఆ ఫిల్మ్ కోసం రూ.60 కోట్ల బడ్జెట్ కేటాయించినట్లు ఆమె వెల్లడించారు.

తన బ్యానర్ నుంచి రాబోయే హైయెస్ట్ బడ్జెట్ మూవీగా ‘బరి’ను పేర్కొన్నారు. పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానున్న ఈ చిత్రంలో తెలుగు హీరోయిన్ కూడా నటించనున్నారు, అయితే ఆ హీరోయిన్ ఎవరనే విషయాన్ని ఇంకా రివీల్ చేయలేదు. మొత్తానికి, ‘బరి’తో నిహారిక పాన్ ఇండియా స్థాయిలో నెక్స్ట్ లెవల్ టార్గెట్ను ఫిక్స్ చేసుకుంటున్నారు.

# యాక్షన్ థ్రిల్లర్ ‘డెకాయిట్’

**- రూ.30 కోట్ల ప్రీ-రిలీజ్ బిజినెస్**



టాలీవుడ్ యంగ్ హీరో అడివి శేష్ నటించిన లేటెస్ట్ యాక్షన్ థ్రిల్లర్ ‘డెకాయిట్’ ప్రపంచ వ్యాప్తంగా బాక్సాఫీస్ వద్ద భారీ వ్యూహాలతో రెడీ అవుతోంది. ఏప్రిల్ 10న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా కోసం ప్రీ-రిలీజ్ బిజినెస్ సుమారు రూ.30 కోట్లు నమోదైనట్లు ట్రేడ్ వర్గాలు వెల్లడిస్తున్నాయి. శేష్ కెరీర్‌లో కంటెంట్ ఉన్న సినిమాలకు ఉండే క్రేజ్ కారణంగా, ఈ చిత్రంపై ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి.

తెలుగు రాష్ట్రాల్లో థియేట్రికల్ హక్కులు దాదాపు రూ.20 కోట్లకు అమ్ముడయ్యాయి. ఇందులో నైజాం ఏరియా రూ.7 కోట్లు, ఆంధ్రప్రదేశ్ రూ.10 కోట్ల పైగా పలికాయి. అదనంగా, ఓవర్సీస్ హక్కులు రూ.6.5 కోట్లకు పైగా అమ్ముడయ్యడం వల్ల, ఒక్క తెలుగు వెర్షన్ నుండే రూ.30 కోట్ల ప్రీ-రిలీజ్ బిజినెస్ పూర్తయింది.

చిత్రంలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా, అనురాగ్ కశ్యప్ కీలక పాత్రలో నటిస్తున్నారు.

తెలుగు వెర్షన్ నుండి లాభాల్లోకి రావాలంటే రూ.50 కోట్ల పైగా గ్రాస్ అవసరం. ‘మేజర్’ సినిమాతో పాన్ ఇండియా గుర్తింపు తెచ్చుకున్న శేష్, ఈ చిత్రాన్ని హిందీలో కూడా భారీగా రిలీజ్ చేస్తున్నారు. ప్రీ-రిలీజ్ లెక్కల ప్రకారం, ‘డెకాయిట్’ అతని కెరీర్‌లో ఒక బిగ్గెస్ట్ హిట్ అవ్వాల్సిన అవకాశం ఉంది. ఏప్రిల్ 10న, ఈ చిత్రం ఎలాంటి రికార్డులు సృష్టిస్తుందో చూడాలి.